

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




నేడు ఏపీకి తమిళనాడు

## సీఎం విజయ్

ఉండవల్లిలో

సీఎం చంద్రబాబుతో మీట్

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనం

విజయవాడ(చైతన్యరథం): తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ మంగళవారం రాష్ట్రానికి రానున్నారు. మధ్యా హ్నం చెన్నై నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. ఆ తరువాత ఉండవల్లిలో సీఎం చంద్రబాబు నివాసానికి వెళతా రు. నదుల అనుసంధానం, పలు అంశాలపై చర్చించనున్నారు. అనంతరం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై కొలువు దీరిన దుర్గమ్మ ను దర్శించుకోనున్నారు.

తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాల యం నుంచి సోమవారం ఇంద్రకీలాద్రికి సీఎం భద్రతా సిబ్బంది చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ రూట్ మ్యాప్‌ను వారు పరిశీలించారు. మరోవైపు ఏపీలో సీఎం విజయ్ పర్యటన షెడ్యూల్‌ను తమిళనాడు సీఎంవో విడుదల చేసింది. ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రి వేడుకలు, విజయవాడ ఉత్సవ్ 2.0ను ఏపీ ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుంది. ఈ వేడుకలకు రావాలంటూ తమిళనాడు సీఎం జోసఫ్ విజయ్‌ను ఇటీవల చెన్నైలో టీడీపీ ఎంపీలు స్వయంగా కలిసి ఆహ్వానించారు.

# తిరుపతి సమగ్రాభివృద్ధికి శ్రీకారం



- రూ.3,222 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- అలిపిరి వద్ద యాత్రికుల టౌన్‌షిప్ నిర్మాణం
- మొదలైన మాస్టర్ ప్లాన్ రహదారులు
- టీటీడీ ఉద్యోగుల నివాస లేఅవుట్ పనుల ప్రారంభం
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- భక్తుల సమాచారానికి వెంకటాద్రి యాప్ ఆవిష్కరణ

తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, టీటీడీ పరిధిలో రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను సచివాలయం నుంచి సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యాలను కల్పించేందుకు రూ.2,750 కోట్లతో సమీకృత టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తిరుపతి నగరంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.242కోట్ల అంచనా వ్యయంతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మించనున్నారు. టీటీడీ ఉద్యోగుల కుటుంబాల సంక్షేమానికి 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి రూ.230కోట్లతో శ్రీకారం చుట్టారు. భక్తులకు సమాచారం తెలిపేందుకు రూపొందించిన వెంకటాద్రి యాప్‌ను సీఎం ఆవిష్కరించారు.

2



కాకినాడ సీఐఐ సదస్సులో

## 4,256 కోట్ల పెట్టుబడులు

\- మంత్రి నారా లోకేష్

అమరావతి(చైతన్యరథం): కాకినాడ కేంద్రంగా గోదావరి జిల్లాల్లో పెట్టుబడుల జోరు పెంచేలా సోమవారం నిర్వహించిన సీఐఐ ప్రాంతీయ సదస్సులో రూ.4,256 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఈ పెట్టుబడులతో 14 వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పించే అవ కాశం ఉందని తెలిపారు. బ్లూ ఎకానమీ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధిలో గోదావరి జిల్లాలు కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు.



ఈ ప్రాంతం లోని పెట్టుబడి అవకాశాలను పారిశ్రామికవేత్తలకు పరిచయం చేయడమే లక్ష్యంగా కాకినాడలో ప్రాంతీయ సదస్సు నిర్వహించిన ట్లు తెలిపారు. విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని చెబుతూ.. వేగవంతమైన నిర్ణయాలు, పారిశ్రామిక అభివృద్ధికి ఏపీని ఎంచుకో వాలని పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

మరింత వేగవంతంగా క్లియర్ చేయాలి

జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించాలి: ముఖ్యమంత్రి చంద్రబాబు



2

రాష్ట్రవ్యాప్తంగా

## వెంకన్న ఆలయాలు

- 175 నియోజకవర్గాల్లో వేంకటేశ్వర స్వామి ఆలయాల నిర్మాణానికి నిర్ణయం
- ఒక్కో ఆలయానికి రూ.5 నుంచి రూ.10 కోట్ల వరకు కేటాయింపు
- 2028 నాటికి 5,000 నూతన ఆలయాల నిర్మాణమే లక్ష్యం
- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి

5

## విజయవాడలో తొలిసారిగా జాతీయ సరస్ మేళా

- 13 నుంచి 31 వరకు నిర్వహణ.. ప్రారంభించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- 31 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం నుంచి 1,142 మంది మహిళా పారిశ్రామికవేత్తలు
- 571కు పైగా స్టాళ్లలో గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు

4



## మున్సిపల్ రిజరేషన్ల ఖరారు

17 మేయర్, 106 చైర్మన్ స్థానాలకు ఫిక్స్

మహిళా అభ్యర్థులు, బీసీలకు పెద్దపీట

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 17 మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్, 106 మున్సిపాలిటీల చైర్మన్ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. 17 కార్పొరేషన్‌లలో బీసీ 5, ఎస్సీ 2, ఎస్టీ 1, జనరల్ మహిళ 5, అన్ రిజర్వ్‌డ్‌కు 4 స్థానాలు కేటాయించారు. 106 మున్సిపాలిటీల చైర్మన్లకు సంబంధించి ఎస్టీ జనరల్ 2, ఎస్టీ మహిళ 1, ఎస్సీ జనరల్ 7, ఎస్సీ మహిళ 7, బీసీ జనరల్ 18,బీసీ మహిళ 18, అన్‌రిజర్వ్‌డ్ జనరల్ అభ్యర్థులకు 26, జనరల్ మహిళలకు 27 స్థానాలు రిజర్వ్ చేశారు.

3

### మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ రిజర్వేషన్లు

| | | | |
|---|---|---|---|
| మంగళగిరి తాడేపల్లి | - ఎస్టీ జనరల్ | శ్రీకాకుళం | - జనరల్ మహిళ |
| రాజమహేంద్రవరం | - ఎస్సీ జనరల్ | గుంటూరు | - జనరల్ మహిళ |
| కర్నూలు | - ఎస్సీ మహిళ | కడప | - జనరల్ మహిళ |
| మచిలీపట్నం | - బీసీ మహిళ | విశాఖపట్నం | - జనరల్ మహిళ |
| కాకినాడ | - బీసీ మహిళ | తిరుపతి | - అన్ రిజర్వ్‌డ్ |
| ఏలూరు | - బీసీ జనరల్ | విజయవాడ | - అన్ రిజర్వ్‌డ్ |
| అనంతపురం | - బీసీ జనరల్ | ఒంగోలు | - అన్ రిజర్వ్‌డ్ |
| చిత్తూరు | - బీసీ జనరల్ | నెల్లూరు | - అన్ రిజర్వ్‌డ్ |
| విజయనగరం | - జనరల్ మహిళ | | |

### మున్సిపల్ చైర్మన్ రిజర్వేషన్లు

| | |
|---|---|
| ఎస్టీ జనరల్ | - 2 |
| ఎస్టీ మహిళ | - 1 |
| ఎస్సీ జనరల్ | - 7 |
| ఎస్సీ మహిళ | - 7 |
| బీసీ జనరల్ | - 18 |
| బీసీ మహిళ | - 18 |
| అన్ రిజర్వ్‌డ్ | - 26 |
| జనరల్ మహిళ | - 27 |

# తిరుపతి సమగ్రాభివృద్ధికి శ్రీకారం

- రూ.3,222 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- అలిపిరి వద్ద యాత్రికుల టౌన్‌షిప్ నిర్మాణం
- మొదలైన మాస్టర్ ప్లాన్ రహదారులు
- టీటీడీ ఉద్యోగుల నివాస లేఅవుట్ పనుల ప్రారంభం
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- భక్తుల సమాచారానికి వెంకటాద్రి యాప్ ఆవిష్కరణ
- పవిత్రత విషయంలో ఎక్కడా రాజీపడబోమని స్పష్టం



అమరావతి/తిరుపతి(చైతనరథం): ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుమల-తిరుపతి ప్రాంతాన్ని మరింత అద్భుతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేలా చేపట్టిన పనులకు ముఖ్యమంత్రి చంద్రబా బు శ్రీకారం చుట్టారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, టీటీడీ పరిధిలో రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను  సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యాలను కల్పించేందుకు రూ.2,750 కోట్లతో సమీకృత టౌన్‌షిప్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన, ఆధ్యాత్మిక అనుభూతిని అందించేలా తిరుపతిలోని అలిపిరి సమీపంలో ఎస్వీ జూపార్కు రహదారి వద్ద సమీకృత యాత్రికుల టౌన్‌షిప్‌ను అభివృ ద్ధి చేస్తున్నారు. మొత్తం రూ.2,750 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో వసతి, అన్నప్రసాదం, విశ్రాంతి, రవాణా, పార్కిం గ్, వైద్యసేవలు, డిజిటల్ సమాచార కేంద్రాలు సహా భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకు రానున్నారు. భక్తుల వసతి కోసం రూ.1,332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో 10 అంతస్తుల చొప్పున మొత్తం 2,700 గదులను నిర్మించనున్నారు. వీటి ద్వారా రోజుకు సుమారు 15 వేల మంది భక్తులకు వసతి కల్పించే అవకాశం ఉంది. తిరుమల కొండపై వసతుల ఒత్తిడిని తగ్గించడంతో పాటు తిరుపతిలోనే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. అన్నదానం అత్యంత పవిత్రమైన సేవ అని పేర్కొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు... ఆకలితో వచ్చిన భక్తులకు అన్నప్రసాదం, అలసిపోయిన వారికి వసతి కల్పించడం ద్వారా దేవదేవుడికి సేవ చేసినట్లేనని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ.160 కోట్లతో నిర్మించనున్న అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భక్తులకు ఆహారాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నా రు. భక్తుల వాహనాల పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపే బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని నిర్మిస్తున్నారు. రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన సమీకృత రవాణా టెర్మినల్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

## రూ.242 కోట్లతో తొమ్మిది మాస్టర్‌ప్లాన్ రహదారులు

తిరుపతి నగరంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.242 కోట్ల అంచనా వ్యయంతో తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారులను నిర్మిం చనున్నారు. మొత్తం 20 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ పనుల్లో తుడా రూ.127 కోట్లతో 16.50 కిలోమీటర్లు, టీటీడీ రూ.115కోట్లతో 3.60కిలోమీటర్ల రహదారులను అభివృద్ధి చేయనున్నాయి. ఈ రహదారులు జాతీయ రహదారులు 140, 71 మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడంతో పాటు తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నాయి.

## టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

శ్రీవారి సేవలో నిరంతరం నిమగ్నమయ్యే టీటీడీ ఉద్యోగుల కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్య మంత్రి తెలిపారు. ఉద్యోగులు, వారి కుటుంబాలు సొంతింటిలో ఆత్మగౌరవంతో జీవించాలన్న లక్ష్యంతో 418 ఎకరాల్లో నివాస లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. మొదటి, రెండో దశల్లో కలిపి మొత్తం 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాల లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.230 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో టీటీడీ వాటాగా రూ.150 కోట్లు, ఉద్యోగుల వాటా రూ.80 కోట్లు వ్యయం చేయనున్నారు. అంతర్గ త రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు, నీటి సరఫరా పైప్‌లైన్లు, మురుగునీటి శుద్ధి కేంద్రం, విద్యుత్ పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. ఈ టౌన్‌షిప్‌ను పర్యావరణ హితంగా నెట్‌జీరోగా తీర్చిదిద్దాలని సీఎం సూచించా రు. ఉద్యోగుల కుటుంబాల్లో సంతోషం ఉంటే వారు మరింత అంకితభావంతో భక్తులకు సేవలందించగలరని పేర్కొన్నారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో సేవాభావంతో పనిచేస్తున్న టీటీడీ సిబ్బందిని అభినందించారు.

## ఆధ్యాత్మిక అనుభూతి... ఆధునిక సాంకేతికత

తిరుమల చరిత్ర, శ్రీవారి వైభవం, ఆధ్యాత్మిక సంప్రదాయా లను భక్తులకు పరిచయం చేసేందుకు పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. డిజిటల్ సమాచార కేంద్రం, అత్యవసర వైద్య సహాయ కేంద్రాలు, ఆధునిక భద్రతా వ్యవస్థలను కూడా అభివృద్ధి చేయాలని సూచిం చారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు తిరుపతి నుంచి వెళ్లేటప్పుడు ప్రతిఒక్కరూ సంతృప్తికరమైన అనుభూతిని పొందేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు సమాచారం తెలిపేం దుకు రూపొందించిన వెంకటాద్రి యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. తిరుమల తరహా పవిత్రత దిగువన తిరుపతిలోనూ అభివృద్ధి చేయాలని  స్పష్టం చేశారు. తిరుపతిని కేవలం యాత్రా కేంద్రంగా కాకుండా ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక సాంకేతి కత, విద్య, ఉపాధి, పర్యాటకంగా సమన్వయంతో అభివృద్ధి చేయా లని దిశానిర్దేశం చేశారు. తిరుపతిలోని చెరువులన్నింటినీ అను సంధానించి సుందరంగా తీర్చిదిద్దాలని, కల్యాణి డ్యామ్ వరకు ఉన్న ప్రాంతాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఔషధ మొక్కల ప్రాంతాన్ని సందర్శకులకు ఆధ్యాత్మిక, ప్రకృతి అనుభూతిని అందించే ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా అభివృద్ధి చేయా లన్నారు. వృక్షో గోవింద కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణ కు ప్రాధాన్యం ఇవ్వాలని, గోశాలల నిర్వహణ, గోసేవను ప్రోత్సహించాలని చెప్పారు. వన్యప్రాణుల సంరక్షణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

## వివాహాలు, సదస్సులు, క్రీడలకు కేంద్రంగా అభివృద్ధి

అన్నదానం, ప్రాణదానం, విద్యా దానం వంటి సేవా కార్యక్ర మాలను విస్తృతం చేయాలని తెలిపారు. శ్రీవారి సేవకుల తరహాలో ఇతర దేవాలయాల్లోనూ సేవా వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రజలను సన్మా ర్గంలో నడిపించేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించాలని, ముఖ్యంగా యువతలో ఒత్తిడిని తగ్గించి ఆధ్యాత్మికత వైపు నడిపించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆధ్యాత్మిక తను సాంకేతికతతో కలిపి ముందుకు తీసుకెళ్లాలని, శ్రీవారి వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా మరింతగా చాటిచెప్పే కార్యక్రమా లు చేపట్టాలని చెప్పారు. పవిత్రత విషయంలో ఎక్కడా రాజీపడ బోమని స్పష్టం చేశారు. మెరుగైన కనెక్టివిటీ, మౌలిక సదుపా యాలతో తిరుపతి త్వరలోనే వివాహ వేడుకలకు ప్రముఖ గమ్య స్థానంగా మారే అవకాశముందని అభిప్రాయపడ్డారు. అంతర్జా తీయ ప్రమాణాలతో కన్వెన్షన్ హాల్ ఏర్పాటు చేస్తే నగరంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని చెప్పారు. క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు ఏసీఏ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక యువతకు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపు ణ్యాలు కల్పించాలని, ఉపాధి అవకాశాలు పెంచేలా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## సమష్టి కృషితో ఆదర్శ నగరంగా తిరుపతి

దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు, యాత్రికులు తిరుపతిని చూసి రాష్ట్రం గురించి అంచనా వేస్తారని, అందుకే ఈ నగరాన్ని అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని పేర్కొన్నారు. దేవాదాయ, పర్యాటక, పురపాలక శాఖలు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించ వచ్చని చెప్పారు. పురపాలక శాఖ పట్టణాల అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక కార్యకలాపాలు, ఉపాధి అవకాశాలను పెంచే దిశగా పనిచేయాలని సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, టీటీడీ ఉద్యోగుల సంక్షేమం, తిరుపతి నగర మౌలిక సదుపాయాల విస్తరణ ఈ లక్ష్యాలను సమన్వయం చేస్తూ తిరుపతిని దివ్యక్షేత్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, పాలక మండలి సభ్యులు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్, తుడా అధికారులు తదితరులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- మరింత వేగవంతంగా క్లియర్ చేయాలి
- జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించాలి
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు.

ప్రస్తుతం పీజీఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల సమస్యలను వీలైనంత మేరకు పరిష్క రించగలుగుతున్నామని, మరింత వేగంగా.. సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించాలని సీఎస్ సాయిప్రసాద్‌ను ఆదేశించారు. ఆ సమావేశంలో 175 నియోజకవర్గాల నోడల్ అధికారులు ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత వాటిని పరిష్కరించే విషయంలో ఉద్యోగులకు, అధికారులకు జవాబుదారీతనం ఉండేలా చూడాలని సూచించారు.

వివిధ శాఖలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, జారీ చేస్తున్న జీవోలను వక్రీకరిస్తూ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతున్నారన్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ జారీ చేసిన జీవోపై ఈ తరహా దుష్ప్రచారం ఎక్కువగా ఉందని తెలిపారు. తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు సమర్థవంతంగా తిప్పికొడుతూ వాస్తవ సమాచారం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# సరస్ మేళాకు రండి

## సీఎం చంద్రబాబును కలిసిన డ్వాక్రా మహిళలు

## మంత్రి నారా లోకేష్‌కు ఆహ్వానం

అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం డ్వాక్రా మహిళలు కలిశారు. సెర్ప్ సీఈవో వాకాటి కరుణ నేతృత్వంలో డ్వాక్రా మహిళలు సీఎంను క్యాంప్ కార్యాలయంలో కలిసి 13వ తేదీ మంగళవారం నుంచి జరిగే సరస్ మేళాకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా తాము తయారుచేసిన ఉత్పత్తులను సీఎంకు చూపించారు.



### మంత్రి లోకేష్‌కు ఆహ్వానం

విజయవాడ పున్నమి ఘాట్‌లో ఈ నెల 13 నుంచి 31వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న జాతీయ సరస్ మేళాకు హాజరుకావాలని మంత్రి నారా లోకేష్‌కు ఆహ్వానం పలికారు. ఈ మేరకు సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, మెప్మా ఎండీ జి.బాలకృష్ణ, దేశంలోని పొదుపు సంఘాల మహిళల తరపున ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ సమాఖ్యఅధ్యక్షులు కల్పన తదితరులు ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. జాతీయ సరస్ మేళా మొట్టమొదటిసారిగా విజయవాడలో జరగనుంది. ఈ మేళాలో అన్ని రాష్ట్రాల నుంచి వారి స్థానిక ఉత్పత్తుల ప్రదర్శన, విక్ర యాలు జరుగుతాయి. ఈ నెల 15వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ఈమేళా ప్రారంభం కానుంది. మంత్రి లోకేష్‌ను ఆహ్వానించిన వారిలో ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ జిల్లా సమాఖ్య ఉపాధ్యక్షురాలు ఎన్.బేబీ,కార్యదర్శి బి.రామలక్ష్మి, కోశాధికారి సీహెచ్ హైమావతి ఉన్నారు.





# మేయర్, చైర్మన్ స్థానాలకు రిజరేషన్ల ఖరారు

## 17 కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీల్లో ఫిక్స్ - మహిళా అభ్యర్థులు, బీసీలకు పెద్దపీట




అమరావతి(చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలకు సంబం ధించి 17 మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్, 106 మున్సిపాలిటీల చైర్మన్ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. 17 కార్పొరేషన్‌లలో బీసీ 5, ఎస్సీ 2, ఎస్టీ 1, జనరల్ మహిళ 5, అన్ రిజర్వ్‌డ్‌కు 4 స్థానాలు కేటాయించారు. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ 252 జీవో విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 106 మున్సిపాలిటీల చైర్మన్లకు సంబంధించి రిజర్వేషన్లు కూడా ప్రభుత్వం ఖరారు చేసింది. వీటిలో ఎస్టీ జనరల్ 2, ఎస్టీ మహిళ 1, ఎస్సీ జనరల్ 7, ఎస్సీ మహిళ 7, బీసీ జనరల్ 18, బీసీ మహిళ 18, అన్‌రిజర్వ్‌డ్ జనరల్ అభ్యర్థులకు 26, జనరల్ మహిళలకు 27 స్థానాలకు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

### మున్సిపాలిటీల్లో చైర్మన్ రిజర్వేషన్లు

***ఎస్టీ-3:*** వీటిలో గూడూరు ఎస్టీ మహిళకు, ఆలూరు, ఆత్మకూరు స్థానాలు ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ చేశారు.

***ఎస్సీ-14:*** వీటిలో చింతలపూడి, సూళ్లూరుపేట, కొండపల్లి, నిడదవోలు, ఏలేశ్వరం, గుత్తి, చీరాల ఎస్సీ మహిళలకు, ఉయ్యూ రు, సామర్లకోట, పిఠాపురం, నూజివీడు, కుప్పం, పొదిలి, బాపట్ల స్థానాలు ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ చేశారు.

***బీసీ-36 స్థానాలు:*** చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, కొవ్వూరు, పాలకొల్లు, జంగారెడ్డిగూడెం, నర్సీపట్నం, నాయుడుపేట, గుంతకల్లు, గుడివాడ, నందిగామ, నెల్లిమర్ల, మడకశిర, ఆళ్లగడ్డ, గురజాల, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం స్థానాలు బీసీ మహిళలకు కేటాయించారు. కావలి, కదిరి, బి.కొత్తకోట, కందుకూరు, హిందూపురం, ఆత్మకూరు(నెల్లూరు), అద్దంకి, కమలాపురం, దాచేపల్లి, గొల్లప్రోలు, మార్కాపురం, నంద్యాల, బేతంచెర్ల, నందికొట్కూరు, దర్శి, గూడూరు (కర్నూలు), మైదుకూరు, బద్వేలు స్థానాలు బీసీ జనరల్ అభ్యర్థులకు కేటాయించారు.

***అన్ రిజర్వ్‌డ్ జనరల్ మహిళ(27):*** కనిగిరి, వెంకటగిరి, బుచ్చిరెడ్డిపాలెం, ఎర్రగుంట్ల, యలమంచిలి, కల్యాణదుర్గం, నరసాపురం, పలాస-కాశీబుగ్గ, పెడన, పలమనేరు, జమ్మల మడుగు, ఆకివీడు, పాలకొండ, పొన్నూరు, భీమవరం, జగ్గయ్యపేట, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆదోని, డోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు

***అన్ రిజర్వ్‌డ్ (26):*** సాలూరు, తణుకు, తెనాలి, తాడేపల్లి గూడెం, తుని, పార్వతీపురం, ప్రొద్దుటూరు, పుత్తూరు, రామచంద్రాపురం, సత్తెనపల్లి, శ్రీకాళహస్తి, మండపేట, నగరి, చీమకుర్తి, తిరువూరు, రాయదుర్గం, గిద్దలూరు, వినుకొండ, పెద్దాపురం, ధర్మవరం, తాడిగడప, పిడుగురాళ్ల, తాడిపత్రి, పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి.

## విజయవాడ బైపాస్‌లో

# నలుగురి సజీవ దహనం

- రెయిలింగ్‌ను ఢీకొట్టిన కారు దగ్ధం
- ప్రమాదంపై స్పందించిన మంత్రి లోకేష్
- మృతుల కుటుంబాలకు సానుభూతి



విజయవాడ(చైతన్యరథం): నగరంలోని బైపాస్ రోడ్డులో మంగళవారం కారు రెయిలింగ్‌ను ఢీకొట్టి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు సజీవ దహనమయ్యారు. స్థానికులు వెంటనే స్పందించి పోలీసులతోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పారు. ఈ ప్రమాదంలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని సమీపంలోని ఆసుపత్రికి పోలీసులు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులు గుంటూ రు జిల్లా నంబూరు, విజయవాడ సమీపంలోని నున్న వాసులని పోలీసులు వివరించారు. మృతులు రాందేవ్, అరుణ, విజయతోపాటు చిన్నారిగా గుర్తించామని తెలిపారు.నంబూరులో ఓ ఫంక్షన్‌లో పాల్గొని తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు.

### నలుగురు మృతిపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి



విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ఎలక్ట్రిక్ కారులో మంటలు చెలరేగి నలుగురు సజీవ దహనమైన దుర్ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు రెయిలింగ్‌ను ఢీకొని కారులో మంటలు చెలరేగినట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు.

### ప్రమాదం తీవ్రంగా కలచివేసింది: మంత్రి లోకేష్



ఈ ప్రమాద ఘటనపై మంత్రి నారా లోకేష్ స్పందించారు. 'విజయవాడ వెస్ట్ బైపాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలు గురు వ్యక్తులు సజీవదహనం కావడం తీవ్రంగా కలచివేసింది. మృతులకు నివాళులు అర్పిస్తున్నా ను. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సీట్ల సర్దుబాటుపై కసరత్తు

## ఉండవల్లిలో సీఎం చంద్రబాబుతో కూటమి నేతల కీలక భేటీ

అమరావతి(చైతన్యరథం): ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 14న విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోం ది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు నివాసంలో కూటమి నాయకులు కీలక భేటీ అయ్యారు. జనసేన ప్రతినిధి మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఈ భేటీలో మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై తుది నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే కూటమి పక్షాల రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ భేటీ జరిగింది. ఈ భేటీలో తాము పోటీ చేసే స్థానాల జాబితాను జనసేన, భాజపా నేతలు ఇచ్చారు. తాజా సమావేశంలో ఈ జాబితాపై తుది నిర్ణయం తీసుకున్నారు.

# రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

## - 14, 15 తేదీల్లో విజయవాడకు ద్రౌపది ముర్ము.. ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 14, 15 తేదీల్లో విజయవాడలో పర్యటించనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ తెలిపారు. పర్యటనపై సోమవారం వివిధ శాఖల అధికారులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించి, చేయాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రపతి సచివాలయం జారీ చేసిన మార్గదర్శకాలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. మినిట్ టు మినిట్ కార్యక్రమం ఆలస్యం లేకుండా, సమయపాలనకు అనుగుణంగా సాగేలా చూడాలన్నారు. శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు పటిష్టంగా పూర్తి చేయాలని సూచించారు. అంతకుముందు సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు.. శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్ల వివరాలను తెలియజేశారు. ముసాయిదా ప్రయాణ సమాచారం ప్రకారం.. రాష్ట్రపతి ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 3.55 గంటలకు ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి, సాయంత్రం 6.25 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో విజయవాడ ఇంద్రకీలాద్రికి చేరుకుని, రాత్రి 7.20 నుంచి 7.40 గంటల వరకు కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం రాత్రికి విజయవాడలోనే బస చేస్తారు.

15వ తేదీ ఉదయం 11.30 గంటలకు పున్నమి ఘాట్ చేరుకుని, మధ్యాహ్నం 1 గంట వరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న సరస్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. తదుపరి మధ్యాహ్నం 1.10 నుంచి 2.10 గంటల వరకు స్వయం సహాయక సంఘాలు, లఖ్‌పతి దీదీలతో కలిసి విందులో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2.45 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని ఢిల్లీ బయలుదేరి వెళతారు. సమావేశంలో అదనపు డీజీపీ మదుసూదన్ రెడ్డి, పీఆర్ అండ్ ఆర్డీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, సెర్ప్ సీఈఓ కరుణ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిషా, ఐ అండ్ పీఆర్ డైరెక్టర్



కె.ఎస్.విశ్వనాథన్, దుర్గగుడి ఈఓ శీనూనాయక్, ప్రోటోకాల్ విభాగం జె.రామసుబ్బయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

# కేసుల పరిష్కారంలో ఏపీ ఆర్‌టీఐ కమిషన్‌కు జాతీయ గుర్తింపు

- **9 నెలల్లో 7,034 కేసుల పరిష్కారం..**
- **95 శాతం విచారణలు ఆన్‌లైన్‌లోనే**
- **రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ వజ్జా వెల్లడి**




మంగళగిరి (చైతన్య రథం): సమాచార హక్కు చట్టం కింద నమోదైన కేసులను వేగంగా పరిష్కరిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ జాతీయస్థాయిలో గుర్తింపు పొందిందని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు తెలిపారు. ప్రజలకు ఆర్‌టీఐ సేవలను మరింత చేరువ చేసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు, విచారణలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో శక్తివంతమైన ఆయుధమని, ఉన్నత స్థాయి అధికారుల పనితీరుపై సైతం సమాచారం పొందేందుకు ఈ చట్టం అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పారదర్శకతతో కూడిన సంబంధాలను బలోపేతం చేయడంలో ఆర్‌టీఐ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

### తొమ్మిది నెలల్లో 7,034 కేసుల పరిష్కారం

రాష్ట్ర సమాచార కమిషన్ కేసుల పరిష్కారంలో గణనీయమైన పురోగతి సాధించిందని శ్రీనివాసరావు తెలిపారు. 2026 జనవరి నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు 7,034 కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. 2024లో 3,252 కేసులు, 2025లో 3,326 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. కేసుల పెండెన్సీని తగ్గించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, 2013 నుంచి 2023 వరకు పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ వచ్చే నెలాఖరులోగా పరిష్కరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. కేసుల స్వభావం, అవసరాన్ని బట్టి ఇద్దరు సభ్యులతో కూడిన బెంచ్‌లు, ముగ్గురు సభ్యులతో కూడిన ఫుల్ బెంచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తొలుత వచ్చిన కేసును తొలుత పరిష్కరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నప్పటికీ, అవసరాన్ని బట్టి కొత్తగా వచ్చిన దరఖాస్తులకూ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.

### 95 శాతం విచారణలు ఆన్‌లైన్‌లోనే..

ప్రజలు తమ మొబైల్ ఫోన్ల నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయాన్ని కల్పించామని ప్రధాన కమిషనర్ తెలిపారు. గ్రామస్థాయి నుంచి కూడా ఆన్‌లైన్ విచారణలకు హాజరయ్యే అవకాశం ఉండటంతో దూరప్రాంతాల ప్రజలకు ప్రయాణ ఖర్చులు, ఇబ్బందులు తగ్గుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం సుమారు 95 శాతం విచారణలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయని, మిగిలిన ఐదు శాతం మంది సమీప ప్రాంతాల నుంచి నేరుగా హాజరవుతున్నారని వివరించారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లాకు చెందిన 65 ఏళ్ల వృద్ధురాలు సైతం ఆన్‌లైన్ విచారణకు హాజరయ్యారని గుర్తుచేశారు. ఆన్‌లైన్ విచారణ విధానాన్ని సుప్రీంకోర్టు ప్రశంసించిందని, ఇతర రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని అనుసరించాలని సూచించిందని తెలిపారు. ఈ విధానాన్ని అధ్యయనం చేసేందుకు గత నెల 27న తమిళనాడు సమాచార హక్కు కమిషన్ ప్రతినిధులు రాష్ట్రానికి వచ్చినట్లు వెల్లడించారు.

### 263 కార్యాలయాల్లో తనిఖీలు

ఆర్‌టీఐ చట్టం అమలును మెరుగుపరిచేందుకు వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 263 కార్యాలయాలను తనిఖీ చేయగా, 162 కార్యాలయాల్లో లోపాలను గుర్తించి ప్రజా సమాచార అధికారులకు నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. ప్రజా సమాచార అధికారులు (పీఐఓలు), సహాయ ప్రజా సమాచార అధికారులు (ఏపీఐఓలు) సమర్థంగా విధులు నిర్వహించేందుకు శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ శిక్షణను ప్రతి నెలా నిర్వహిస్తూ నిరంతర ప్రక్రియగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాల్లో ఆర్‌టీఐ నోడల్ అధికారులుగా జిల్లా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని, ఈ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా ఇద్దరు అధికారులను నియమించే ప్రతిపాదనలు చేశామని వెల్లడించారు.

### చట్టం దుర్వినియోగంపై కఠిన చర్యలు

సమాచార హక్కు చట్టాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్న తొమ్మిది మందిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టినట్లు ప్రధాన కమిషనర్ తెలిపారు. చట్టాన్ని దుర్వినియోగం చేసే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం వెల్లడించాల్సిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పౌరుల ప్రాథమిక హక్కులను పరిరక్షించడంలో, ప్రభుత్వ పాలనలో పారదర్శకతను పెంపొందించడంలో ఆర్‌టీఐ చట్టం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమాచార హక్కు కమిషనర్లు చావలి సునీల్, డా. రెహానా బేగం, గాజుల అదెన్న, డా. అల్లారెడ్డి ఉదయ భాస్కరరెడ్డి, శరత్ చంద్ర కల్యాణ్ చక్రవర్తి వట్టికూటి, వంటేరు రవిబాబు, పి.ఎన్. నాయుడు, కమిషన్ కార్యదర్శి సి.హెచ్. పద్మావతి దేవి, ఉప కార్యదర్శి కె. నరసింహారావు, లా సెక్రటరీ వి. రఘురామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 12వ పీఆర్సీ చైర్మన్‌గా దినేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ

### ఏడాదిలోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పణ

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల సవరణకు సంబంధించి ఏర్పాటు చేసిన 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) చైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. 1983 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన దినేష్‌కుమార్ గతంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆయనను 12వ వేతన సవరణ సంఘం చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఈనెల 1న జీవో ఎంఎస్ నంబర్ 200 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాదిలోగా పీఆర్సీ నివేదికను సమర్పించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

### ఉద్యోగ సంఘాలనుంచి వివరాల సేకరణ

పీఆర్సీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దినేష్ కుమార్ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలనుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధుల నుంచి కూడా పూర్తి వివరాలను తీసుకొని వేతన సవరణకు సంబంధించిన అంశాలపై సమగ్ర అధ్యయనం చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఉద్యోగుల వేతనాల పెంపునకు సంబంధించిన సిఫారసులతో కూడిన నివేదికను నిర్దేశిత ఏడాది గడువులోగా ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

### పీఆర్సీ చైర్మన్‌కు అభినందనలు

దినేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి వి వినయ్ చంద్, అదనపు కార్యదర్శి గౌతమ్ అల్లాడ ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణతో పాటు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు దినేష్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.



# బీసీలకు 40 శాతం రాజకీయ ప్రాధాన్యతే కూటమి లక్ష్యం

## బీసీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తున్న జగన్ - కాకినాడ మీడియా సమావేశంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

కాకినాడ (చైతన్య రథం): బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించడానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరఫున బీసీలకు 40 శాతానికి పైగా ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. కాకినాడలోని జీఆర్‌టీ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. దివంగత ఎన్టీ రామారావు నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరకు తెలుగుదేశం పార్టీ బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బీసీలకు రాజకీయ అవకాశాలు పెంచాలన్నదే తమ ఉద్దేశమన్నారు. బీసీలకు రిజర్వేషన్ల విషయంలో న్యాయస్థానాల తీర్పులకు అనుగుణంగా ముందుకు సాగుతూనే పార్టీ తరఫున తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. బీసీలకు రాజకీయంగా అవకాశాలు కల్పించే విషయంలో వైఎస్సార్‌సీపీ అడ్డంకులు సృష్టిస్తోందని మంత్రి ఆరోపించారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే రాజకీయ ప్రాతినిధ్యం కూడా పెరగాలని పేర్కొన్నారు. బీసీలు మొదటి నుంచి టీడీపీకి అనుకూలంగా ఉన్నారని కక్షతో జగన్ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

**కూటమి ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత**

రాష్ట్రంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, గుంతల పూడ్చివేత, కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల అనుసంధానాన్ని మెరుగుపరచేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. జాతీయ రహదారుల అభివృద్ధికి సుమారు రూ.లక్ష కోట్ల విలువైన ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు.

**ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో జలజీవన్ మిషన్ 2.0 –అమరజీవి జలధార కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి రూ.30,136 కోట్ల వ్యయంతో 50,315 పనులు చేపట్టి, అదనంగా 27.36 లక్షల గ్రామీణ కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు అందించాలనే లక్ష్యం పెట్టుకున్నట్లు వివరించారు. 1,426 మిలియన్ లీటర్ల రోజువారీ సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాలు, 494 ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, 13,075 ఓవర్‌హెడ్ స్టోరేజ్ రిజర్వాయర్లు,



77,243 కిలోమీటర్ల పంపిణీ పైప్‌లైన్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు, డ్రైనేజీ ఇబ్బందులు, పారిశుధ్య లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేయడమే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యమని పేర్కొన్నారు.

**అమరావతికి మళ్లీ ఊపునిచ్చిన కూటమి ప్రభుత్వం**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని అభివృద్ధి పనులు నిలిచిపోయాయని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని నిర్మాణానికి మళ్లీ ఊపునిచ్చామని తెలిపారు. 2028 నాటికి అమరావతి అభివృద్ధి తొలి దశను పూర్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని చెప్పారు. రాజధానిలో రహదారులు, ప్రభుత్వ భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని, అమరావతి అభివృద్ధి ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి వివరించారు.

**పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యం**

పోలవరం ప్రాజెక్టును గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలోని ఇతర సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీటి లభ్యత పెంచేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు.

**పోర్టులు, విమానాశ్రయాలు, పారిశ్రామికీకరణానికి ప్రోత్సాహం**

భోగాపురం విమానాశ్రయంతోపాటు ఇతర విమానాశ్రయాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. నాలుగు పోర్టుల అభివృద్ధి పనులను నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాల అనుసంధానం మెరుగుపడితే రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

**వైఎస్సార్‌సీపీ పాలనపై విమర్శలు**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారులు, తాగునీటి వ్యవస్థలు, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి ఆరోపించారు. అభివృద్ధి పనులకంటే రాజకీయ విమర్శలకు ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే విషయంలో సానుకూలంగా వ్యవహరించడం లేదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను న్యాయస్థానాల్లో సవాలు చేయడం వల్ల రాజకీయ ప్రాతినిధ్యానికి ఆటంకాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. మద్యం విధానం, అవినీతి ఆరోపణలు, వివిధ కేసుల్లో నాయకులు, అధికారులపై జరుగుతున్న విచారణలను ప్రస్తావిస్తూ జగన్ నాయకత్వంపై మంత్రి విమర్శలు చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ రూ.40 కోట్ల సుపారీకి సంబంధించిన అంశం వచ్చిన నేపథ్యంలో.. వేళ్లన్నీ జగన్ కుటుంబం వైపే చూపిస్తున్నాయని స్పష్టం చేశారు.

**స్థానిక ఎన్నికల్లో అభివృద్ధిని పరిశీలించండి**

రానున్న గ్రామపంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, రహదారుల పరిస్థితి, తాగునీటి సదుపాయాలు, స్థానిక సమస్యల పరిష్కారాన్ని పరిగణనలోకి తీసుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని మంత్రి విమర్శ**

గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయగా, నియామకాలపై వైసీపీ అపోహలు సృష్టిస్తూ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కృషిని అవమానిస్తోందని ఆరోపించారు. కష్టపడి అర్హత సాధించిన ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. సమావేశంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ సిటీ టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరేంద్రనాథ్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా వెంకన్న ఆలయాలు

- 175 నియోజకవర్గాల్లో వేంకటేశ్వర స్వామి ఆలయాల నిర్మాణానికి నిర్ణయం
- ఒక్కో ఆలయానికి రూ.5 నుంచి రూ.10 కోట్ల వరకు కేటాయింపు
- 2028 నాటికి 5,000 నూతన ఆలయాల నిర్మాణమే లక్ష్యం
- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి



నెల్లూరు (చైతన్య రథం): రాష్ట్రంలోని 175 శాసనసభ నియోజకవర్గాల్లో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాలు లేని ప్రాంతాలను గుర్తించి, ఒక్కో నియోజకవర్గంలో ఒక ఆలయాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లోని స్థలం, పరిస్థితులను బట్టి ఒక్కో ఆలయ నిర్మాణానికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు కేటాయించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన లక్ష్యం మేరకు 2028నాటికి రాష్ట్రవ్యాప్తంగా 5,000 నూతన దేవాలయాల నిర్మాణానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం పొదలకూరు మండలం మహమ్మదాపురం గ్రామంలో దాత పూండ్ల వెంకురెడ్డి సహకారంతో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి సోమవారం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు దేవాదాయ శాఖ తరఫున ఇప్పటికే సుమారు రూ.14.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు వివరించారు. కామన్ గుడ్ ఫండ్, ధూపదీప నైవేద్య పథకం, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆలయాలకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.

ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పోర్టు పరిధిలోని రెండు పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి భారత పురాతత్వ శాఖ (ఏఎస్ఐ) అధికారుల సహకారంతో ప్రణాళికలు సిద్ధం చేసినట్టు మంత్రి వెల్లడించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి ప్రణాళికలను పరిశీలించి, ఆమోదం అనంతరం నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్థిక వనరులు ఉన్న ఆలయాల్లో భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 151 ఆలయాల్లో అన్నప్రసాద వితరణ ప్రారంభించగా, 51 ఆలయాల్లో నిత్య అన్నప్రసాదం కొనసాగుతోందని పేర్కొన్నారు. గత ఏడాదిన్నర కాలంలో సుమారు మూడు కోట్ల మంది భక్తులు ఆలయాల్లో అన్నప్రసాదం స్వీకరించినట్లు వివరించారు. అర్చకుల జీతభత్యాలు, వేద పండితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. వేద విద్యను అభ్యసించి సర్టిఫికెట్ పొందిన వారికి ఉపాధి లభించే వరకు నెలకు రూ.3,000 చొప్పున మూడేళ్ల పాటు సంభావన అందిస్తున్నట్లు, ఇప్పటికే 600 మందికి ఈ సహాయం అందుతోందని వివరించారు. వైదిక శాస్త్రాలు, వేద పండితులు, సనాతన ధర్మం, హిందూ సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, మహమ్మదాపురంలో దాత పూండ్ల వెంకటరెడ్డి సుమారు రూ.2 కోట్ల వ్యయంతో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. ఆలయ ప్రాంగణంలో మరో భవన నిర్మాణానికి కామన్ గుడ్ ఫండ్ ద్వారా రూ.50 లక్షలు కేటాయించేందుకు మంత్రి సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలిపారు. గ్రామంలోని హైస్కూల్ అభివృద్ధికి సీఎస్ఆర్ నిధుల కింద రూ.50 లక్షలు సమకూర్చినట్లు, పాఠశాలకు అవసరమైన అదనపు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వేంకటేశ్వర స్వామి ఆలయాల నిర్మాణానికి రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు కేటాయించాలనే నిర్ణయాన్ని స్వాగతించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఆలయాలకు ఇప్పటికే రూ.14.50 కోట్లు మంజూరయ్యాయని, మరో రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు నిధుల ప్రతిపాదనలు ప్రక్రియలో ఉన్నాయని తెలిపారు. ఈ నిధులు కూడా మంజూరవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చైతన్యరథం



# పట్టాలెక్కిన రెవెన్యూ శాఖ
# కూటమి పాలనలో సరికొత్త అధ్యాయం

- భూ హక్కులు భద్రం, దశాబ్దాల సమస్యలు దూరం
- రైతు భూమికి రక్షణ... పేదల ఇంటికి భరోసాగా సుపరిపాలన
- 'మీ భూమి-మీ హక్కు'తో భూ యజమానులకు భరోసా
- 244 ప్రధాన భూసమస్యల పరిష్కారం, 1.25 లక్షల కుటుంబాలకు ఊరట
- రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ
- సమూల సంస్కరణలతో ఫలితాలు సాధిస్తోన్న కీలక శాఖ

అమరావతి (చైతన్యరథం): సరిగ్గా 28 నెలల క్రితం చూసుకుంటే రాష్ట్రంలో భూ వివాదాలు లేని ఊరు లేదు.. భూ సమస్యలతో సతమతం కాని కుటుంబం లేదు... రైతు చెమటోడ్చి సంపాదించిన భూమికి భరోసా లేదు. పేదవాడు తరతరాలుగా నివసిస్తున్న స్థలానికి రక్షణ లేదు. భూమి తనదేనని నిరూపించుకోవడానికి రైతు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి. గత ప్రభుత్వ విధ్వంసకర పాలనలో రెవెన్యూ వ్యవస్థ ప్రజలకు అండగా నిలవాల్సింది పోయి భూ వివాదాలకు, అక్రమాలకు, అన్యాయాలకు వేదికగా మారింది. ఎక్కడ చూసినా భూకబ్జాల ఆరోపణలు... భూముల దందాలు... రికార్డుల ట్యాంపరింగ్‌పై ఫిర్యాదులు. సరిహద్దు రాళ్లపైనా, పట్టాదారు పాస్‌పుస్తకాలపైనా నాటి పాలకులు తమ సొంత బొమ్మలు వేసుకున్నారు. ప్రజల ఆస్తులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వమే...అక్రమార్కులకు అండగా నిలిచింది. అడ్డమైన చట్టాలు తీసుకువచ్చి రెవెన్యూ వ్యవస్థను వివాదాస్పదం చేసింది. రైతు తన భూమిపై హక్కు కోసం భయపడాల్సి వస్తే, పేదవాడు తన నివాసం నిలుస్తుందో లేదోనని ఆందోళన చెందాల్సి వస్తే అది కేవలం రెవెన్యూ వైఫల్యం కాదు, ప్రజల హక్కులపై జరిగిన దాడి. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అదే జరిగింది. ఈ పరిస్థితిని మార్చేందుకు... భూ యజమానుల హక్కులు కాపాడేందుకు, రెవెన్యూ వ్యవస్థ విశ్వసనీయత పెంచేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే సంస్కరణల బాట పట్టింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో దశాబ్దాల నాటి భూసమస్యలకు సైతం పరిష్కారం చూపిస్తున్నారు. 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమం కింద భూ హక్కుల విషయంలో ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు తొలగిస్తున్నారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి, భూమిపై హక్కు భూ యజమానిదేనన్న నమ్మకాన్ని కలిగించారు. రెవెన్యూ సంస్కరణలతో సుపరిపాలనకు కూటమి ప్రభుత్వం నిజమైన అర్థాన్ని ఇచ్చింది. ప్రభుత్వ కృషి, ముఖ్యమంత్రి సంకల్పంతో రెవెన్యూ శాఖ పట్టాలెక్కిందనే అభిప్రాయం అంతటా వ్యక్తం అవుతోంది. రెండేళ్ల నిర్ణయాలు, సంస్కరణలు ఇప్పుడు ఫలితాలను ఇస్తున్నాయి.



## రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు

గత ప్రభుత్వం రీసర్వే పేరుతో కొత్త తలనొప్పులు తెచ్చింది. తప్పులతడకగా రెవెన్యూ రికార్డులను మార్చింది. పట్టాదారు పాస్ పుస్తకాల విషయంలో మరీ దుర్మార్గంగా వ్యవహరించింది. నాటి నాయకుడు పాస్ పుస్తకాలపై తన ఫోటో ముద్రించి వాటికి విలువ లేకుండా చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆస్తులకు, భూ యజమానులకు భరోసా ఇచ్చేలా రాజముద్రతో పాస్ పుస్తకాల ముద్రణ, పంపిణీ ప్రక్రియ చేపట్టింది. తప్పులు దొర్లకుండా భూ యజమాని ఈ కేవైసీ అనంతరమే పాస్ పుస్తకాలు ముద్రిస్తోంది. రికార్డుల్లో తప్పులుంటే వెబ్ ల్యాండ్‌లో సవరించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అక్టోబర్ 2026 నాటికి 9,027 రీసర్వే గ్రామాల్లో మొత్తం 40,58,921 పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ పూర్తవుతుంది. మిగిలిన 7,789 గ్రామాల్లో మార్చి 2027 నాటికి 51,91,258 పాస్‌పుస్తకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోంది. సిగ్నల్ సదుపాయం లేని 2,445 గ్రామాల్లో జూలై 2027 నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అటు రీసర్వే 2.0లో భాగంగా 3,110 గ్రామాల్లో రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) తుది ప్రక్రియ పూర్తయింది. దీంతో భూముల వివరాలను చట్టపరంగా నవీకరించి, ధృవీకరించే పనిలో కీలక ముందడుగు పడింది. భూమి వివరాలు స్పష్టంగా ఉండటం వల్ల భవిష్యత్తులో వివాదాలు నివారించడంతో పాటు, రైతులు తమ హక్కులను నిరూపించుకోవడం సులభమవుతుంది.

### సరిహద్దు రాళ్లపై బొమ్మల తొలగింపు

గత ప్రభుత్వం చేసిందేమీ లేకపోయినా... చరిత్రలో శాశ్వతంగా మిగిలిపోవాలని కలలు కన్నది. అందుకే సరిహద్దు రాళ్ల విషయంలోనూ హద్దు దాటి ప్రవర్తించింది. ఏకంగా రూ.650 కోట్లపైగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి సరిహద్దు రాళ్లపై నాటి నాయకుడు తన బొమ్మ వేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 77 లక్షల గ్రానైట్ రాళ్లపై బొమ్మలను చెక్కారు. దేశం మొత్తం నివ్వెరపోయేలా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ రాళ్లపై బొమ్మలను తొలిగించి భూ యజమానులకు భరోసా ఇచ్చింది.

### 22-ఏ నుంచి 16.48 లక్షల ఎకరాలకు విముక్తి

ఇష్టానుసారంగా 22–ఏ నిషేధిత జాబితాలో ప్రైవేట్ భూములను చేర్చి...గత ప్రభుత్వం ప్రజలకు మనశ్శాంతి లేకుండా చేసింది. తప్పుగా నిషేధిత జాబితాలో చేర్చిన భూములపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 8,177 రీసర్వే గ్రామాల్లో 16 లక్షల ఎకరాలను 22–ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించింది. దీంతో నిషేధిత జాబితాలో ఉన్న భూముల విస్తీర్ణం 49 లక్షల ఎకరాల నుంచి 33 లక్షల ఎకరాలకు తగ్గింది. సుమారు 33.3 శాతం భూములకు విముక్తి కలిగింది. జీవో ఎంఎస్ 588 ద్వారా 10.7 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించే చర్యలు చేపట్టింది. దీంతో అర్హులైన భూ లబ్ధిదారులకు తమ భూమిపై హక్కుల భద్రత, లావాదేవీల్లో స్పష్టత కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోంది.

### వారసత్వ రిజిస్ట్రేషన్లపై స్టాంప్ డ్యూటీ భారం తగ్గింపు

వీలునామా లేకుండా మరణించిన భూయజమానుల వారసత్వ బదిలీ ప్రక్రియలో స్టాంప్ డ్యూటీని ప్రభుత్వం తగ్గించింది. రూ.10 లక్షల లోపు విలువ గల భూములకు రూ.100, అంతకంటే ఎక్కువ విలువ గల భూములకు రూ.1,000గా నిర్ణయించారు. డిసెంబర్ 2025 నుంచి అక్టోబర్ 2026 వరకు 21 జిల్లాల్లో 632 రిజిస్ట్రేషన్లు జరిగాయి. మరోవైపు పాత భూ రికార్డుల డిజిటలైజేషన్‌ను ఫిబ్రవరి 2026లో ప్రారంభించారు. 1–బీ, అడంగల్, డీకేటీ, ఏఆర్సీ, ఇనాం, సీలింగ్ రిజిస్టర్ల వంటి కీలక రికార్డులను డిజిటల్ రూపంలోకి తీసుకువస్తున్నారు.

బ్లాక్‌చైన్ టెక్నాలజీతో అదనపు భద్రత

అలాగే ఎక్కడా రికార్డుల ట్యాంపరింగ్ జరగకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీని రాష్ట్ర ప్రభుత్వం వినియోగిస్తోంది. దీంతో రికార్డులకు పటిష్ట భద్రత కలుగుతుంది. ప్రతి ఎల్పీఎం (ల్యాండ్ పార్సెల్ మ్యాప్)కు ప్రత్యేకమైన శాశ్వత బ్లాక్ చెయిన్ ఐడీ కేటాయించే పైలట్ కార్యక్రమాన్ని చేపట్టారు. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పుగోదావరి, పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లోని ఏడు మండలాల్లో 1,47,484 భూ భాగాలకు ఈ విధానాన్ని వర్తింపజేశారు. రికార్డుల మార్పులను తక్షణం గుర్తించేందుకు, భూ వివరాల విశ్వసనీయతను మరింత పెంచేందుకు ఇది తోడ్పడుతుంది.

### 100 శాతం ఆటో మ్యుటేషన్

అమ్మకం, బహుమతి, విభజన దస్తావేజుల ద్వారా జరిగిన సుమారు 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో–మ్యుటేషన్ అమలు చేశారు. దీంతో ప్రతి లావాదేవీ తర్వాత మ్యుటేషన్ కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గింది. మానవ జోక్యాన్ని పూర్తిగా తొలగించే దిశగా వ్యవస్థను రూపొందించారు. వాట్సప్ ద్వారా మ్యుటేషన్ అభ్యర్థనలు, స్థితి తెలుసుకునే సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. మ్యుటేషన్ తిరస్కరణపై నిర్ణయాధికారాన్ని తహసీల్దార్ స్థాయి నుంచి ఆర్డీవో స్థాయికి పెంచడంతో, తిరస్కరణ రేటు 20 శాతం నుంచి 2 శాతం కంటే దిగువకు తగ్గింది. పాస్‌పుస్తకాల పంపిణీ, రీసర్వే, నిషేధిత జాబితా శుద్ధి, ఫ్రీహోల్డ్ హక్కులు, వారసత్వ రిజిస్ట్రేషన్ల సరళీకరణ, డిజిటల్ రికార్డులు, ఆటో–మ్యూటేషన్

(తరువాయి 7లో..)



# పట్టాలెక్కిన రెవెన్యూ శాఖ
# కూటమి పాలనలో సరికొత్త అధ్యాయం

(6వ పేజీ తరువాయి..)

వంటి చర్యలతో భూమి యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్రంలో పాలన సాగుతోంది. రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 'మీ భూమి – మీ హక్కు' నినాదంలా కాకుండా, రెవెన్యూ సేవల్లోనూ, ప్రజల జీవితాల్లోనూ ప్రతిఫలించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. భూహక్కుల విషయంలో ప్రతి రైతుకు స్పష్టత, ప్రతి కుటుంబానికి భద్రత, ప్రతి లావాదేవీలో పారదర్శకత ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పంగా ఉంది. అదే రెవెన్యూ వ్యవస్థను గాడిన పడేలా చేసింది.

**244 ప్రధాన భూసమస్యలకు పరిష్కారం**

రెండేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 244 ప్రధాన భూసమస్యలను పరిష్కరించి, 41,000 ఎకరాలకు పైగా భూమిని వివాదాల నుంచి రాష్ట్ర ప్రభుత్వం విముక్తి కలిగించింది. దీంతో 1.25 లక్షలకు పైగా కుటుంబాలు, రైతులు, పరిశ్రమలకు ప్రయోజనం కలిగింది. మొత్తం వీటి విలువ రూ.5 వేల కోట్లకు పైగా ఉంటుంది.

- తిరుపతి – శెట్టిపల్లి: జీవో 328, 10 సెప్టెంబర్ 2025: 123 ఎకరాల భూమికి సంబంధించిన సమస్య పరిష్కారానికి చర్యలు. 2,206 ఇళ్ల స్థలాల కుటుంబాలకు కనీసం 2 సెంట్ల చొప్పున హక్కు కల్పించే భరోసా.
- నంద్యాల – గుటుపల్లి: జీవో ఆర్‌టీ 77, 8 జూలై 2026: 142 సర్వే నంబర్లలో సుమారు 2,075 ఎకరాలను తప్పుగా వక్ఫ్ భూమిగా 22-ఏ(1)(సి)లో చేర్చిన నమోదులను తొలగించారు. సుమారు 1,000 ఖాతాదారులకు రిజిస్ట్రేషన్లు, పంట రుణాల సదుపాయం తిరిగి పొందే మార్గం ఏర్పడింది.
- నంద్యాల – బనగానపల్లె, కొలిమిగుండ్ల, కోయిలకుంట్ల, ఒర్వకల్లు మండలాలు...1937 నాటి రికార్డులను పరిశీలించి, ఎస్‌ఆర్‌బీసీ, కాలువగా పేర్కొన్న ప్రైవేటు పట్టా భూములను 22–ఏ నుంచి తొలగించేలా చర్యలు.
- గుంటూరు – వట్టిచెరుకూరు: జీవో 314, 29 మే 2026: 1906 ఆర్ఎస్ఆర్‌లో చెరువు పోరంబోకుగా తప్పుగా వర్గీకరించిన 25.37 ఎకరాలను గ్రామకంఠంగా మార్చారు. 515 కుటుంబాలకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకున్నారు. నిజమైన 83.01 ఎకరాల చెరువు భూమిని పరిరక్షించారు.
- కుప్పం – కంగుంది: జీవో 391 ద్వారా 50 ఏళ్లుగా సాగు చేస్తున్న 100 మంది చిన్న, సన్నకారు రైతుల 529.34 ఎకరాలను అటవీ పోరంబోకు నుంచి ఏడబ్ల్యూడీగా వర్గీకరించి, డీకేటీ పట్టాల మంజూరుకు ఆమోదం.
- నెల్లూరు – భగత్‌సింగ్ కాలనీ: జీవో 158 ద్వారా సర్వే నంబర్ 2,224లోని 36 ఎకరాలపై పెన్నా నది పోరంబోకు వర్గీకరణను ఏడబ్ల్యూడీగా మార్చే చర్యలు చేపట్టారు. సుమారు 20 ఏళ్లుగా నివసిస్తున్న 1,400 పేద కుటుంబాలకు రక్షణ ఏర్పడింది.
- గుంటూరు – మంగళగిరి – నవులూరు: 92.12 ఎకరాల్లోని 1,506 ఇళ్లకు, మరో 8.46 ఎకరాల్లోని 228 ఇళ్లకు సంబంధించిన భూములను 22–ఏ నుంచి తొలగించారు. ఆలయ, పాఠశాల భూములకు రక్షణ కల్పిస్తూ జీవో 361 జారీ.
- తిరుపతి – ఆటోనగర్: అక్కరంపల్లి, మంగళం ప్రాంతాల్లోని 28.99 ఎకరాలు, సుమారు రూ.200 కోట్ల విలువైన భూమి 22–ఏ నుంచి తొలగించారు. సుమారు 1,500 మంది కార్మికులకు రిజిస్ట్రేషన్ హక్కులు తిరిగి అందుబాటులోకి వచ్చాయి.
- రామాయపట్నం – బీపీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ: ప్రకాశం జిల్లా పరిధి గుడ్లూరు, నెల్లూరు జిల్లా కావలి ప్రాంతాల్లో కలిపి 6,042.46 ఎకరాల కేటాయింపు, మ్యూటేషన్ ప్రక్రియలను వేగవంతం చేశారు.





- ఎన్టీఆర్ జిల్లా: జీవో 615 ద్వారా అభ్యంతరం లేని పోరంబోకు భూముల్లో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను 22–ఏ నుంచి తొలగించి 24,042 కుటుంబాలకు క్రమబద్ధీకరణ చేశారు. జీవో 618 ద్వారా ఎండిపోయిన చెరువు భూమిలోని 91.14 ఎకరాలపై నివసిస్తున్న 2,359 బీపీఎల్ కుటుంబాలకు చట్టబద్ధ గుర్తింపు కల్పించారు.
- గుంటూరు – పుల్లడిగుంట: వట్టిచెరుకూరు పరిధిలో 8.51 ఎకరాల టాపు పోరంబోకు భూమిలో ఉన్న 201 ఇళ్లు, పాఠశాల, మసీదుకు సంబంధించిన భూమిని గ్రామకంఠంగా వర్గీకరించే ప్రతిపాదన చేపట్టారు.
- గుంటూరు – ఏటుకూరు: 4 జూలై 2026న ఎండోమెంట్ శాఖకు చెందని సర్వే నంబర్ 74లోని 5.93 ఎకరాలను 22–ఏ(1)(సి) నుంచి తొలగించారు.
- మంగళగిరి–తాడేపల్లి: ఎండోమెంట్స్ భూముల్లో నివసిస్తున్న 377 పేద కుటుంబాల కోసం మార్కాపురం జిల్లా, తర్లుపాడు మండలం, తుమ్మలచెరువు వద్ద 10 ఎకరాల ప్రత్యామ్నాయ భూమిని కేటాయించారు. అసలు భూమిని ఎండోమెంట్స్ శాఖకు అప్పగించే ప్రక్రియ చేపట్టారు. దీనికి జీవో 30 జారీ చేశారు.
- ఏలూరు–కలిదిండి, ఉనికిలి, వైవాక: 297.88 ఎకరాల భూసమస్యలకు 22 ఏ నుంచి తొలగించి పరిష్కారం చూపారు. దీంతో 52 కుటుంబాలకు లబ్ధి కలిగింది.
- ప్రకాశం జిల్లాలో అక్టోబర్ 9న జరిగిన 'మీభూమి–మీహక్కు' కార్యక్రమంలో 3,304 ఎకరాలకు సంబంధించి వివిధ భూ సమస్యలకు పరిష్కారం చూపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న 7,981 కుటుంబాల ఆశలను నిజం చేశారు.

ఇవే కాకుండా ప్రభుత్వ భూముల్లో ఎన్నో ఏళ్లుగా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న కుటుంబాలకు 'పేదలకు పట్టాభిషేకం' పేరుతో శాశ్వత ఇళ్ల హక్కు పత్రాలను ఇచ్చారు. విశాఖ, మంగళగిరి, విజయవాడ, నెల్లూరు దాదాపు 60 వేల కుటుంబాలకు రూ.52 వేల కోట్ల విలువైన ఆస్తి దీంతో సమకూరింది. పేదల ఆత్మగౌరవానికి శాశ్వత ఇంటిపట్టాలతో కూటమి ప్రభుత్వం పట్టాభిషేకం చేసింది. ఇలా రెవెన్యూ సంబంధిత అంశాల్లో అనేక కీలక నిర్ణయాలతో ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ప్రస్తుతం ఫలితాలు కనిపిస్తున్నా... ఇంకా అనేక సమస్యలు, సవాళ్లు శాఖ ముందు ఉన్నాయి. అన్నింటినీ పరిష్కరించి రెవెన్యూ శాఖను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ఫోకస్‌తో పనిచేస్తున్నారు.

## తిరుమలలో వైభవంగా
## నవరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**పెదశేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్ప స్వామి విహారం**



తిరుమల (చైతన్య రథం): తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు పెదశేష వాహనంపై తిరుమల మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు నిర్వహించే పెదశేష వాహన సేవ ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. శేషతల్పంపై అధిష్ఠించిన శ్రీనివాసుడు తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయ ప్రదానం చేశారు. స్వామివారు కొలువైన కొండకు శేషాద్రి అనే పేరు ఉండటంతో తొలి రోజు శేష వాహన సేవ నిర్వహించడం విశేషంగా భావిస్తారు. విష్ణో గ్రుడైన ఆదిశేషుడిపై కొలువుదీరిన దేవదేవుడు మానవుల్లోని కల్మషాన్ని తొలగిస్తాడన్నది ఈ సేవలోని అంతరార్థంగా చెబుతారు. తిరు ఆభరణాలతో అలంకరించి, ఉభయ దేవేరులతో కలిసి దర్శనమిచ్చిన మలయప్ప స్వామివారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. స్వామివారి వాహన సేవను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాడవీధుల్లో సాగిన పెదశేష వాహన ఉత్సవం భక్తులకు కనులపండువగా నిలిచింది.



చైతన్యరథం

# పెట్టుబడులకు, ప్రగతికి... ఏపీ స్వర్గధామం

- జాతి కోసం, దేశం కోసం పారిశ్రామికవేత్తలు ఆలోచించాలి
- సింగపూర్ తరహాలో సమష్టి శ్రమతో విజయం సాధ్యం
- ఐక్యంగా ఆంధ్రప్రదేశ్ పురోగతిలో భాగస్వాములు అవుదాం
- పరిశ్రమలు మొదటి రోజు నుంచే పర్యావరణం మీద దృష్టి పెట్టాలి
- అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో ప్రభుత్వం చొరవ
- కాకినాడ సీఐఐ ప్రాంతీయ సదస్సులో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్






కాకినాడ (చైతన్య రథం): 'గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తలు భయపడే పరిస్థితి ఉండేది. రాష్ట్రంలో మీరు పరిశ్రమ పెడితే.. మాకేమిస్తారు? అని అడిగే విష సంస్కృతి అప్పట్లో ఉండేది. కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు రాష్ట్రాన్ని స్వర్గధామంగా మారుస్తోంది. మీరు పెట్టుబడులు పెడితే రాష్ట్రానికి ఏం ఇస్తారు? ప్రజలకు ఏం చేస్తారు? అని అడిగి సత్సంప్రదాయంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోంద'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పరిశ్రమలకు రాష్ట్రంలో అపార అవకాశాలున్నాయి. వాటిని అందిపుచ్చుకొని, ఏపీ పురోగతిలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కాకినాడ జేఎన్టీయూలో సోమవారం జరిగిన సీఐఐ ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "విశ్రాంత ఉద్యోగుల ప్యారడైజ్ నగరంగా భావించే కాకినాడలో తొలిసారి సీఐఐ ప్రాంతీయ సదస్సు జరగడం ఆనందంగా ఉంది. విశాఖపట్నం తర్వాత రాష్ట్రంలో రెండో ప్రాంతీయ సదస్సుకు కాకినాడ వేదిక కావడం గొప్ప మైలురాయి. కాకినాడ పారిశ్రామిక ప్రగతి చరిత్రలో రూ.6,347 కోట్ల పెట్టుబడులు రావడం కొత్త అవకాశాలకు పునాది వేస్తుంది. ఈ ప్రాంతం మరింత పురోగతి చెందడానికి ఇది ఇంధనంగా పని చేస్తుంది" అన్నారు.

**18 వేల మందికి ఉపాధి**

"16 ఎంఓయూల ద్వారా రూ.4,652 కోట్ల పెట్టుబడులు, రూ.2,090 కోట్లతో పూర్తయిన 4 ప్రత్యేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరగడం శుభసూచకం. ఈ ప్రాజెక్టుల ద్వారా కాకినాడ, చుట్టుపక్కల ప్రాంతాల్లో 18 వేల మందికి ఉపాధి లభించనుంది. ఇది యువతకు ఉపాధి భరోసాను ఇవ్వడంతోపాటు ఎన్నో కుటుంబాలకు ఓ ఆసరాను చూపించే గొప్ప కార్యక్రమంగా నిలిచిపోతుంది" అని ఆకాంక్షించారు.

**సింగపూర్ ఎదిగిన క్రమం మనకు స్ఫూర్తి**

"1965 ప్రాంతంలో సింగపూర్ అత్యంత పేద దేశం. కనీస అవసరాలు తీర్చుకోవడానికి, దేశం ముందుకు వెళ్లడానికి సరైన అవకాశాలు లేని స్థితి నుంచి తన అభివృద్ధి ప్రయాణాన్ని మొదలుపెట్టింది. ఒక్కో ఇటుక పేర్చుకుంటూ సంకల్ప బలంతో, సమష్టి కృషితో ఈనాటి ప్రపంచంలో అద్భుతమైన దేశంగా మారింది. స్విట్జర్లాండ్ దేశ నమూనా కూడా అలాంటిదే. మనలో స్పష్టత, ఐక్యత, జాతీయత ఉంటే కచ్చితంగా దేశాన్ని పురోగమన దిశగా ముందుకు తీసుకెళ్లవచ్చు. పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా సహకరించేందుకు, వారిని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది. వారికి తగిన ప్రోత్సాహకాలు, అనుమతులు త్వరితగతిన ఇస్తున్నాం. పారిశ్రామికవేత్తలు కూడా అదే నిబద్ధతతో, పర్యావరణ హితంగా యువతకు మెరుగైన ఉపాధి చూపుతూ రాష్ట్రాభివృద్ధికి సహకరించాలి" అని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

**జంషెడ్జీ టాటా దేశాన్ని ముందుకు నడిపారు**

"పారిశ్రామికవేత్తలు కేవలం లాభం లెక్కలు మాత్రమే వేయకుండా మనతో పాటు దేశం, జాతిని ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పం చేసుకోవాలి. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ ద్వారా సమాజానికి మేలు చేయాలనే ఆలోచన ఎల్లవేళలా ఉండాలి. భారతదేశ అభివృద్ధికి జంషెడ్జీ టాటా చేసిన ఎన్నో కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఆయన కేవలం పరిశ్రమలంటే లాభాలు ఆర్జించే మార్గాలుగానే కాకుండా, జాతిని ముందుకు నడిపించే ఇంధనాలుగా భావించారు. ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వర్తించారు. పెట్టుబడుల రాక, పరిశ్రమల స్థాపన అనేది కేవలం లెక్కల కింద, పారిశ్రామిక ప్రగతి కింద మాత్రమే చూడకూడదు. ఇది వేలాది కుటుంబాల జీవనశైలిని మార్చబోయే భరోసాగా భావించాలి" అని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకంలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి నాయకత్వంలో 2024 జూన్‌నుంచి 714 ప్రాజెక్టుల రూపంలో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. వీటిలో రూ.16.6 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ప్రభుత్వ అనుమతులు పూర్తయితే, రూ.4.7 కోట్ల ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యాయి. వీటి వల్ల రాష్ట్రంలో యువతకు 7.1 లక్షల ఉద్యోగాలు రానున్నాయని వెల్లడించారు.

**తీర ప్రాంతం రాష్ట్రానికి వరం**

రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం అంటే కేవలం ఒప్పందాలు కుదుర్చుకోవడం మాత్రమే కాదు.. వాటిని పూర్తిస్థాయిలో ప్రారంభించేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. ప్రాజెక్టుల రాకకు, పెట్టుబడులను విస్తృతం చేయడానికి, ప్రారంభానికి అన్ని రకాల అనుమతులను పారదర్శకంగా, వేగంగా ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను చక్కగా నిర్వర్తిస్తోంది. దీనివల్లే దేశంలోనే ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు ప్యారడైజ్‌గా మారిందని పవన్ అన్నారు. కాకినాడ పేరు చెప్పగానే శ్రమజీవుల వేదికగా గుర్తుకొస్తుంది. కార్మికులు, కర్షకులు, మత్స్యకారులు, వేతన జీవులు అధికం. అవకాశాలను అందిపుచ్చుకునే యువత ఉన్నారు. మార్పును స్వీకరించే సామర్థ్యం కాకినాడకు ఉంది. మారిటైమ్ బోర్డు పరిశ్రమలు, నౌక నిర్మాణ పరిశ్రమలు, గ్రీన్ హైడ్రోజన్, రసాయన, ఆహార శుద్ధి, ఆక్వా ఉత్పత్తుల పరిశ్రమలు రాబోతున్నాయి. వచ్చే పరిశ్రమలన్నీ ప్రపంచంతో అనుసంధానమై, ఇక్కడి ఉత్పత్తులను ప్రపంచానికి తీసుకెళ్లే అవకాశం ఉన్నవి. ఆంధ్రప్రదేశ్‌కు 1053 కిలోమీటర్ల తీర ప్రాంతం ఓ వరం. దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. సుస్థిరమైన పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, తీర రక్షణ అంతే ప్రధానం. దీనికి పరిశ్రమలు తగిన విధంగా సహకరించాలి. గ్రేట్ గ్రీన్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. పచ్చదనం పెంపు, పర్యావరణహితమైన పారిశ్రామిక అభివృద్ధి రాష్ట్రానికి ప్రధానం. తీర ప్రాంత రక్షణ, అక్కడ జీవుల మనుగడ, అభివృద్ధిపైన ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని పేర్కొన్నారు.

**పల్లెలవైపు పెట్టుబడులు రావాలి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పల్లెలు, ఏజెన్సీ ప్రాంతాల్లో సౌకర్యాల పెంపు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రంలో పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరుతో చేస్తున్న కార్యక్రమాలు గ్రామాలు, గిరిజన ఆవాసాలకు సౌకర్యాల కళను తీసుకొస్తున్నాయి. రూ.1.70 లక్షల కోట్లతో పల్లెలు, ఏజెన్సీల్లో ముమ్మరంగా రోడ్లు, డ్రెయిన్లు, అను సంధాన దారులు, ఇతర సౌకర్యాలను పెంచే కార్యక్రమం చేస్తున్నాం. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి దారులు పల్లెలు, గిరిజన ప్రాంతాల్లో కూడా తమ దృష్టి నిలిపి, పరిధిని విస్తరించాలని కోరుతున్నాను. దీనిద్వారా అన్ని ప్రాంతాలకు అభివృద్ధి విస్తరించ డంతో పాటు గ్రామాలకు కొత్త అవకాశాలు సృష్టించడం కూడా సులభం అవుతుందని డిప్యూటీ సీఎం అన్నారు.

**రండి.. రాష్ట్ర ప్రగతిలో భాగం పంచుకోండి**

రాష్ట్రంలోకి ఎంతో ఉత్సాహంతో వస్తున్న పెట్టుబడిదారులకు నేను చెప్పేది ఒకటే. రండి.. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో మాతో కలిసి నడవండి. ప్రజల ఉన్నతి కోసం పనిచేయండి. స్థానిక పెట్టుబడులతో యువతకు ఉపాధి నైపుణ్యాలను కల్పించి ఉద్యోగాలు వస్తాయి. వ్యాపారులకు వ్యాపారం జరుగుతుంది. గ్రామీణులు, మత్స్యకారులతోనూ పనిచేసే అవకాశం ఉంటుంది. పెట్టుబడులు పెడుతున్న మొదటి రోజు నుంచే పర్యావరణ హితమైన పారిశ్రామిక అభివృద్ధి అనే కోణంలోనే ముందడుగు వేయండి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి రంగం అభివృద్ధి చెందేలా, ప్రతి వర్గం ఉన్నతి సాధించేలా ఓ సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. దీనిలో భాగస్వామ్యం అవుతున్న ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్ మాధుర్, సానా సతీష్ బాబు, సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# రూ.కోటి అభివృద్ధి పనులకు మంత్రి పార్థసారథి శ్రీకారం

**కృష్ణవరం, ఆగిరిపల్లిలో కమ్యూనిటీ హాళ్లు, రహదారులు, కల్వర్టుల నిర్మాణం**

ఏలూరు/ఆగిరిపల్లి (చైతన్య రథం): పట్టణాలకు ధీటుగా గ్రామాలను అభివృద్ధి చేయడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలో సోమవారం మొత్తం రూ.కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కృష్ణవరం గ్రామంలో రూ.80 లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాలు, రహదారి, కల్వర్టు నిర్మాణ పనులతో పాటు ఆగిరిపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ముదిరాజుల కమ్యూనిటీ హాలుకు భూమిపూజ నిర్వహించి, శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి, కుంకుమ తిలకం దిద్దారు. బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

**గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం**

ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ గ్రామాల్లో మిగిలివున్న అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, మురుగునీటి పారుదలకు ఇబ్బందులు ఎదురుకాకుండా డ్రైనేజీ వ్యవస్థలు, కల్వర్టుల నిర్మాణం కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

**సామాజిక కార్యక్రమాలకు కమ్యూనిటీ హాళ్లు**

నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు శుభకార్యాలు, ఇతర సామాజిక కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాళ్లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత



గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కూటమి నాయకులు, గంగిరెడ్డుల సంఘం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# సీతన్నపేట అభివృద్ధికి రూ.1.50 కోట్లు..
# పనులకు మంత్రి అచ్చెన్నాయుడు శ్రీకారం

- **ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం**
- **శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు**



కోటబొమ్మాళి (చైతన్య రథం): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం సీతన్నపేట గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. సీతన్నపేటలో సోమవారం రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

**ప్రతి ఇంటికీ తాగునీరు**

సీతన్నపేటలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. సుమారు రూ.644 కోట్ల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి పథకానికి ఆమోదం లభించిందని, టెండర్ ప్రక్రియతో పాటు ఒప్పంద ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. పనులను త్వరితగతిన ప్రారంభించేలా సంబంధిత అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. ఈ పథకంలో భాగంగా గ్రామానికి ప్రత్యేక నీటి ట్యాంకును నిర్మించి, అక్కడి నుంచి పైపుల ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వేసవిలో బోర్లు ఎండిపోవడం, నీటి కొరత ఏర్పడటం వంటి సమస్యలు మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

**తాత్కాలికంగా నీటి సరఫరాకు చర్యలు**

శాశ్వత తాగునీటి పథకం అందుబాటులోకి వచ్చే వరకు గ్రామ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తానని మంత్రి తెలిపారు. తాగునీటి సమస్యపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన సౌకర్యాలు కల్పించే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, ప్రతి కుటుంబానికి మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, వెలమల విజయలక్ష్మి, బోయిన గోవిందరాజులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి పాలన

***సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం -మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి***



అమరావతి (చైతన్య రథం): అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సోమవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం పెద్దపవనిలోని ఎస్టీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ వాటిని సూపర్ హిట్ చేశామని తెలిపారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా పెద్ద సంఖ్యలో పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు రూ.5కే భోజనం అందిస్తున్నామని, కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ 'తల్లికి వందనం' పథకం వర్తింపజేస్తున్నామని వివరించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు 'తల్లికి వందనం' పథకం అమలుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. మహిళలకు ప్రయాణ సౌకర్యం కల్పించే 'స్త్రీశక్తి' పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో హామీ ఇవ్వకపోయినా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి వివరించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు.

## వివేకా హత్య కేసులో భాస్కరరెడ్డికి ఈడీ నోటీసులు

**ఆర్థిక లావాదేవీలపై మనీలాండరింగ్ కోణంలో విచారణ**




హైదరాబాద్ (చైతన్య రథం): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏడో నిందితుడిగా ఉన్న వైఎస్ భాస్కరరెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై అధికారులు ఆరా తీయనున్నారు. సీబీఐ దర్యాప్తులో వెల్లడైన అంశాల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద ఈడీ అధికారులు ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని భాస్కరరెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న సునీల్ యాదవ్, ఎర్ర గంగిరెడ్డి, దస్తగిరిని ఈడీ ఇప్పటికే ప్రశ్నించింది. సోమవారం దేవిరెడ్డి శివశంకరరెడ్డిని కూడా వివిధ కోణాల్లో విచారించింది. తదుపరి దశలో మంగళవారం భాస్కరరెడ్డి, బుధవారం వైఎస్ అవినాశ్‌రెడ్డిని విచారించనున్నట్లు సమాచారం.

# ఏపీని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- **పర్యాటక రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలు**
- **పరిశ్రమలతో సమానంగా రాయితీలు..**
- **సులభతర భూ కేటాయింపులు, వేగవంతమైన అనుమతులు**
- **సీఐఐ ప్రాంతీయ సదస్సులో పర్యాటక మంత్రి దుర్గేష్ వెల్లడి**




కాకినాడ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా, ప్రపంచ స్థాయి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని, పెట్టుబడిదారులకు అవసరమైన ప్రోత్సాహకాలు, రాయితీలు, వేగవంతమైన అనుమతులు కల్పిస్తామని వెల్లడించారు. కాకినాడలోని జేఎన్‌టీయూలో నిర్వహించిన 31వ సీఐఐ ప్రాంతీయ సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. అంతకుముందు యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శన శాలలను సందర్శించారు.

**పర్యాటక రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం**

నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు కాకినాడతోపాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ప్రాంతీయ సదస్సులు సన్నాహక సమావేశాలుగా ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. సమావేశాల్లో రూపొందించే సమగ్ర నివేదికలను విశాఖ సదస్సులో ప్రవేశపెడతామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. నూతన పర్యాటక విధానం 2024-29, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం ద్వారా గత రెండున్నరేళ్లలో రూ.20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగామని వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రాష్ట్రానికి ప్రముఖ స్టార్ హోటళ్లు వస్తున్నాయని తెలిపారు. క్యారవాన్ టూరిజం, హోమ్‌స్టేలు, భూ కేటాయింపులకు సంబంధించి ప్రత్యేక విధానాలను అమల్లోకి తీసుకొచ్చినట్లు వివరించారు.

**భూ కేటాయింపులు.. వేగవంతమైన అనుమతులు**

హోటళ్లు, రిసార్టులు, ఇతర పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలనుకునే పెట్టుబడిదారులకు అవసరమైన భూములను కేటాయించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని దుర్గేష్ తెలిపారు. అవసరాన్ని బట్టి ఇతర శాఖలకు చెందిన భూములను పర్యాటక శాఖకు బదిలీ చేసి ప్రాజెక్టులకు కేటాయించే అవకాశం ఉందన్నారు. పరిశ్రమలకు అందించే రాయితీలను పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికీ వర్తింపజేస్తామని స్పష్టం చేశారు. సులభతర భూ కేటాయింపులు, వేగవంతమైన అనుమతులతో పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

**1,053 కిలోమీటర్ల తీరప్రాంతంలో అపార అవకాశాలు**

రాష్ట్రానికి ఉన్న 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం పర్యాటక అభివృద్ధికి గొప్ప అవకాశమని మంత్రి పేర్కొన్నారు. తీర ప్రాంతాల్లో యోగా, ఆయుర్వేద కేంద్రాలతో కూడిన వెల్‌నెస్ సెంటర్లను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. వీటితో పాటు వివిధ పర్యాటక ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చన్నారు. కేరళలో నిర్వహించిన జీటీఎం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 'బెస్ట్ టూరిజం ప్రమోషన్ అవార్డ్' లభించడం రాష్ట్ర పర్యాటక రంగానికి గర్వకారణమని చెప్పారు. ఇటీవల రాజమహేంద్రవరంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన 'గోదావరి కాల్స్' కార్యక్రమాన్ని భవిష్యత్తులో ఇతర రంగాలకూ విస్తరించి పర్యాటకులకు కొత్త అనుభూతులను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**ఎకో టూరిజంతో యువతకు ఉపాధి**

గిరిజన ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో థీమ్ పార్కులు, అడ్వెంచర్ యాక్టివిటీలు, ట్రెక్కింగ్‌వంటి పర్యావరణ అనుకూల పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని మంత్రి కొనియాడారు. గ్రామీణ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రశంసించారు.

**పెట్టుబడిదారులకు మంత్రి ఆహ్వానం**

"ఆంధ్రప్రదేశ్‌కు రండి.. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టండి. పరిశ్రమలతో సమానంగా రాయితీలు అందిస్తాం. సులభతర భూ కేటాయింపులు, వేగవంతమైన అనుమతులు కల్పిస్తాం. పెట్టుబడిదారులకు పూర్తి భరోసా ఇచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిది. త్వరలోనే 'పర్యాటకాంధ్రప్రదేశ్' కలను సాకారం చేసి రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం" అని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

# నిరుపేద కుటుంబాలకు అండగా 'సమావేశి ఆజీవిక యోజన'

- పదివేల కుటుంబాలకు జీవనోపాధి కల్పనకు శ్రీకారం
- రాష్ట్రంలో పేదరికానికి చరమగీతం
- అభివృద్ధి ఫలాలు నిరుపేదలకు అందాలన్నదే లక్ష్యం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టీకరణ



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని అత్యంత నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సమావేశి ఆజీవిక యోజన' ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనదయాళ్ అంత్యోదయ యోజన -జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. తీవ్ర పేదరికంవల్ల స్వయం సహాయక సంఘాల పరిధిలోకి రాని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందని నిరుపేద కుటుంబాలను గుర్తించి, పేదరికం నుంచి బయట పడేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని మంత్రి తెలిపారు. యానాది, చెంచు కులాల జనాభా ఎక్కువగా ఉన్న 26 మండలాల్లోని 650 గ్రామ సంఘాల ద్వారా 10,000 అతి నిరుపేద కుటుంబాలను ఎంపిక చేసి... భాగస్వామ్య గ్రామీణ మదింపు, గృహ సర్వేల ద్వారా కుటుంబాలను గుర్తిస్తామన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన 'సాయం' యాప్ ద్వారా దుర్బలత్వ సూచీ ఆధారంగా ప్రాధాన్యతా ర్యాంకింగ్ ఇస్తారని మంత్రి పేర్కొన్నారు.

మండల సమాఖ్యలు ఎంపిక చేసే 100 మంది ఉపాధి సఖులు ప్రతి ఒక్కరూ 100 కుటుంబాలకు మార్గదర్శకత్వం వహిస్తూ సహాయపడతారని.. ప్రతి కుటుంబానికి తగిన ప్రత్యేక జీవనోపాధి ప్రణాళికను సిద్ధం చేస్తారని మంత్రి తెలిపారు. ఇందులో ప్రకృతి వ్యవసాయానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించి, ఆస్తుల ఏర్పాటు వరకు ఉపాధి సఖులు తోడ్పాటు అందిస్తారని.. కార్యక్రమానికి 'సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్' సాంకేతిక సహకారాన్ని అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ నెల 21న సెర్ప్ కార్యాలయంలో 26 మండల సమాఖ్యల అధ్యక్షులతో సమావేశం, 'సాయం' యాప్‌పై శిక్షణ ఉంటుందని.. అక్టోబర్ 25 -30 మధ్య గ్రామ సంఘాల ఆధ్వర్యంలో భాగస్వామ్య గ్రామీణ మదింపు (పీఆర్‌ఏ) నిర్వహిస్తూ ఉపాధి సఖులకు శిక్షణ ఇస్తారని మంత్రి తెలిపారు. నవంబర్ 1 -15 తేదీల మధ్యలో గృహ సర్వే నిర్వహణ, 16న అత్యంత నిరుపేద కుటుంబాల తుది జాబితా ప్రకటన తర్వాత డిసెంబర్‌లో కుటుంబాల వారీగా జీవనోపాధుల గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే జనవరి నుంచి బ్యాంకు అనుసంధానం జీవనోపాధి ఆస్తుల ఏర్పాటు ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, "అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వరుసలో ఉన్న కుటుంబం వరకు అందాలన్నదే గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొ న్నారు. నిరుపేద కుటుంబాలు వెనకపడకుండా స్వయం సహాయక సంఘాల మహిళల సామర్థ్యాన్ని ఉపయోగించుకుని ఈ పథకాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు.

# భూరికార్డులు మార్చేసి కబ్జాలకు పాల్పడ్డారు





- వైసీపీ' అరాచకాలపై ప్రజావినతుల్లో ఫిర్యాదులు
- 'జగనన్న భూరక్ష సర్వే'తో రికార్డులు మార్చేశారంటూ ఆవేదన
- అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు
- సమస్యల పరిష్కారానికి హామీ

మంగళగిరి (చైతన్య రథం): గత వైసీపీ పాలనలో భూకబ్జాలు, రికార్డుల మార్పులు, దౌర్జన్యాలకు గురైన బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో శాసనసభ్యులు ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు.

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటకు చెందిన రేవిడి కృష్ణ.. అలమూరు మండలం లంకధర్మవరంలో తమ కుటుంబం దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూమి రికార్డులను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తాడేపల్లిగూడెంకు చెందిన శ్రీహరి పేరిట మార్చేశారని వాపోయారు. విచారణ జరిపి, రికార్డులు సరిచేసి, భూమిని తమకు తిరిగి ఇప్పించాలని కోరారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం యక్కలవారిపాలెంకు చెందిన నలమాల రాజా టీడీపీ కార్యకర్త. 2021లో వైసీపీకి చెందిన గడ్డి సుధాకర్, దాసు, అనిల్, యేసురత్నమ్మ, అనిత తన ఇంటిపైకి దౌర్జన్యంగా వచ్చి తనను, భార్యను, 14 ఏళ్ల కుమార్తెను కొట్టారని ఫిర్యాదు చేశారు. పైగా తమపైనే కేసు పెట్టించి జైలుకు పంపారని, ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నానని చెప్పారు. వచ్చేది తమ ప్రభుత్వమేనంటూ వారు బెదిరిస్తున్నారని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన ఆలకుంట కడియ్య.. భార్యతో కలిసి తమకున్న 3.50 ఎకరాల్లో 60 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నామని, 1995లోనే తహసీల్దార్ పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చారని తెలిపారు. జగనన్న భూరక్ష సర్వే ద్వారా భూమి సర్వే నంబరు, డిజిటల్ రికార్డులను మార్చేశారని, వాటిని సరిచేయాలని కోరారు.

పల్నాడు జిల్లా క్రోసూరు మండలం అవులవారిపాలెంకు చెందిన వల్లాల దుర్గారావు.. తమకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన స్థలాన్ని గోపు గురవయ్య, తోకల ఏడుకొండలు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. స్థలాన్ని ఇప్పించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం పానగల్‌కు చెందిన పి.రామకృష్ణయ్య.. శ్రీ కూర్మనాథ గోపాలస్వామి దేవస్థానం భూములను కొందరు తప్పుడు డిజిటల్ ఎంట్రీల ద్వారా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆ ఎంట్రీలను రద్దు చేసి, దేవస్థాన భూములను కాపాడాలని కోరారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం కుప్పనపల్లికి చెందిన బి.శంకరయ్య శెట్టి.. 2007లోనే తన పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగల్ మంజూరయ్యాయని తెలిపారు. అయితే తన భూమిని బాబాయి కృష్ణయ్య శెట్టి అక్రమంగా తన పేరున పట్టా చేయించుకుని ఆక్రమించుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ జరిపి భూమిని తనకు ఇప్పించాలని కోరారు. చిత్తూరు జిల్లా వి.కోట మండలం గోవిందనగర్ కాలనీకి చెందిన తిరుమలమ్మ.. 2007లో కొనుగోలు చేసిన స్థలంలో ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నామని, స్థలం ఇచ్చినవారే కొందరు ఇంటికి వెళ్లే దారికి రాళ్లు, కర్రలు అడ్డుపెట్టి ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఇంటికి దారి చూపించి ఆదుకోవాలని కోరారు.

వి.కోట మండలం మిట్టూరుకు చెందిన జి.శ్యామమూర్తి.. కుటుంబ భాగ పరిష్కారంలో తండ్రి ద్వారా తనకు వచ్చిన భూమికి పట్టా, పాసుపుస్తకం, అడంగల్ ఉన్నాయని, అయినా కొందరు దౌర్జన్యంగా సాగు చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, పోలీసులకు చెప్పినా ఫలితం లేదని, భూమిని తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిపల్లెకు చెందిన బి.మల్లప్ప నాయుడు.. ప్రభుత్వం పట్టా ఇచ్చిన స్థలంలో పునాది వేశానని, అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారు ఇల్లు కట్టుకోనివ్వడం లేదని వాపోయారు. ఇల్లు కట్టుకునేలా చూడాలని కోరారు. ఏలూరు జిల్లా మండవల్లి మండలం నుచ్చుమిల్లికి చెందిన జి.జోగిరాజు.. గతంలో గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన జగదీష్ కుమార్ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. లెక్కలు చూపమని అడిగితే బెదిరిస్తున్నారని చెప్పారు. విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పంచాయతీ నిధులను కాపాడాలని కోరారు.

వీరితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కొందరు ఉద్యోగాల కోసం బయోడేటాలు అందజేయగా, మరికొందరు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, ఆర్థిక సాయం అందించాలని అభ్యర్థించారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా విన్న నేతలు, అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# పేదల వైద్యానికి 'సీఎంఆర్‌ఎఫ్' భరోసా

- 514 మందికి చెక్కుల మంజూరు.. ఇప్పటివరకు రూ.5.23 కోట్ల ఆర్థిక తోడ్పాటు
- ఎన్టీఆర్ భవన్‌లో 67 మంది లబ్ధిదారులకు రూ.33.70 లక్షల ఆర్థిక సాయం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా చెక్కుల పంపిణీ



కోటబొమ్మాళి (చైతన్య రథం): పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపత్కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) అండగా నిలుస్తోంది. అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ఈ నిధి ద్వారా ఆర్థిక చేయూత అందుతోంది. కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్ వద్ద వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు 67 మంది లబ్ధిదారులకు రూ.33,70,344 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోట బొమ్మాళి మండలాలకు చెందిన లబ్ధిదారులకు నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమక్షంలో చెక్కులు అందజేశారు.

**ఇప్పటివరకు రూ.5.23 కోట్ల సాయం**

కార్యాలయం ద్వారా ఇప్పటివరకు ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం మొత్తం 604 దరఖాస్తులను పంపించగా, వాటిలో 514 చెక్కులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు లబ్ధిదారులకు మొత్తం రూ.5.2 కోట్ల ఆర్థిక సహాయం అందింది. మరో 84 దరఖాస్తులు సంబంధిత విభాగంలో పరిశీలనలో ఉన్నాయి. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయ నిధి ఎంతో తోడ్పాటునందిస్తోంది. అర్హులైన లబ్ధిదారు లకు ప్రభుత్వ సహాయం అందేలా దరఖాస్తుల ప్రక్రియను కొనసాగిస్తూ, మంజూరైన ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబాలకు అందజేస్తున్నారు.

**మండలాల వారీగా అందిన ఆర్థిక సాయం**

కోటబొమ్మాళిలో 201 దరఖాస్తులు పంపగా 176 చెక్కులు మంజూరయ్యాయి. రూ.1,38,46,256 ఆర్థిక సాయం అందింది. సంతబొమ్మాళిలో 207 దరఖాస్తుల్లో 172 చెక్కులు మంజూరయ్యాయి. రూ.1,63,66,212 సాయం అందింది. టెక్కలిలో 83 దరఖాస్తుల్లో 72 చెక్కులు మంజూరయ్యాయి. రూ.75,97,532 ఆర్థిక తోడ్పాటు లభించింది. నందిగాంలో 113దరఖాస్తుల్లో 94చెక్కులు మంజూర య్యాయి. రూ.75,80,856 సాయం అందింది. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, గోవిందరాజులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్నారులకు క్వాంటం సైన్స్‌ను పరిచయం చేసే కథల పుస్తకం

## - సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లకు అంకితం చేసిన రచయితలు




చిన్నారుల్లో శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందిస్తూ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తిని కలిగించే లక్ష్యంతో రూపొందించిన "ఽప్త్రవ ాఋఖుత్బవ ాాఁజవత్బతీవం శీట =శీఏశీ-దీ్ఱ, మీఋఇ ఖఅఎ ాఋబఋఅఅవఎ-ాఋబఎ్ఱ" సైన్స్ కథల పుస్తకం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రచయితలు రాజేష్ కుమార్ డి, డి.ఎ. రాజు సంయుక్తంగా రచించిన ఈ పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు అంకితం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు, సాంకేతిక రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌ల దార్శనికత తమకు స్ఫూర్తినిచ్చిందని రచయితలు పేర్కొన్నారు. భవిష్యత్తులో కీలకంగా మారనున్న క్వాంటం టెక్నాలజీ వంటి అత్యాధునిక శాస్త్ర సాంకేతిక అంశాలను చిన్నారులకు బాల్యం నుంచే పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రూపొందించారు.

**కథలతో క్వాంటం ప్రపంచంలోకి చిన్నారులు**

రోబో-బిట్, మాక్స్, క్విన్నీ-క్యూబిట్ అనే ఆసక్తికరమైన పాత్రల ద్వారా కథను ముందుకు నడిపిస్తూ, సంక్లిష్టమైన శాస్త్రీయ సిద్ధాంతాలను సులభంగా అర్థమయ్యేలా వివరించడం ఈ పుస్తకంలోని ప్రధాన ప్రత్యేకత. క్వాంటం కంప్యూటింగ్, సూపర్‌పొజిషన్, ఎంటాంగిల్‌మెంట్, క్వాంటం సెన్సింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక అంశాలను సరళమైన వివరణలు, ఆకట్టుకునే బొమ్మలతో చిన్నారులకు పరిచయం చేశారు. పిల్లలు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, కొత్త ఆవిష్కరణలు, భవిష్యత్తు సాంకేతికతలపై ఆసక్తి పెంచుకునేలా ఈ పుస్తకం రూపొందింది. చిన్న వయసులోనే శాస్త్రీయ అవగాహనను పెంపొందించడంతో పాటు, సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం అందించడం దీని ప్రధాన లక్ష్యం.

**సాంకేతిక విద్యకు కొత్త దిశ**

ఈ పుస్తకాన్ని రీచ్‌హైట్స్ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ అండ్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్, వి.ఎన్.ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్తంగా ప్రచురించాయి. క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్తు అవసరాలకు సంబంధించిన అంశాలను చిన్నారులకు చేరువ చేయడం ద్వారా, రాష్ట్రంలో శాస్త్రీయ విద్యాభివృద్ధికి ఈ పుస్తకం దోహదపడే విధంగా చిత్రీకరించారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలో, పిల్లలకు చిన్న వయసు నుంచే ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని పరిచయం చేయడం భవిష్యత్తు ఆవిష్కర్తలను తీర్చిదిద్దేందుకు కీలకమైన అడుగు. ఆ దిశగా "The Quantum Adventures of Robo-Bit, Max and Quinny-Qubit" పుస్తకం బాలల శాస్త్రీయ అభ్యాసానికి ఒక వినూత్న ప్రయత్నంగా నిలుస్తోంది.

**ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రశంసలు**

ఈ పుస్తకంపై ఐఐటీ మద్రాస్ డైరెక్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ వి. కామకోటి ప్రత్యేక ప్రశంసలు వ్యక్తం చేశారు. సాధారణంగా అర్థం చేసుకోవడానికి కష్టమైన క్వాంటం టెక్నాలజీ వంటి సంక్లిష్టమైన శాస్త్రీయ అంశాలను కథల రూపంలో చిన్నారులకు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. పిల్లల్లో సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణిత శాస్త్రాలపై ఆసక్తిని పెంపొందించే STEM విద్యకు ఇటువంటి పుస్తకాలు ఎంతో దోహదపడతాయని ప్రశంసించారు.

# విజయవాడలో తొలిసారిగా జాతీయ సరస్ మేళా

- **13 నుంచి 31 వరకు నిర్వహణ.. ప్రారంభించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**
- **31 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం నుంచి 1,142 మంది మహిళా పారిశ్రామికవేత్తలు**
- **571కు పైగా స్టాళ్లలో గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు**




విజయవాడ (చైతన్య రథం): గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు జాతీయస్థాయిలో మార్కెట్ అవకాశాలు కల్పించే లక్ష్యంతో నిర్వహించే జాతీయ సరస్ మేళాకు విజయవాడ వేదిక కానుంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతం వెలుపల తొలిసారిగా మేళాను విజయవాడలో నిర్వహించనున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్) నేతృత్వంలో 13 నుంచి 31 వరకు పున్నమి ఘాట్ సమీపంలోని బబ్బూరి గ్రౌండ్స్‌లో కార్యక్రమం జరగనుంది. మేళాలో దేశవ్యాప్తంగా 31 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం నుంచి సుమారు 1,142 మంది మహిళా కళాకారులు, స్వయం సహాయక సంఘాల మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారు. 571కు పైగా స్టాళ్లలో చేనేత వస్త్రాలు, హస్తకళలు, సహజ ఉత్పత్తులు, ఆహార పదార్థాలు, సంప్రదాయ గ్రామీణ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించనున్నారు. వివిధ రాష్ట్రాల ప్రత్యేక వంటకాలతో ఇండియా ఫుడ్ కోర్టును కూడా ఏర్పాటు చేయనున్నారు.

**గ్రామీణ మహిళలకు జాతీయ మార్కెట్‌తో అనుసంధానం**

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్‌లో భాగంగా సరస్ మేళాలను నిర్వహిస్తున్నారు. ఈ మేళాలు మహిళలకు తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశాన్ని కల్పించడమే కాకుండా, వినియోగదారుల అభిరుచులను తెలుసుకోవడానికి, ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచడానికి, వ్యాపారాన్ని విస్తరించడానికి దోహదపడతాయి.

**లఖ్‌పతి దీదీ లక్ష్యానికి ఊతం**

గ్రామీణ మహిళల ఆదాయాన్ని పెంచి, వారిని ఆర్థికంగా స్వావలంబన దిశగా, విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కేంద్ర ప్రభుత్వ 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమానికి సరస్ మేళా కీలక వేదికగా నిలవనుంది. 2025 డిసెంబరు నాటికి దేశవ్యాప్తంగా మూడు కోట్ల మంది లఖ్‌పతి దీదీల లక్ష్యాన్ని సాధించిన నేపథ్యంలో, 2026 ఫిబ్రవరిలో ఈ లక్ష్యాన్ని ఆరు కోట్లకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించింది. మహిళలకు మార్కెట్ అవకాశాలు, శిక్షణ, ఆర్థిక సహకారం అందించడం ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకోవడంపై మేళా దృష్టి సారించనుంది.

**శిక్షణ, మార్కెటింగ్‌కు ప్రత్యేక పెవిలియన్లు**

మహిళా పారిశ్రామికవేత్తలకు వ్యాపారాభివృద్ధిలో తోడ్పడేందుకు మేళాలో పలు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు.

**లఖ్‌పతి దీదీ పెవిలియన్:** విజయవంతమైన మహిళా పారిశ్రామికవేత్తలు తమ అనుభవాలను పంచుకొని, ఇతరులకు మార్గదర్శనం చేస్తారు.

**లెర్నింగ్ అండ్ నాలెడ్జ్ పెవిలియన్:** ప్యాకేజింగ్, బ్రాండింగ్, ఈ-కామర్స్, సోషల్ మీడియా మార్కెటింగ్, వ్యాపార ప్రణాళికలపై శిక్షణ ఇస్తారు.

**కన్వర్జెన్స్ పెవిలియన్:** ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక సహకారం, మార్కెట్ అవకాశాలపై సమాచారం అందిస్తారు.

**డెమాన్‌స్ట్రేషన్ పెవిలియన్:** మహిళా కళాకారులు తమ ఉత్పత్తులను తయారు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శిస్తారు.

**ఇండియా ఫుడ్ కోర్ట్:** వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక వంటకాలను అందుబాటులోకి తీసుకువస్తారు.

**సాంస్కృతిక ప్రదర్శనలు:** వివిధ రాష్ట్రాల కళలు, హస్తకళలు, వస్త్ర సంప్రదాయాలు, సంగీతం, నృత్య ప్రదర్శనలతో దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటనున్నారు.

**ఈ-కామర్స్ ద్వారా విస్తృత మార్కెట్**

గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు ఆన్‌లైన్‌లోనూ విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడంపై మేళా ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ వేదికలతోపాటు ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ ద్వారా ఉత్పత్తులను మరింత మంది వినియోగదారులకు చేరువ చేసే అవకాశాలను ప్రోత్సహించనున్నారు.

**జాతీయ సరస్ మేళాకు విజయవాడ వేదిక**

1999లో ఢిల్లీలో సుమారు 65 మంది లబ్ధిదారులతో ప్రారంభమైన జాతీయ సరస్ మేళా, కాలక్రమేణా గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలకు ముఖ్యమైన మార్కెట్ వేదికగా ఎదిగింది. ఇప్పటివరకు 117 జాతీయ సరస్ మేళాలను నిర్వహించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఈసారి తొలిసారిగా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతం వెలుపల విజయవాడను ఎంపిక చేసింది. ఈ మేళా ద్వారా దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు కొత్త వినియోగదారులు, కొనుగోలుదారులు, వ్యాపార సంస్థలతో అనుసంధానం పెరగనుంది. వివిధ రాష్ట్రాల సంప్రదాయ ఉత్పత్తులు, మహిళల నైపుణ్యం, వ్యాపార సామర్థ్యాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ కార్యక్రమం విజయవాడకు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురానుంది.

## పీ4లో బీసీ యువతకు

# ఉచిత సివిల్స్ కోచింగ్

- **డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ, బీసీ సంక్షేమశాఖ మధ్య ఒప్పందం**
- **ఏటా వంద మందికి శిక్షణతో పాటు మెటీరియల్ అందజేత**
- **ఉచిత వసతి కల్పించనున్న ప్రభుత్వం.. మంత్రి సవిత సమక్షంలో ఎంవోయూ**



అమరావతి : దేశంలోనే తొలిసారిగా పీ4 మోడల్‌లో బీసీ నిరుద్యోగ యువతకు ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. ఇందుకోసం డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీతో బీసీ సంక్షేమ శాఖ ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు. ఈ శిక్షణ సందర్భంగా మెటీరియల్ ఉచితంగా ఇవ్వడంతో పాటు అభ్యర్థులకు నిష్ణాతులైన అధ్యాపకులు బోధించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి సవిత సమక్షంతో డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ప్రతినిధులు, బీసీ సంక్షేమ శాఖాధికారులు పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీలను అన్ని రంగాల్లోనూ ముందు ఉంచాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. దీనిలో భాగంగా బీసీల కులాల సంక్షేమానికి పలు పథకాలు అమలుచేస్తున్నారన్నారు. బీసీ యువత ఉన్నత స్థానాల్లో కొలువుదీరాలన్న ఉద్దేశంతో సివిల్స్ సర్వీసెస్, డీఎస్సీ, గ్రూప్ 1, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాల కోసం బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ అందజేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ4 మోడల్‌లో బీసీ యువతకు ఉచిత సివిల్స్ శిక్షణ అందించడానికి దేశంలో ప్రఖ్యాత గాంచిన డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సివిల్స్ శిక్షణ సందర్భంగా డాక్టర్ లక్ష్మయ్య అకాడమీ మెటీరియళ్లతో పాటు నిష్ణాతులైన అధ్యాపకులతో వివిధ సబ్జెక్టులపై బోధన అందించనున్నారన్నారు.

### డీఎస్సీ సహా ఇతర పోటీ పరీక్షలకు త్వరలో ఉచిత శిక్షణ

2014-19లో బీసీ నిరుద్యోగ యువతకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారని మంత్రి సవిత గుర్తు చేశారు. తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం ఉచిత సివిల్స్ కోచింగ్ నిలిపేసిందన్నారు. దీంతో బీసీ నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు పాలైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఉచిత సివిల్స్ కోచింగ్‌ను పునరుద్ధించిందన్నారు. గడిచిన రెండేళ్లలో 200 మందికి ఉచిత సివిల్స్ కోచింగ్ అంజేశామన్నారు. 2025 మెగా డీఎస్సీకి, గ్రూప్ 1కు కూడా ఉచిత శిక్షణ అందజేశామన్నారు. ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన వంద మందికి ఉచిత వసతితో కూడిన శిక్షణ అందజేయనున్నట్టు తెలిపారు. డీఎస్సీ నోఫికేషన్ రాగానే ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్టు తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఆఫ్ లైన్, ఆన్ లైన్ ద్వారా ఈ శిక్షణ అందజేయనున్నామన్నారు. ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్‌వంటి పోటీ పరీక్షలకు కూడా ఉచిత శిక్షణ అందించను న్నట్టు మంత్రి సవిత తెలిపారు. పాల్గొన్న పీ4 ఫౌండేషన్ వైఎస్ చైర్మన్ కుటుంబరావు మాట్లాడుతూ, ఉచిత సివిల్స్ కోచింగ్ మెయిన్స్‌కు ఎంపికైన బీసీ అభ్యర్థులకు రూ.రెండు లక్షల చొప్పున వ్యక్తిగతంగా ఇవ్వనున్నట్టు ప్రకటించారు. పీ4 విధానంలో బీసీలను అన్నిరంగాల్లోనూ ముందు ఉంచా లన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. పార్ధ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు భాగవతుల రవికుమార్ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు ఆశయ సాధనలో భాగంగా బీసీ విద్యార్థులకు ఉచిత సివిల్స్ కోచింగ్ అందజేస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటార్ లక్ష్మయ్య మాట్లాడుతూ, బీసీ విద్యార్థులకు సివిల్స్‌కు మెరుగైన శిక్షణ అందజేస్తామ న్నారు. ప్రతి విద్యార్థిని వ్యక్తిగతంగా కలిసి, వారికి శిక్షణ అందజేస్తామ న్నారు. ఏపీ గెజిటెడ్ జేఏసీ చైర్మన్ కేవీ కృష్ణయ్య మాట్లాడుతూ తమ ఉద్యోగ సంఘ తరఫున పలువురు విద్యార్థులకు పీ4 విధానంలో సివిల్స్ కోచింగ్ అందజేస్తామని తెలిపారు. అంతకుముందు మంత్రి సవిత సమ క్షంలో ఒప్పంద పత్రాలపై బీసీ సంక్షేమ శాఖ అధికారులు, డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ప్రతినిదులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నవ శకానికి నాంది ‘పట్టిసీమ’ విజయగాథ!

పట్టిసీమ నిర్మాణం ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల చరిత్రలో ఒక మైలురాయి. కాలంతో పోటీపడి సాధించిన జల విజయం కూడా. ప్రకృతి సవాలును మానవ సంకల్పం జయించిన అద్భుత ఘట్టమే పట్టిసీమ. భారత నదుల అనుసంధాన చరిత్రలో లిఖించబడిన అపూర్వ విజయ గాథ. తెలుగు నేలపై రెండు మహా నదులు. ఒకటి ఉప్పొంగి ప్రవహించే గోదావరి, రెండవది తరచూ నీరు రాక ఎడారిగా మారుతున్న కృష్ణమ్మ, ఈ రెండు నదుల కలయిక దశాబ్దాలుగా ఊరించిన కల. ఆ కలను సాకారం చేస్తూ, గోదావరి వరద జలాలను కృష్ణా నదికి విజయవంతంగా తరలించిన తొలి అనుసంధాన పథకమే పట్టిసీమ. కరువు ప్రాంతాలకు జీవకళను తెచ్చి, వ్యవసాయ రంగాన్ని నిలబెట్టిన ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల చరిత్రలోనే ఒక ఐకానిక్ విజయ గాథగా నిలిచిందని చెప్పాలి. వృథాగా పోయే గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించి కృష్ణా డెల్టాను కాపాడటమే కాకుండా, శ్రీశైలం నీటిని రాయలసీమ సాగు, తాగు నీటి అవసరాలు తీర్చడానికి చేపట్టిన విప్లవాత్మక ప్రాజెక్టు ఇది. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ, భారత నదుల అనుసంధానానికి తొలి నీటి చుక్కగా నిలిచిన పట్టిసీమ విజయ ప్రస్థానం మహాద్భుతం. గోదావరి వరద జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడం ద్వారా డెల్టా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలనే ఆలోచన దశాబ్దాలుగా ఉన్నప్పటికీ, అది కార్యరూపం దాల్చడానికి పట్టిసీమ శ్రీకారం చుట్టింది. సాధారణంగా భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం దశాబ్దాల తరబడి సాగుతుంది. కానీ పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని కేవలం 173 రోజులలో పూర్తి చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించడం ఒక సంచలనం. పశ్చిమ గోదావరి జిల్లాలోని పట్టిసీమ వద్ద గోదావరి నదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టులో 24 భారీ పంపింగ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం గోదావరిలో వృథాగా సముద్రంలో కలిసే నీటి నుంచి సుమారు 80 టి.ఎమ్.సి ల నీటిని పోలవరం కుడి కాలువ గుండా ప్రకాశం బ్యారేజీకి తరలించేలా రూపొందించారు.పట్టీసీమ ప్రాజెక్టు ద్వారా సాధించిన ప్రయోజనాలు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగాన్ని ఊహించని మలుపు తిప్పాయి

ప్రకృతి కన్నెర్ర చేసినప్పుడు సాంకేతికతను ఆయుధంగా, దూరదృష్టిని మార్గదర్శిగా చేసుకుంటే ఎండిపోయే పొలాల్లోనూ పచ్చదనాన్ని పరిమళింప జేయవచ్చని, సంపద సృష్టించ వచ్చని నిరూపించిన ప్రాజెక్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం. 2015-16లో రూ 1600 కోట్లతో ప్రారంభమైన ఈ పథకం ద్వారా గోదావరి జలాలను పోలవరం కుడి ప్రధాన కాలువలోకి ఎత్తిపోసి, అక్కడి నుంచి కృష్ణా నదికి తరలిస్తున్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు సుమారు 500 టీఎంసీల నీటిని తరలించి.13 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు స్థిరీకరణకు దోహదపడిందని ప్రభుత్వం వెల్లడించింది. ఒక ప్రాంతంలో వరదలు, మరో ప్రాంతంలో కరువు వచ్చినప్పుడు నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలనే ఆలోచన సహజంగానే



ముందుకొస్తుంది. కానీ ఆ ఆలోచనను ఆచరణలోకి తీసుకురావడం అంత సులభం కాదు. సాంకేతిక సమస్యలు, భారీ వ్యయం, భూసేకరణ, పర్యావరణ అంశాలు, పరిపాలనా సమన్వయం, ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు కృష్ణా డెల్టాకు తరలించిన సుమారు 500 టి.ఎమ్.సి ల గోదావరి నీటితో ప్రతి ఏడాది సరాసరి 13 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ఈ నీటి ద్వారా డెల్టాలో పండుతున్న ధాన్యం, ఇతర వాణిజ్య పంటల విలువ అంచనా వేస్తే అద్భుతమైన గణాంకాలు కనిపిస్తున్నాయి. వార్షిక సాగు విస్తీర్ణం దాదాపు 13 లక్షల ఎకరాల్లో రెండు పంటలకు ఖరీఫ్-రబీ పంటలు సాగవుతున్నాయి. ధాన్యం దిగుబడి ఎకరానికి సగటున 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి చొప్పున, ఏటా లక్షలాది టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతోంది. పంట విలువ ప్రతి ఏటా సగటున కృష్ణా డెల్టా పరిధిలో పట్టిసీమ నీటి భద్రత వల్ల రూ.10,000 కోట్ల నుండి రూ. 12,000 కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు ప్రధానంగా వరి, అపరాలు, కూరగాయలు, ఉద్యాన పంటలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. ప్రాజెక్టు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 11 సంవత్సరాల కాలంలో పట్టిసీమ ద్వారా రక్షించబడిన, అదనంగా పండిన పంటల మొత్తం విలువ సుమారు రూ. 90,000 కోట్ల నుండి రూ.1,00,000 కోట్ల వరకు ఉంటుందని వ్యవసాయ ఆర్థిక నిపుణులు కూడా అంచనా వేస్తున్నారు.

ఈ ఏడాది ఎల్ నినో భూతాన్ని ఎదుర్కొని డెల్టాను కాపాడింది పట్టిసీమ. ఎల్ నినో ప్రభావంతో కృష్ణా పరీవాహక ప్రాంతంలోని శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల నుండి చుక్కనీరు కిందికి రాకపోయినా కృష్ణా డెల్టా రైతులను ఆదుకున్న ఏకైక సంజీవని పట్టిసీమ. కరువు ఛాయలు కమ్ముకున్న సమయంలో పట్టిసీమ లేకపోతే డెల్టాలో రైతులు పెట్టిన పెట్టుబడులు రూ. వేల కోట్లు పూర్తిగా నష్టపోయి ఉండేవారు. లక్షలాది మంది రైతులకు, కౌలు రైతులకు, కూలీలకు వ్యవసాయ రంగంలో నిరంతరం ఉపాధి లభించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూల కుండా నిలబడింది. కృష్ణా డెల్టాకు గోదావరి నీటిని మళ్లించడం వల్ల, శ్రీశైలం నీటిని రాయలసీమ ప్రాజెక్టులకు మళ్లించడానికి అవకాశం దక్కింది. దీనివల్ల రాయలసీమలోనూ వేల కోట్ల విలువైన ఉద్యాన, పంట దిగుబడులు సాధ్యమయ్యాయి. పట్టిసీమ ప్రాజెక్టు నిర్మాణం చెయ్యకపోయి ఉంటే, డెల్టా ప్రాంతం నేడు ఎడారిగా మారేదని నిపుణులు హెచ్చరించారు. ఆనాడు చంద్రబాబు పట్టుదలే పట్టిసీమకు పునాది అయింది. ఆ ప్రాజెక్టును తలపెట్టినప్పుడు ఎన్నో విమర్శలు, ఎంతో వ్యతిరేకత ఎదురైంది. గోదావరి నీటిని కృష్ణాలోకి మళ్లించడం సాధ్యం కాదని, అది అసాధ్యమన్నారు. అయినా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు అచంచలమైన పట్టుదలతో పట్టిసీమను నిర్మించారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, రైతు ప్రయోజనాలే పరమావధిగా ఆయన ఈ ప్రాజెక్టును చేపట్టారు. కొన్ని నెలల రికార్డు సమయంలో ప్రాజెక్టును పూర్తి చేయడం చంద్రబాబు పట్టుదలకు నిదర్శనం. దూరదృష్టితో రాష్ట్రంలోని రెండు ప్రధాన నదుల అనుసంధానానికి ఆయనే తొలి అడుగు వేశారు. నీరు లేని చోట అభివృద్ధి లేదనే నినాదంతో పనిచేసిన చంద్రబాబు మహోన్నత ఆశయానికి పట్టిసీమ ఒక మైలురాయి. గోదావరి-కృష్ణా అనుసంధానాన్ని ఆచరణలో చూపి రైతులను ఆదుకున్న పట్టిసీమ ప్రాజెక్టు.. రైతాంగం కలకాలం చెప్పుకునే గొప్ప ప్రాజెక్ట్. కృష్ణమ్మ ఒడిలో గోదావరి వరద ఉరక లెత్తుతుందని, కరువు కోరల్లో చిక్కుకొన్న కృష్ణా డెల్టాలో పట్టిసీమ విరగ పండిస్తుందని ఎవరూ వూహించ లేదు. ఏళ్ల తరబడి సాగుకు దూరమైన రాయలసీమ పొలాల్లో పట్టిసీమ సిరులు పండిస్తుందని, కరువు కరాళ నృత్యం చేసే రాయలసీమ బీడు భూముల్లో కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతుందని ఎవరూ వూహించ లేదు. పట్టిసీమ నిర్మాణం చేసి బహుళ ప్రయోజనాత్మక సన్నివేశాన్ని ఆవిష్కరించిన ఘనత అప్పటి సీఎం చంద్రబాబుదే అని చెప్పాలి. పట్టిసీమ ప్రాజెక్టు.. ప్రభుత్వానికి తక్కువ ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ, రాష్ట్రానికి మాత్రం లక్ష కోట్ల రూపాయల మేర స్థిరమైన వ్యవసాయ ఆర్థిక భద్రతను చేకూర్చింది. అందుకే ‘పట్టిసీమ’ కాదు, అన్నదాతల కన్నీళ్లు తుడిచి, సిరులు కురిపిస్తున్న పంట సీమ అని చెప్పాలి.

**- నీరుకొండ ప్రసాద్**

# సీతన్నపేట అభివృద్ధికి మంత్రి అచ్చెన్నాయుడు పెద్దపీట

**●రూ.1.50 కోట్లతో రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం.. ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం**

**●సీతన్నపేట గ్రామ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు, శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి హామీ**



కోటబొమ్మాళి (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు మెరుగైన వసతులు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కోటబొమ్మాళి మండలం సీతన్నపేట గ్రామంలో సోమవారం రూ. 1.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు అభివృద్ధి పనులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ప్రజల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.

**ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం**

గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి వెల్లడించారు. సుమారు రూ. 644 కోట్ల వ్యయంతో తాగునీటి పథకానికి మంజూరు లభించిందని, టెండర్ ప్రక్రియ పూర్తయి అగ్రిమెంట్ కూడా పూర్తయిందని తెలిపారు. పనులను వెంటనే ప్రారంభించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామానికి ప్రత్యేక నీటి ట్యాంకును నిర్మించి, అక్కడి నుంచి ప్రతి ఇంటికీ పైపుల ద్వారా తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. వేసవిలో బోర్లు ఎండిపోవడం, నీటి కొరత ఏర్పడటం వంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

**తాత్కాలికంగా కూడా నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు**

శాశ్వత తాగునీటి పథకం పూర్తయ్యే వరకు గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడతానని మంత్రి తెలిపారు. తాగునీటి సమస్యపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, ప్రతి కుటుంబానికి మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# గ్రామాల అభివృద్ధే నా ప్రధాన బాధ్యత : ఎమ్మెల్యే బోనెల



బలిజిపేట (చైతన్యరథం): బలిజిపేట మండలం గంగాడ గ్రామంలో పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ. 80లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే తన ప్రధాన బాధ్యతని స్పష్టం చేశారు. ఇంటింటికీ కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ. 52 కోట్లు నిధులు తీసుకువచ్చామని, త్వరలోనే ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్సీ కాలనీలు, గంగాడ, గలావల్లి, వంతరం, నారంనాయడువలస వంటి గ్రామాల్లోని సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరిస్తానని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం తరపున తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బి. రామ్మోహన్ రావు, నాయకులు గంట గౌరిశంకరరావు, రాధాకృష్ణ, గౌరునాయుడు, రఘు, రాంబాబు, రాజశేఖర్, అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన



కొత్తూరు (చైతన్యరథం): మండలంలోని వసప గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం తితిదే శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 40 లక్షలు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఆలయ నిర్మాణానికి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వామివారి ఆలయ నిర్మాణం భక్తుల ఆధ్యాత్మిక ఆకాంక్షలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఆలయ నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం మరింత పెంపొందుతుందని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరు చేసిన శ్రీవాణి ట్రస్టు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం గ్రామస్థులు, భక్తుల మధ్య ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రామాలయానికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శంకుస్థాపన



సాలూరు (చైతన్యరథం): మండలం అన్నంరాజువలస పంచాయితీ పసుపువానివలస గ్రామంలో రామమందిరం శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. రూ. 20 లక్షల దేవాదాయ శాఖ నిధులతో రామమందిరం నిర్మాణానికి పనులు పనులను ఆమె సోమవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ... గ్రామ చరిత్రలో ఈరోజు మర్చిపోలేని రోజు అని, ఎన్నో ఏళ్లుగా మనం కన్న మన గ్రామంలో రామ మందిర నిర్మాణం... నేడు శంకుస్థాపన చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. రాముడు లేని గ్రామం, గుడి లేని ఊరు ఉండదని, రాముడు అంటే మనకు దేవుడు మాత్రమే కాదు. గ్రామాన్ని ఒక్కటిగా కలిపే శక్తి అని మంత్రి వెల్లడించారు. ఈ రోజు మనం వేసే మొదటి ఇటుక కేవలం ఇటుక కాదని, అది మన ఐక్యతకు పునాది అని... ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుమ్మిడి సంధ్యారాణి కోరారు.

# భవిష్యత్తు అవసరాలు దృష్టిలో ఉంచుకుని విశాఖ మెట్రో ప్రాజెక్టు : ఎంపీ శ్రీ భరత్

విశాఖపట్నం (చైతన్యరథం): మెట్రో రైలు ప్రాజెక్ట్‌పై ఎంపీ భరత్ క్లారిటీ ఇచ్చారు. విశాఖ మెట్రో అంశంపై చాలామందిలో రకరకాల సందేహాలు ఉన్నాయి. ముఖ్యంగా విశాఖ సిటీ మెట్రో రైలు ప్రాజెక్ట్ ఎందుకు ఆలస్యమవుతోంది? అనే ప్రశ్నకు ఎంపీ భరత్ స్పష్టమైన వివరణ ఇచ్చారు. అంతకంటే ముందుగా మెట్రో ప్రాజెక్ట్‌ను మేము ఎక్కడా మేనిఫెస్టో అంశంగా అనౌన్స్ చేయలేదని చెప్పారు. అయితే మెట్రో ప్రాజెక్ట్‌పై చేయాలనే దృక్పథంతోనే ఉన్నామని వెల్లడించారు. అలాగే విశాఖలోని మెట్రో డిజైన్లలో ఎదురవుతున్న సాంకేతిక సవాళ్లు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకుంటున్న జాగ్రత్తల వల్లే ప్రాజెక్టు లేట్ అవుతుందని ఆయన వెల్లడించారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని బేగంపేటలో గతంలో జరిగిన తప్పు విశాఖలో రిపీట్ కాకూడదనే ఉద్దేశంతోనే సమగ్రమైన ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు.

**విశాఖలో 12 ట్రాఫిక్ జంక్షన్ల సవాల్...**

ఎంపీ భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్రో మార్గాన్ని పాత జాతీయ రహదారిపై ప్రతిపాదించారు. అయితే ఈ రోడ్డులోనే కంచరపాలెం, తాటిచెట్లపాలెం, గురుద్వారా, కార్ షెడ్ జంక్షన్, హనుమంతవాక వంటి 12 ప్రధాన జంక్షన్లు ఉన్నాయని, ఇక్కడ తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి ఫ్లైఓవర్లు అవసరమని ఎంపీ భరత్ చెప్పారు. కానీ అదే రహదారిపై మెట్రో, ఫ్లై ఓవర్లు కూడా నిర్మించాల్సి ఉంటుందని వివరించారు. ఆ రెండింటినీ పక్కపక్కనే కట్టేంత వెడల్పు ఆ రహదారికి లేకపోవడంతో ఇప్పుడు మెట్రో నిర్మిస్తే భవిష్యత్తులో ఫ్లై ఓవర్లు కట్టడం అసాధ్యమని, అలాగని ఫ్లై ఓవర్లు కట్టేస్తే మెట్రో నిర్మాణం శాశ్వతంగా ఆగిపోతుందని తెలియజేశారు.

**సీఎం చంద్రబాబు గైడెన్స్... డబుల్ డెక్కర్ మోడల్...**

ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లగా.. విడివిడిగా 12 చిన్న ఫ్లై ఓవర్లు కట్టే బదులు హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వే తరహాలో ఒకే ఎలివేటెడ్ కారిడార్ నిర్మిద్దామని ఆయనతో అన్నానని భరత్ తెలిపారు. కానీ దీనిపై స్టడీ చేసిన తర్వాత ఒక చోట 12 కిలోమీటర్లు, మరో చోట 8 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించవచ్చని తెలిసిందన్నారు. ఈ సందర్భంలో హైదరాబాద్‌లోని బేగంపేట సికింద్రాబాద్ మార్గంలో జరిగిన ప్లానింగ్ పొరపాట్లను గుర్తు చేసుకున్న చంద్రబాబు.. విశాఖలో అటువంటి తప్పు చేయకూడదని అన్నారని, దీంతో కింద ఎక్స్‌ప్రెస్ వే, దానిపైన 34 కిలోమీటర్ల మెట్రో నిర్మించే 'డబుల్ డెక్కర్' సమగ్ర డిజైన్ బెటర్ అనుకున్నామని భరత్ చెప్పారు.

# వైభవంగా సిరిమాను ఇరుసుమాను వృక్షాలు తరలింపు

**● ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అతిది గజపతిరాజు**



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం మండలం జొన్నవలసలో పైడితల్లి అమ్మవారి సిరిమాను ఇరుసుమాను వృక్షాలు హుకుంపేటకు తరలించే కార్యక్రమాన్ని సోమవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు ప్రారంభించారు. సిరిమాను చెట్టును గొడ్డలితో తాకి వారు పూజలు నిర్వహించారు. వందలాదిమంది భక్తులు ఈ వృక్షాలకు పూజలు నిర్వహించారు. విజయనగరం పైడితల్లి అమ్మవారి పండగకు లక్షలాది మంది భక్తులు వస్తారని వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు మంత్రి కొండపల్లి చెప్పారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించుకోవాలని ఆయన కోరారు. ఆలయ ఈవో శిరీష, పూజారి బంటుపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాస నాయుడు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పూజలు నిర్వహించారు.

# గ్రామాలు, పట్టణాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం

**● శృంగవరపుకోటలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం**



కొత్తవలస (చైతన్యరథం): గ్రామాలు, పట్టణాల సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా కొత్తవలస, శృంగవరపుకోట మండలాల్లో రూ. 71 లక్షల అంచనాతో చేపట్టనున్న సిమెంట్ రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే సోమవారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. కొత్తవలస మండలం మంగళపాలెంలో రూ. 10 లక్షలు, శృంగవరపుకోట పట్టణంలో కొత్త పుణ్యగిరి కాలనీ, చుక్క వీధిలో రూ. 61 లక్షలు అంచనాతో నిర్మించనున్న సిమెంట్ రహదారుల పనులను స్థానిక కూటమి నాయకులు, ప్రజలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా లలిత కుమారి మాట్లాడుతూ.. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల అవసరాలు, ఇబ్బందుల్ని పరిగణలోకి తీసుకుని సిమెంట్ రహదారులు, కాలువల నిర్మాణంతో పాటు తాగునీటి సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులను నిర్దేశించిన కాలవ్యవధిలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దాసరి కార్పొరేషన్ చైర్మన్ టీవీ రత్నాజీ పాల్గొన్నారు.

# రూ.100 కోట్ల పెట్టుబడితో కీలక ముందడుగు... ఫలించిన రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు కృషి

**●కాకినాడలో INCOIS ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు సీఐఐ ప్రాంతీయ సదస్సులో అవగాహన ఒప్పందం**



కాకినాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ సముద్ర రంగ అభివృద్ధికి, మత్స్యకారులకు మెరుగైన సమాచార సేవలు అందించేందుకు కాకినాడలో ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (INCOIS) ప్రాంతీయ కేంద్రం ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. కాకినాడలో నిర్వహించిన CII ప్రాంతీయ సదస్సులో ఈ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్టుకు దశలవారీగా రూ.100 కోట్ల పెట్టుబడి ప్రతిపాదించగా, 20 ప్రత్యక్ష ఉద్యోగాలు, 50 పరోక్ష ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉంది. ఈ కేంద్రం ఏర్పాటుకు రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తీరప్రాంత మత్స్యకారులకు సముద్ర పరిస్థితులు, చేపల వేటకు అనుకూలమైన ప్రాంతాలు, వాతావరణ సంబంధిత సమాచారాన్ని మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఆయన ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో 2026 జూలై 21న న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌ను కలిసి కాకినాడలో INCOIS/సముద్ర సమాచార సేవల కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఈ ప్రతిపాదనను పరిశీలించిన కేంద్ర భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 9న ఎంపీకి సమాచారం అందించింది. INCOIS రాష్ట్ర ప్రభుత్వాన్ని భూమి కేటాయింపు కోసం సంప్రదించగా, జిల్లా యంత్రాంగం అనువైన స్థలాన్ని గుర్తించినట్లు తెలిపింది.

**అనుబంధ సేవల రంగాల్లో అవకాశాలు**

ఈ ప్రాంతీయ కేంద్రం అందుబాటులోకి వస్తే సంభావ్య చేపల వేట ప్రాంతాల (Potential Fishing Zones) సూచనలు, సముద్ర పరిస్థితుల సమాచారం, ట్యూనా, హిల్సా చేపల వేటకు సంబంధించిన సేవలు, పగడపు దిబ్బలపై సముద్ర ఉష్ణోగ్రతల ప్రభావానికి సంబంధించిన హెచ్చరికలు, సముద్ర పరిశీలన డేటా వంటి సేవలు తీరప్రాంత ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ఉంది. దీంతో మత్స్యకారులు సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి, సముద్ర వనరులను మెరుగ్గా వినియోగించుకోవడానికి తోడ్పాటు లభించనుంది. కాకినాడ పోర్టు, విస్తారమైన సముద్ర తీరం, ఆక్వా రంగం, మత్స్య సంపదకు ఈ కేంద్రం మరింత ప్రాధాన్యత తీసుకురానుంది. సముద్ర సమాచార సేవలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, అనుబంధ సేవల రంగాల్లో అవకాశాలు విస్తరించే అవకాశం ఉంది. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పన లక్ష్యాలకు అనుగుణంగా కాకినాడను సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాలకు కీలక కేంద్రంగా అభివృద్ధి చేసే దిశలో ఈ ఒప్పందం ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలవనుంది.

# రూ.80 లక్షలతో ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి

**●2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఆలయ అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరంలోని అత్యంత విశిష్టమైన, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం కలిగిన ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో రూ. 80 లక్షల దేవాదాయ శాఖ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయం నగర ప్రజలకే కాకుండా గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు కూడా ఎంతో ప్రాధాన్యత కలిగిన పుణ్యక్షేత్రమన్నారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, అందులో భాగంగానే ఈ రోజు పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఆలయంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అదనపు నిధులు అవసరమని, ఈ విషయమై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని సంప్రదించి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, అదనపు నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. త్వరలోనే అధికారులు ఆలయాన్ని సందర్శించి అవసరాలను పరిశీలించి, అదనపు నిధుల మంజూరుకు చర్యలు చేపడతారని చెప్పారు. కూటమి ప్రభుత్వం సనాతన ధర్మ పరిరక్షణకు, దేవాలయాల పవిత్రత, ప్రాశస్త్యాన్ని కాపాడేందుకు ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, ప్రతి ఆలయానికి తగిన గుర్తింపు, గౌరవం కల్పించేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొయ్యల రమణ, డైరెక్టర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# బెజవాడ దుర్గమ్మ దర్శనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**●అక్టోబర్ 14, 15 తేదిల్లో విజయవాడలో పర్యటన**



విజయవాడ (చైతన్యరథం): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పాటు ఏపీలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా అక్టోబర్ 14న ఆమె రాష్ట్రానికి రానున్నారు. విజయవాడ కేంద్రంగా సాగే ఈ పర్యటనలో ఆమె ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకుంటారు. అలాగే మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచే 'సరస్ మేళా'లో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కాగా, విజయవాడలో ఈసారి దసరా ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూలేనంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ ఉత్సవాలకు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించిన సంగతి తెలిసిందే.

**14న దుర్గమ్మ దర్శనం.. 15న లఖ్‌పతి దీదీలతో మీట్...**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అక్టోబర్ 14వ తేదీ సాయంత్రం 6:25 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆమె ఇంద్రకీలాద్రికి చేరుకుని.. రాత్రి 7:20 గంటలకు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇక రెండో రోజు అంటే 15వ తేదీన పున్నమి ఘాట్‌లో నిర్వహించే జాతీయ స్థాయి సరస్ మేళా కార్యక్రమానికి ఆమె హాజరవుతారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్వావలంబన సాధించిన 'లఖ్‌పతి దీదీ'లతో ప్రత్యేక విందు కార్యక్రమంలో పాల్గొని వారితో ముచ్చటిస్తారు. పర్యటన ముగిసిన తర్వాత 15వ తేదీ మధ్యాహ్నం గన్నవరం నుంచి రాష్ట్రపతి తిరిగి ఢిల్లీకి బయలుదేరతారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజిట్ నేపథ్యంలో పోలీసులు, అధికారులు విజయవాడలో ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. సెక్యూరిటీ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపులు, ప్రోటో కాల్ ఏర్పాట్లను అధికారులు పక్కాగా చేపట్టారు. ఎలాంటి లోపాలకు తావు లేకుండా అన్ని విభాగాల సమన్వయంతో పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ఇప్పటికే అందరికీ ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

**విజయవాడ ఉత్సవ్.. ప్రముఖుల రాక..**

ఈ ఏడాది దసరా సందర్భంగా విజయవాడలో ఉత్సవాలు అంబరాన్ని తాకనున్నాయి. ఇప్పటికే పున్నమి ఘాట్‌లో విజయవాడ ఉత్సవ్ సీజన్-2 ప్రారంభమైంది. కేంద్ర మంత్రి రామ్మోహన్, అనిత, కేశినేని చిన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ ఉత్సవాలకు పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు కూడా హాజరుకానున్నారు.

# అక్టోబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం



అమరావతి (చైతన్యరథం): తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం వేగంగా మారుతోంది. ఒకవైపు నైరుతి రుతుపవనాల నిష్క్రమణ చివరి దశకు చేరుకోగా, మరోవైపు ఆగ్నేయ బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాగల మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలతో పాటు గంటకు 50 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశముంది. దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో అక్టోబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, యానాం ప్రాంతాలపై దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాల ఉపసంహరణ చురుగ్గా సాగుతుండగా, రాబోయే 2-3 రోజుల్లో దక్షిణ ద్వీపకల్పంలో ఈశాన్య రుతుపవనాల వర్షాలు మొదలయ్యేందుకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, యానాంలలో రాబోయే మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడవచ్చు. ఎల్లుండి రాయలసీమలోని కొన్ని చోట్ల, కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. రాగల మూడు రోజుల పాటు తీరం వెంబడి గంటకు 30 నుంచి 40 కిలోమీటర్లు, గరిష్టంగా 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు పూర్తిగా పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు మరింతగా ఉపసంహరించుకున్నాయని, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పొడి గాలుల ప్రభావం కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

విశాఖపట్నం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించే అంశంపై కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని టీడీపీ నాయకులు విమర్శించారు. సోమవారం విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని టైకూన్ హోటల్‌లో బీసీ నాయకులతో కలిసి నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ సీతంరాజు సుధాకర్ నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం, 34% రిజర్వేషన్ల అమలు, బీసీ వర్గాల అభివృద్ధి, రాజకీయంగా బీసీలకు మరిన్ని అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై నాయకులు చర్చించారు.

# ఎమ్మెల్యే యార్లగడ్డ చొరవతో దావాజీగూడెం రోడ్డు అభివృద్ధి



గన్నవరం (చైతన్యరథం): గన్నవరం నియోజకవర్గం గన్నవరం టౌన్ నందు దావాజీగూడెం రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే, ఏపీ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. ఇప్పటికే వివిధ మార్గాల్లో నిధులు సమకూర్చి రహదారి, మురుగునీటి కాలువల నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా పీ-4 కార్యక్రమం కింద 'మార్గదర్శి - గన్నవరం సెయింట్ ఆన్స్ పాఠశాల వారి సహకారంతో రూ.7 లక్షల వ్యయంతో చేపట్టనున్న మురుగునీటి కాలువ నిర్మాణ పనులను నేడు ప్రారంభించారు. దావాజీగూడెం రహదారి అభివృద్ధి కోసం కలెక్టర్ ద్వారా రూ.1.50 కోట్ల నిధులు సమకూర్చగా, మురుగునీటి కాలువల నిర్మాణానికి మండల పరిషత్ నిధుల నుంచి రూ.40 లక్షలు కేటాయించారు. అదేవిధంగా రహదారికి ఎడమవైపున భవన యజమానుల సహకారంతో రూ.7 లక్షల వ్యయంతో చేపట్టిన మురుగునీటి కాలువ నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు కల్పించడంతోపాటు మురుగునీటి సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా వివిధ వర్గాల సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో దావాజీగూడెం రహదారి అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరుతుండటంతో స్థానికులకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.

## ప్రజల చిరకాల త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే బూర్ల



ప్రత్తిపాడు (చైతన్యరథం): ప్రత్తిపాడు నియోజవర్గంలోని 83 గ్రామాలు ప్రజల చిరకాల త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా జలజీవన్ మిషన్ 2.0 అమరజీవి జలధార పథకం కింద 33.67 కోట్ల అంచనా వ్యయంతో మంజూరైన తాగునీటి సదుపాయాల పనులు ప్రత్తిపాడు మండల కేంద్రంలో ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు – ప్రతి గ్రామానికి మెరుగైన నీటి సరఫరా ఇదే లక్ష్యం! అని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని వట్టిచెరుకూరు, కాకుమాను, పెదనందిపాడు, ప్రత్తిపాడు, గుంటూరు రూరల్ మండలాల్లో మొత్తం రూ.33.67 కోట్ల అంచనా వ్యయంతో 122 పనులు చేపట్టారు. ప్రతి ఇంటికీ ఫంక్షనల్ ట్యాప్ కనెక్షన్ అందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి మౌలిక వసతులను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పనులను నాణ్యతతో మరియు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే సంకల్పంతో ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధి పదంలో ముందుకు సాగుతోంది అని అన్నారు.

## రూ.3.50 కోట్లతో అభివృద్ధి పనులకు చీఫ్ విప్ జీవీ శంకుస్థాపన



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ పట్టణంలోని మీరా స్థలం వద్ద రూ. 3.50 కోట్ల HAM (హ్యామ్) నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు, సెంట్రల్ డివైడర్ మరియు సెంట్రల్ లైటింగ్ పనులకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. జీవీ మాట్లాడుతూ... పట్టణ మౌలిక వసతుల కల్పన, సుందరీకరణతో పాటు రాత్రివేళల్లో వాహనదారుల భద్రత కోసం ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని అధికారులను మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు.నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నిలపడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## సంక్షేమాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే బొండా

**●విజయవాడ సెంట్రల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం**



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 64వ, డివిజన్ కండ్రిక పంప్ హౌస్ వద్ద పలగాని బాబూరావు పార్కు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అండగా నిలుస్తూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. గతంలో రూ.2,000గా ఉన్న సామాజిక పింఛన్‌ను రూ.4,000కు పెంచడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృఢ సంకల్పానికి నిదర్శనమని అన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, అర్హులైన లబ్ధిదారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన తల్లులకు వారి పిల్లల విద్య కోసం ఆర్థిక సహాయం అందిస్తున్నామని, స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు.

**సమస్యల లేని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం**

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో సుమారు రూ.700 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు బోండా ఉమా వెల్లడించారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, పాఠశాలలు, ఆసుపత్రులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలోని పార్కులను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే లక్ష్యమని బోండా ఉమా తెలిపారు.

## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి.. రైతులు పండించిన ప్రతి పంట ఇంటికి చేరాలి

**●కనకదుర్గమ్మను దర్శించుకుని రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు**



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ రైతులు సాగు చేసిన ప్రతి పంట చేతికొచ్చి వారి ఇళ్లలో సిరులు కురవాలని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు కనకదుర్గమ్మను ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రైతాంగం అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్న నేపథ్యంలో సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, పాలకమండలి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దేవినేని ఉమ కోరారు. ఉచిత దర్శనానికి వచ్చే భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యూలైన్లలో తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచడంతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. దసరా శరన్నవ రాత్రుల సందర్భంగా తొలి రోజు సామాన్య భక్తులతో కలిసి ఉచిత దర్శన క్యూలైన్లో సుమారు నాలుగున్నర గంటల పాటు వేచి ఉండి దేవినేని ఉమామహేశ్వరరావు కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. గత 22 సంవత్సరాలుగా కాలినడకన భక్తులతో కలిసి అమ్మవారి దర్శనానికి రావడం తనకు ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడంతో పాటు, వాటి పరిష్కారానికి అధికారులు స్పందించాలని కోరారు. భక్తులు, మీడియా మిత్రులు ఏర్పాట్లకు సంబంధించి అధికారుల దృష్టికి తీసుకువచ్చే సమస్యలను పాలకమండలి తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని దేవినేని ఉమ సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, దర్శనం సులభతరం చేయడం, తాగునీరు వంటి అవసరాలను సమయానికి అందించడం ద్వారా అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రతి ఒక్కరికీ సంతృప్తికరమైన అనుభూతి కల్పించాలని పేర్కొన్నారు.

## పల్లె ప్రగతికి మరో అడుగు.. జూపూడిలో రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు

**●మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**



ఇబ్రహీంపట్నం (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పల్లెల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలో వీబీజీ రాంజీ నిధులు, పల్లెపండుగ 3.0 కింద రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు సోమవారం ఉదయం ఎమ్మెల్యే కృష్ణప్రసాదు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ... గ్రామీణ ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో రవాణా సదుపాయాలు మెరుగుపడితే ప్రజల రోజువారీ ప్రయాణాలు సులభతరం కావడంతో పాటు, స్థానిక ప్రాంతాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ఈ దిశగా పల్లెపండుగ 3.0 కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వివిధ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి ద్వారా ప్రజలకు మెరుగైన జీవన సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రహదారి నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయం

**●బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు**



బాపట్ల (చైతన్యరథం): మండల పరిధిలోని తూర్పు పిన్నిబోయినవారిపాలెం గ్రామంలో సుమారు రూ.32 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు మరింత సులభంగా, పారదర్శకంగా మరియు వేగంగా అందేలా ఆధునిక వసతులతో ఈ భవనాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు తమ పనుల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోనే అన్ని పాలనా సేవలు పొందేందుకు పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం నూతన భవనంలోని కార్యాలయ గదులు, రికార్డుల గది తదితర విభాగాలను ఎమ్మెల్యే పరిశీలించి, అధికారులకు, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే తంగిరాల



నందిగామ (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవపురం గ్రామంలో శాశ్వత కేంద్రీయ విశ్వవిద్యాలయ భవనం నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఏపీ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలని, నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# మాట నిలబెట్టుకున్న మంత్రి డాక్టర్ నారాయణ



నెల్లూరు (చైతన్యరథం): ఇచ్చిన మాటను తూచా తప్పకుండా పాటిస్తూ, పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న మంత్రి నారాయణ నెల్లూరు నగరంలో ట్రాన్స్ జెండర్ల సంక్షేమం కోసం మరో చారిత్రక అడుగు వేసి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఆగస్టు 1వ తేదీన 4వ డివిజన్లో మంత్రి నారాయణ పర్యటించి పెన్షన్లు పంపిణీ చేస్తున్న సమయంలో, ట్రాన్స్ జెండర్లు తమకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని ఆయనను కోరారు. వెంటనే స్పందించిన మంత్రి, తహశీల్దార్ జేసీలను అలాగే కమిషనర్‌ను అప్రమత్తం చేసి వారికి తక్షణమే పట్టాలు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు వెంటనే ఏర్పాట్లు చేయగా, 19 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగరవ్యాప్తంగా ట్రాన్స్ జెండర్లు మొత్తం ఎంతమంది ఉన్నారని మంత్రి నారాయణ ఆరా తీయగా 140 మంది ఉన్నారని తెలిపారు. స్పందించిన ఆయన, నగరవ్యాప్తంగా ఉన్న ఆ 140 మంది ట్రాన్స్ జెండర్లందరికీ త్వరలోనే ఇళ్ల పట్టాలు అందజేస్తామని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా, ఇళ్లు కట్టుకునే ప్రతి ఒక్కరికీ తన సొంత, పిల్లల నిధుల నుంచి 50,000 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ పట్టాలు అందుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా 2.5 లక్షల సాయం కూడా త్వరలోనే అందేలా చూస్తామన్నారు. గతంలో కర్నూలులో ఉన్నప్పుడే ట్రాన్స్ జెండర్ల పెన్షన్ల కోసం జీవో తెచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, ట్రాన్స్ జెండర్లు సహా అందరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తమ సమస్యను సత్వరమే పరిష్కరించి ఇళ్ల పట్టాలు అందించినందుకు ట్రాన్స్ జెండర్లు అందరూ మంత్రి నారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ జై నారాయణ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ నగర తాసిల్దార్, మాజీ కార్పొరేటర్ సంక్రాంతి కళ్యాణ్, నగర అధ్యక్షుడు మామిడాల మధు, శైలజ, నారాయణ రెడ్డి, స్థానిక టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం కావాలి

## కూటమి శ్రేణులకు ఎమ్మెల్యే కందుల పిలుపు

మార్కాపురం (చైతన్యరథం): ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో మార్కాపురం పట్టణ కార్యకర్తల సమావేశం విస్తృత స్థాయి జరిగింది. ఈ సందర్భంగా వచ్చే మునిసిపల్ ఎన్నికల గురించి ముఖ్యంగా చర్చించారు. ఈ సందర్భంగా శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో మార్కాపురం పట్టణంలో ప్రతి కూటమి అభ్యర్థి విజయం సాధించాలని దానికోసం ఇప్పటినుండి కసరత్తు ఆరంభించాలని కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు.

# త్వరలో అగ్రిగోల్డ్ బాధితులకు ఉపశమనం

నెల్లూరు (చైతన్యరథం): జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ లో డబ్బులు కట్టి నష్ట పోయిన బాధితులు అందరికీ తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత న్యాయం చేస్తామని తెలుగుదేశం పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. ఇందులోభాగంగా ఎటువంటి వివాదాలు లేని అగ్రిగోల్డ్ కు సంబంధించిన 6330 ఎకరాల భూమి సిఐడి వారి స్వాధీనంలో ఉందన్నారు. ఎటువంటి వివాదాలు లేని అగ్రిగోల్డ్ భూములను విక్రయించి దాని ద్వారా వచ్చే మొత్తం అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లించాలని ముఖ్యమంత్రిఆదేశాలు ఇచ్చారు.అగ్రిగోల్డ్ బాధితుల బాండ్లను జిల్లాల వారీగా పరిశీలించి అర్హుల జాబితా తయారు చేయమని సిఐడి ని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. దీనిలో భాగంగా సిఐడి ఆధ్వర్యంలో ఈనెల 9 వ తేదీ నుండి అన్ని జిల్లా కేంద్రాలలో, బాండ్ల పరిశీలన కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. నెల్లూరు పోలీస్ గ్రౌండ్‌లోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో, ఉమ్మడి నెల్లూరు జిల్లా అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈనెల 14 వ తేదీ నుండి కోవూరు నియోజకవర్గానికి చెందిన వారి బాండ్లు పరిశీలన జరుగుతుందన్నారు. ఈనెల 14న కోవూరు మండలం,15 న బుచ్చిరెడ్డి పాలెం, 16 న ఇందుకూరుపేట,17 న విడవలూరు, కొడవలూరు కు చెందిన వారి బాండ్లు పరిశీలిస్తారు. అగ్రిగోల్డ్ బాధితుల తమ బాండ్లను ను తీసుకొచ్చి, నెల్లూరు లోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో సిఐడి అధికారులు వద్ద పరిశీలన చేయించుకొని, నమోదు చేయించుకోవాలన్నారు. ఈ బాండ్ల పరిశీలన కార్యక్రమం




నవంబర్ 17 వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. ఏ తేదీన ఏ మండలం వారు వారు రావాలో అధికారులు ముందుగానే షెడ్యూలు ఇచ్చి ఉన్నారని తెలిపారు. ఆ షెడ్యూలు ప్రకారం బాధితులు వచ్చి తమ బాండ్లు పరిశీలన చేయించుకోవాలి. అగ్రిగోల్డ్ బాధితుల తమ దగ్గర ఉన్న ఒరిజినల్ బాండ్,సెల్ఫ్ అటెస్ట్ చేసిన ఒరిజినల్ బాండ్ కలర్ ఓవతీశిఃఇ కాపీ,గుర్తింపు కార్డు,బ్యాంకు అకౌంట్ వివరాలు,పాస్ పోర్ట్ సైజ్ ఫోటో తీసుకుపోవాలన్నారు. అదేవిధంగా డిపాజిట్ దారు మరణించి ఉంటే మరణ ధృవీకరణ పత్రం, నామినీ లేదా చట్టబద్ధమైన వారసులు గుర్తింపు పత్రం తీసుకొని పోవాలి. ఏజెంట్లు అయితే ఏజెంట్ కోడ్ గుర్తింపు పత్రాలు,బ్యాంక్ వివరాలు తీసుకెళ్ళాలి. అగ్రిగోల్డ్ లో డబ్బులు కట్టి ఆ డబ్బులు తిరిగి రాక గత 10 సంవత్సరాల గా ఇబ్బందులు పడుతున్న అగ్రిగోల్డ్ బాధితులకు కూటమి ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం వలన ఉపశమనం కలగబోతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియచేశారు.

# యర్రగొండపాలెంలోఘనంగా పల్లెపండుగ

## యర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి

యర్రగొండపాలెం (చైతన్యరథం): పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా దోర్నాల మండలం, మొట్ల మల్లికార్జునపురం రోడ్డు నుండి చిలక చర్ల చెంచుగూడెం వరకు 3 కోట్ల 50 లక్షలతో బీటీ రోడ్డు పనులకు యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ చార్జ్ గూడూరి బాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల అధ్యక్షులు షేక్ మహబూబ్ సాహెబ్, మండల సీనియర్ నాయకులు, వైచర్లోపల్లి, చిలక చర్ల చెంచుగూడెం గ్రామ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.





# మళ్లీ ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ పనులు

## శుభపరిణామమని దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి వెల్లడి

దర్శి (చైతన్యరథం): నియోజకవర్గానికి అభివృద్ధిలో ప్రధాన భూమికగా ఉన్న ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ పనులు తిరిగి సోమవారం సాయంత్రం డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్,ఆర్ అండ్‌బీ అధికారులు, స్థానిక నాయకులు ప్రారంభించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం 2014లో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ దర్శిలో ఏర్పాటు జరిగింది. దాదాపు 22 కోట్ల రూపాయలు ఆనాడు నిధులను కేటాయించారు. రెండు కోట్లకు పైగా పనులను కూడా పూర్తయ్యాయి. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పనులను నిలిచి పోయాయి. తిరిగి పనులు ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పలుమార్లు కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి పనులు ప్రారంభించేందుకు నిధులను మంజూరు చేశారు. తొలి విడత పనులను దాదాపు తొమ్మిది కోట్లతో చేపడుతున్నట్లు ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ ప్రకటించారు. రెండేళ్ల కూటమి పాలనలో అభివృద్ధి ఎజెండాగా దర్శి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెండా ఎగరాలని ఆమె పిలుపునిచ్చారు. దర్శి మున్సిపల్ ఎన్నికల్లో తిరిగి తెలుగుదేశం గెలుపు ఏకపక్షంగా జరగాలని ప్రజలందరూ అభివృద్ధి ప్రభుత్వాన్ని ఆదరించాలని, అభిమానించాలని కూటమి నేతలు ఐక్యంగా ముందుకు వెళ్లాలని జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి వైసిపి కుట్రలను తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు ఏకపక్షంగా ఉండాలని డాక్టర్ లక్ష్మీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, గోపి కృష్ణ, జీజు రఫీ, దర్శి టౌన్ మండల పార్టీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, మారెళ్ల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ నక్క రంగా – చంద్ర, వలిబాబు, జనసేన జిల్లా ఐ.టీ కోఆర్డినేటర్ ఉల్లి బ్రమ్మయ్య, నీటి సంఘం అధ్యక్షులు వెలగొండా రెడ్డి, ఫణిదపు వెంకట్రామయ్య, సానె సుబ్బయ్య, బత్తుల శ్రీనాథ్, బొంత శ్రీను నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు ఉన్నారు.



# తలుపుల టీడీపీలోకి వంద వైసీపీ కుటుంబాలు!

## కండువా కప్పి ఆహ్వానించిన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి (చైతన్యరథం): కదిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోందని, కూటమి ప్రభుత్వ పాలనపై విశ్వాసంతో అన్ని వర్గాల ప్రజలు టీడీపీతో కలిసి ముందుకు వస్తున్నారని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. కదిరి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తలుపుల మండలానికి చెందిన సుమారు 95 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. తలుపుల మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో, మండల కన్వీనర్ మేడ శంకర్ గారి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పార్టీ కండువాలు కప్పి కొత్తగా చేరిన వారిని సాదరంగా ఆహ్వానించారు. ఉడుములకుర్తి పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ వేంకటపతి నాయుడు, వైసీపీ జనరల్ సెక్రటరీ విష్ణు వర్ధన్ నాయుడుతో పాటు ఉడుములకుర్తి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రామచంద్ర, చంద్రమోహన్ నాయుడు, వెంకటయ్య నాయుడు, నారాయణస్వామి, మల్లికార్జున, యమయ్య, వీరభద్ర, ఉత్తప్ప, అనుదీప్, పూజ నాయుడు తదితరులు టీడీపీలో చేరారు. అలాగే బండ్లపల్లి పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు నరసింహారెడ్డి దంపతులు,అధిశేష్ రెడ్డి ఆనంద్, నాగరాజు, వెంకటరమణ, గంగులమ్మ, రమణ, రామంజులు, అశోక్, వెంకటనారాయణ, ఓబుళకృష్ణ, వంశీ, బన్నీ, వినోద్, కృష్ణ, అశోక్ తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. కదిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని, యువత, మహిళలు, మైనార్టీలు సహా అన్ని వర్గాల ప్రజలు టీడీపీ వైపు అడుగులు వేయడం సంతోషంగా ఉందని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని, తెలుగుదేశం పార్టీ కుటుంబంలో వారికి సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, సాంబశివ, గంగరాజు, శ్రీశైలం రమణ, బాబ్జాన్, సుదర్శన్ రెడ్డి, ఆంజనేయులు, మౌళిబాబు, రమణ, శ్రీనాథ్, గోపాల్ రెడ్డి, ఉమామహేష్ కుమార్, మునికుమార్,సూరి తదితర టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీ వేధింపులన్నీ భరించాం

## అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పూల నాగరాజు

అనంతపురం (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ నాయకులపై రాజకీయ కక్షతో అక్రమ కేసులు బనాయించారని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో తనపై నమోదు చేసిన కేసుల విచారణలో భాగంగా ఆయన రాయదుర్గం కోర్టుకు హాజరయ్యారు. పూల నాగరాజుతో పాటు కేసులో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో తెలుగుదేశం పార్టీ నాయకులను రాజకీయంగా ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశంతో కేసులు పెట్టినా, పార్టీ నాయకులు ఎవరూ భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడే నాయకులను కేసులతో అణిచివేయలేరని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు, ప్రజా సమస్యలపై పోరాటాలకు సమాధానం చెప్పాల్సింది ప్రజల మధ్యనేనని, కేసుల ద్వారా నాయకుల గొంతు నొక్కాలని ప్రయత్నించడం సరైన విధానం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. చట్టంపై తమకు పూర్తి గౌరవం ఉందని, న్యాయస్థానాలపై విశ్వాసంతో న్యాయపోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా ప్రజల కోసం, పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేయడంలో వెనక్కి తగ్గేది లేదు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ప్రజల్లో ఉంటూ ప్రజాసేవను కొనసాగిస్తారు అని పూల నాగరాజు స్పష్టం చేశారు.



# శ్రీశైలంలో దసరా మహోత్సవ శోభ



శ్రీశైలం (చైతన్యరథం): మహా క్షేత్రంలో దసరా మహోత్సవాల శోభతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. దేవి శరన్నవరాత్రులలో తొలిరోజు భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ప్రధానాలయంలోని యాగశాల ప్రవేశంతో శాస్త్రోక్తంగా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేశ్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఆదివారం ఉదయం పసుపు కుంకుమలు, ఫల పుష్పాలతో ప్రధాన గోపురం నుంచి సంప్రదాయానుసారం ఆలయ ప్రవేశం చేశారు. అమ్మవారి ఆలయ మండపంలో ప్రత్యేక పూజలు చేసుకుని స్వామిఅమ్మవార్ల ఉభయ యాగశాలల్లో ఆగమశాస్త్ర ప్రకారం లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ఉత్సవ మహాసంకల్పాన్ని పఠించి గణపతిపూజ చేశారు. అనంతరం కంకణపూజ కంకణధారణ, రుత్విగరణం, పుణ్యాహవాచనం, అఖండదీపస్థాపన, వాస్తుపూజ, హోమం, మండపారాధన, చండీ కళశస్థాపన, శ్రీచక్రార్చన, నవావరణార్చన, విశేష కుంకుమార్చనలు, శివసంకల్పం, రుద్ర కళశస్థాపన, సహస్ర చండీపారాయణ సహిత శత చండీ మహా రుద్రయాగం, చండీ రుద్ర హోమాలు, జప పారాయణలు, చతుర్వేద పారాయణలు, నవగ్రహ జపాలు, చండీ సప్తశతి పారాయణ, మహావిద్య పారాయణ, సూర్య నమస్కారాలను అర్చక వేదపండితులు జరిపించారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్టాపనలో భాగంగా విశేష హోమాలను నిర్వహించారు.



# రాయదుర్గం మండలాన్ని కరవు ప్రాంతంగా ప్రకటింప చేయండి

## సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి

రాయదుర్గం (చైతన్యరథం): మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మండలాన్ని కరవు మండలాల జాబితాలో చేర్చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వినతి పత్రం సమర్పించారు. రాయదుర్గం ప్రాంతంలో కొంతకాలంగా కరువు పరిస్థితులు కొనసాగుతున్నాయని, ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో ప్రభావంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారిందని పేర్కొన్నారు. వర్షాభావంతో పంటల సాగు విస్తీర్ణం తగ్గడంతో పాటు దిగుబడులు కూడా గణనీయంగా పడిపోయాయని తెలిపారు. రాయదుర్గం మండలంలో సాధారణ వర్షపాతం 242 మిల్లీమీటర్లు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 117.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదై 51.4 శాతం లోటుతో ఉందని తెలిపారు. దీంతో మండలాన్ని ఇప్పటికే 'లోటు వర్షపాతం' ప్రాంతంగా వర్గీకరించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మండలంలో సాధారణ ఖరీఫ్ సాగు విస్తీర్ణం 18,741 హెక్టార్లు కాగా, ప్రస్తుతం కేవలం 14,767 హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయని తెలిపారు. జిల్లా ఆర్థిక, గణాంక శాఖ నివేదిక ప్రకారం జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు సాధారణంగా 311.3 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 144.4 మి.మీ. మాత్రమే నమోదైందని, దీంతో 53 శాతం తీవ్ర వర్షాభావం నెలకొన్నట్లు వివరించారు. అలాగే ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 20 వరకు 21 రోజుల పాటు సంపూర్ణ వర్షాభావ పరిస్థితులు కొనసాగాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన పంట పరిశీలనల్లో ముఖ్యంగా కంది, వేరుశనగ, ఆముదం పంటల దిగుబడులు తీవ్రంగా తగ్గినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. సాధారణంగా రావాల్సిన దిగుబడిలో కేవలం 40 నుంచి 51 శాతం మాత్రమే లభించే పరిస్థితి ఉందని, ఇది ప్రభుత్వం నిర్దేశించిన 33 శాతం పంట నష్టం పరిమితిని మించిందని కాలవ తెలిపారు. పంటల ప్రస్తుత పరిస్థితిని బట్టి నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని వివరించారు. ఈ వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం తగ్గదల, పంటల దిగుబడులపై ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రాయదుర్గం మండలాన్ని కరువు మండలాల జాబితాలో చేర్చి రైతులకు అవసరమైన సహాయాన్ని అందించాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. రాయదుర్గం పట్టణంలో ముస్లిం మైనారిటీ వర్గాల కోసం సద్భావన భవన్ (కమ్యూనిటీ హాల్) నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేయాలని మరో వినతిలో ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విన్నవించారు. రాయదుర్గం పట్టణంలోని సర్వే నంబర్ 339లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ప్రభుత్వం మారడంతో ప్రతిపాదిత పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయితే ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వివాహాలు, ఇతర సామాజిక కార్యక్రమాలను తక్కువ ఖర్చుతో నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. సద్భావన భవన్‌తో పాటు ప్రహరీ గోడ నిర్మాణానికి సుమారు రూ.4 కోట్ల వ్యయం అవుతుందని, సాంకేతిక అంచనాలు, సంబంధిత అధికారుల ఆమోదానికి లోబడి ఈ మొత్తాన్ని మంజూరు చేయించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలోని నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు సాధారణంగా కేటాయించే గృహాలకు అదనంగా మరో 1,500 పక్కా గృహాలను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. రాయదుర్గం నియోజకవర్గంలో అనేక నిరుపేద కుటుంబాలు సొంత ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, కొన్ని ఉమ్మడి కుటుంబాల్లో ఎనిమిది నుంచి పది మంది వరకు ఒకే ఇంటిలో నివసిస్తున్నారని తెలిపారు. గతంలో గ్రామీణ గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో పలువురు పేదలకు పక్కా గృహాలు మంజూరు చేసి వారి సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేశామని పేర్కొన్నారు. ఇటీవల కూడా గృహాల కోసం సుమారు 9,742 దరఖాస్తులు అందడం నియోజకవర్గంలో ఇళ్ల అవసరం ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తోందన్నారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అదనంగా 1,500 పక్కా గృహాలు మంజూరు చేసి నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

ప్రవాసాంధ్ర
చైతన్యరథం

## అమెరికాలోని ప్రవాసులకు
# 'టీమ్ ఎయిడ్' అండ




### భరోసా కల్పిస్తున్న ప్రవాసాంధ్రుడు మోహన్ నన్నపనేని



**యూఎస్ఏ:** అమెరికాలో ఉన్నత విద్య, ఉద్యోగం, వ్యాపారాల కోసం వెళ్లిన భారతీయులకు అనారోగ్యం, ప్రమాదాలు లేదా ఏదైనా అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు దిక్కుతోచని స్థితి ఏర్పడుతోంది. తోడుగా ఎవరూ లేక, ఇక్కడ ఉన్న కుటుంబ సభ్యులు భయందోళనలకు గురవుతుంటారు. అలాంటి సమయాల్లో వేల మైళ్ల దూరంలో ఉన్న తమ వారికి బాసటగా నిలుస్తూ భరోసా ఇస్తోంది 'టీమ్ ఎయిడ్' (Team AID). ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆ సంస్థ అధ్యక్షుడు మోహన్ నన్నపనేని అమెరికాలోని ప్రవాసులకు ఎంతగానో సహాయ సహకారాలు అందిస్తున్నారు.

గుంటూరు జిల్లా నందివెలుగు గ్రామానికి చెందిన మోహన్ నన్నపనేని 32ఏళ్ల క్రితం ఉద్యోగ రీత్యా అమెరికా వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న ఇద్దరు భారతీయులు వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందగా, వారి మృతదేహాలను మాతృదేశానికి తరలించడానికి కుటుంబ సభ్యులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఆ సంఘటనే మోహన్‌ను తీవ్రంగా ఆలోచింపజేసింది. అగ్రరాజ్యంలో ఆపదలో ఉన్న భారతీయులకు సత్వర సమాచారం, సహాయం అందించాలనే లక్ష్యంతో 2017లో 'టీమ్ ఎయిడ్'ను ప్రారంభించారు. 2007 నుంచి 2017 వరకు తానా (TANA) అసోసియేషన్‌లో ట్రెజరర్ నుంచి అధ్యక్షుడి వరకు వివిధ బాధ్యతలు నిర్వర్తించిన అనుభవం ఆయనకు ఈ సంస్థ ఏర్పాటులో దోహదపడింది.

#### 3,500 మంది వాలంటీర్లు

భారత్ నుంచి ఎవరైనా తమ వారికి సహాయం కావాలని సమాచారం ఇవ్వగానే జాతీయ కో-ఆర్డినేటర్ల ద్వారా సదరు ప్రాంతంలోని వాలంటీర్లను రంగంలోకి దించుతారు. వాలంటీర్లు బాధితుడి వివరాలు సేకరించి, దౌత్య కార్యాలయాలు (కాన్సు లేట్), ఆసుపత్రులు, విమాన సంస్థలతో మాట్లాడి పనులు పూర్తి చేస్తారు. ప్రస్తుతం దాదాపు 3,500 మంది వాలంటీర్లు ఈ సంస్థలో సేవలందిస్తున్నారు. విదేశాల్లో మరణించిన వారి మృతదేహాలను భారతదేశానికి తరలించడమే కాకుండా అవసరాన్ని బట్టి అక్కడే దహన సంస్కారాలు లేదా ఖననం చేయడానికి ఏర్పాట్లు చేస్తారు. మృతుడి బ్యాంకు ఖాతాలు, ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లకు సంబంధించిన పూర్తి వివరాలను కుటుంబ సభ్యులకు అందిస్తారు. ఇప్పటివరకు 5వేల కంటే ఎక్కువ మృతదేహాలను భౌతికంగా భారతదేశానికి సురక్షితంగా తరలించినట్టు నిర్వాహకులు తెలిపారు. విదేశాల్లో ఉన్న తమ వారికి అత్యవసర సహాయం కావాల్సిన వారు 'టీమ్ ఎయిడ్' సేవా సంస్థను సంప్రదించవచ్చని మోహన్ నన్నపనేని వివరించారు.



### ఫేయిర్‌ఫాక్స్‌లో ఘనంగా ప్రారంభమైన
## దేవీ శరన్నవరాత్రులు

**వర్జీనియా:** వర్జీనియాలోని ఫేయిర్‌ఫాక్స్‌లో వున్న శ్రీ వేంకటేశ్వర లోటస్ టెంపుల్‌లో దేవీ శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు జగన్మాతను ఆదిలక్ష్మి రూపంలో కొలిచారు. అమ్మవారికి నారింజ రంగు వస్త్రాన్ని ధరింపజేశారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య అర్చనలు జరిపారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణ, సంగీత, నృత్య సేవ, ఆదిలక్ష్మీ సహస్రనామ అర్చన అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అర్చకులు సుదర్శన హోమం నిర్వహించారు.

అలంకారం-చీర

మొదటి రోజు: ఆదిలక్ష్మి-ఆరెంజ్
రెండో రోజు: ధాన్యలక్ష్మి-వైట్
మూడో రోజు: ధైర్యలక్ష్మి-రెడ్
నాలుగో రోజు: గజలక్ష్మి-రాయల్ బ్లూ
ఐదో రోజు: సంతానలక్ష్మి-ఎల్లో
ఆరో రోజు: ధనలక్ష్మి-గ్రీన్
ఏడో రోజు: మహాలక్ష్మి-గ్రే
ఎనిమిదో రోజు: వీర్యలక్ష్మి-పర్పుల్
తొమ్మిదో రోజు: సరస్వతీ పూజ-పీకాక్ గ్రీన్

నవరాత్రుల్లో ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు లలితాసహస్ర పారాయణం, 7 గంటలకు సంగీత, నృత్య సేవ, అనంతరం శ్రీలక్ష్మీ సహస్రనామ అర్చన జరుగుతాయని, భక్తులు పాల్గొనాలని ట్రస్టు సభ్యులు కోరారు.

#### 17న బతుకమ్మ వేడుకలు

వర్జీనియాలోని ఫేయిర్ ఫాక్స్‌లో శ్రీవేంకటేశ్వర లోటస్ టెంపుల్‌లో ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు బతుకమ్మ వేడుకలు జరగనున్నాయి. 'మంచి పువ్వులతో బతుకమ్మలను అందంగా తయారు చేసి పేర్చి బతుకమ్మ సెలబ్రేషన్స్ నిర్వహించుకుందాం. ఈ వేడుకకు మీతో పాటు కుటుంబ సభ్యులను కూడా తీసుకురండి. అందరూ కలిసి బతుకమ్మ ఆడటం ద్వారా మరింత శోభ తీసుకొద్దాం' అని ఆలయ సిబ్బంది తెలిపారు.




### సెయింట్ లూయిస్‌లో విజయవంతంగా
# 'తానా' టీమ్ స్క్వేర్ 5కే వాక్/రన్

**ఆరోగ్య అవగాహన, సామాజిక సేవే లక్ష్యంగా నిర్వహణ... ఉత్సాహంగా పాల్గొన్న 200 మందికి పైగా తెలుగు ప్రజలు, చిన్నారులు**

**సెయింట్ లూయిస్:** అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో తానా (TANA) టీమ్ స్క్వేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన '5కే వాక్/రన్' విజయవంతంగా సాగింది. సామాజిక సేవే ప్రధాన ధ్యేయంగా ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దలు, యువతతో పాటు అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొని సందడి చేశారు. సుమారు 200 మందికి పైగా తెలుగు ప్రజలు ఎంతో ఉత్సాహంగా అడుగులు వేసి కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. తెలుగు వారి మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఈ ఈవెంట్ రూపొందించినట్టు నిర్వాహకులు తెలిపారు.




ఈ కార్యక్రమంలో తానా ఫౌండేషన్ ట్రస్టీ రాజా సూరపనేని, తానా రీజినల్ కో-ఆర్డినేటర్ రవి పొట్లూరి, మహిళా కో-ఆర్డినేటర్ పల్లవి సూరపనేని, గ్లోబల్ ఎన్‌ఆర్ఐ టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచు వేణుగోపాల్‌రెడ్డి, సెయింట్ లూయిస్ ప్రెసిడెంట్ కిషోర్ యార్లగడ్డ, ఏపీఎన్‌ఆర్‌టీ కో-ఆర్డినేటర్ కిషోర్ యర్రపోతిన తదితరులు పాల్గొన్నారు. సెయింట్ లూయిస్ టీడీపీ నాయకులు, కమ్యూనిటీ ప్రతినిధులు వంశీ పాతూరి, వీర, సుధాకర్, నాగకుమార్ బెల్లంకొండ, వెంకట్ గౌని, రాకేష్ మద్దినేని, ప్రదీప్ నంద్యాల, సుధాకర్ నర్రా, దామోదర్ పాతూరి, వెంకట్ ఉపమాక తదితరులు కార్యక్రమానికి అండగా నిలిచారు. సామాజిక బాధ్యతను చాటుతూ తానా టీమ్ స్క్వేర్ చేపట్టిన ఈ ప్రయత్నంపై తెలుగు సమాజం నుంచి ప్రశంసల జల్లు కురిసింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వాలంటీర్లు, సహకరించిన నాయకులు, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.





# ఇక జంతర్ మంతర్ దగ్గర నిరసనలకు చెల్లుచీటీ




దేశ రాజధాని ఢిల్లీలోని ప్రఖ్యాత నిరసనల ప్రాంతం జంతర్ మంతర్ వద్ద ఇకనుంచి నిరసన ప్రదర్శనలు చేపట్టలేరు. ఇప్పటివరకూ ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకత తెలిపేందుకు కేంద్రంగా ఉన్న ఆ ప్రాంతాన్ని నిరసన ప్రదర్శనలు తెలిపే వేదిక నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జంతర్ మంతర్‌ను నిరసనలు తెలిపే ప్రదేశం నుంచి డీనోటిపై చేస్తున్నామని ఆ ప్రకటనలో కమిషనర్ పేర్కొన్నారు. ఢిల్లీలో నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు, బైఠాయింపులు వంటి కార్యక్రమాలు నిర్వహించడానికి మూడు ప్రదేశాలను ఆయన వెల్లడించారు. అవి రామ్‌లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, ఈస్ట్ ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అని పేర్కొన్నారు. ఇక నుంచి ఆ మూడు ప్రాంతాలలోనే ఆందోళలు, ప్రదర్శనలు, బైఠాయింపులు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం త్వరలోనే వేర్వేరుగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను విడుదల చేస్తామని తెలిపారు. కాగా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియలో ఓటరు జాబితాల నుంచి ఓటర్ల పేర్లను తొలగించారన్న ఆరోపణలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)లు జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో జంతర్ మంతర్‌ను నిరసనలు తెలిపే ప్రాంతం నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. జంతర్ మంతర్‌ను నిరసనలు తెలిపే ప్రాంతం నుంచి తొలగిస్తూ ఢిల్లీ పోలీసు కమిషనర్ జారీ చేసిన ప్రకటన నేపథ్యంలో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డాయి. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే అవకాశం కూడా లేకుండా చేస్తున్నారని కేంద్రంపై తీవ్రంగా విమర్శలు గుప్పించాయి. ఢిల్లీ పోలీసులు కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోకి వస్తారు. మరోవైపు తాజా నిర్ణయం నేపథ్యంలో జంతర్ మంతర్ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగనున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలు కీలక ప్రభుత్వ విభాగాల భవనాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి.



# కోర్టులను రాజకీయాల్లోకి లాగొద్దు

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పిలుపు

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఓట్ల చోరీ అంశాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు వినతి పత్రం సమర్పించేందుకు సోమవారం సమయం ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు సీజేఐను అభ్యర్థించారు. వారి విజ్ఞప్తిని జస్టిస్ సూర్యకాంత్ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ అంశంపై సీజేఐ స్పందించారు. ఇండియా కూటమి నుంచి తనకు వచ్చిన అభ్యర్థనపై ఆదివారం రాత్రి కాంగ్రెస్ కీలక నేతలు ఖర్గే, రాహుల్ గాంధీలకు మెయిల్ పంపినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రధాన ఎన్నికల సంఘం విషయంలో వారు లేవనెత్తాలనుకున్న సమస్యలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. విచారణలో ఉన్న అంశాలపై సమావేశం కావడం అధికారాల విభజన సూత్రానికి విరుద్ధమని సీజేఐ తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశాలపై రాజకీయ నేతలతో సమావేశం కావాల్సిన అవసరం లేదని భావించి, వారికి అపాయింట్‌మెంట్ నిరాకరించినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పాలనకు సంబంధించిన విషయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోబోవని.. కావాలంటే కాంగ్రెస్ నేతలు ఈ విషయంపై పిటిషన్ ద్వారానే తమను సంప్రదించవచ్చని సీజేఐ సూచించారు. సీఈసీ అంశాలకు సంబంధించిన విషయాలు మంగళవారం విచారణకు రానున్నాయని కూడా ఆయన పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తలుపులు ఎల్లప్పుడూ అందరి కోసం తెరిచే ఉంటాయన్నారు. అంతే కానీ కోర్టులను రాజకీయాల్లోకి లాగాలని చూడొద్దని ప్రతిపక్షాలకు సూచించారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సందర్భంలో సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమావేశంలో 'నీరు జీవన అమృతం' అనే అంశంపై సీజేఐ మాట్లాడుతూ కలుషిత జలాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దానివల్ల ప్రజల ఆరోగ్యాలకు భారీ ముప్పు పొంచి ఉందన్నారు.

## ఢిల్లీ మెట్రోరైల్‌లో ప్యాసింజర్ మృతి ఘటనలో

# మాజీ ఐఏఎస్ అధికారి సంజయ్ ప్రతాప్ అరెస్టు




ఢిల్లీ మెట్రోరైల్‌లో రెండు రోజుల క్రితం ప్యాసింజర్ మృతి చెందిన ఘటనలో మాజీ ఐఏఎస్ అధికారి సంజయ్ ప్రతాప్ సింగ్, ఆయన తనయుడు సిద్ధార్థ సింగ్‌ను పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. సీటు విషయంలో తగాదా తలెత్తిన సమయంలో పవన్ కుమార్‌పై ప్రతాప్ సింగ్, సిద్ధార్థ సింగ్ చేయిచేసుకున్నట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. ఈ క్రమంలో కిందపడ్డ పవన్ శర్మ మృతి చెందినట్టు చెప్పారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, సీనియర్ సిటిజన్ల కోసం రిజర్వ్ చేసిన సీటు విషయంలో వారి మధ్య తగాదా మొదలైంది. ఈ క్రమంలో ప్రతాప్ సింగ్, సిద్ధార్థ్ సింగ్ తోయడంతో కిందపడిపోయిన పవన్ శర్మ తలకు గాయమైంది. వెంటనే మెట్రో సిబ్బంది ఆయనను స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. పవన్ శర్మ తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ప్రతాప్, సిద్ధార్థలను అరెస్టు చేశారు. అసలు ఏం జరిగిందో తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, ఓ అవినీతి కేసులో ప్రతాప్ సింగ్‌ను సీబీఐ అధికారులు గతంలో ఓసారి అరెస్టు చేసినట్టు తెలిసింది. ఇక సిద్ధార్థ సింగ్ సుప్రీంకోర్టులో లాయర్‌గా పనిచేస్తున్నట్టు సమాచారం.

## ఫారం 6 సవరణలను ఎక్కడా ఆమోదించలేదు!

ఫారం–6పై వివాదం రాజుకున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఫారం–6 సవరణలను తాము ఎక్కడా ఆమోదించలేదని స్పష్టం చేసింది. ఈ సవరణలకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని భారత ఎన్నికల సంఘం (ఈసీ) వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ వ్యాఖ్యలపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. బీహార్ సర్ తీర్పు సమయంలో అసలు కొత్త ఫారం–6 అందుబాటులోనే లేదని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. కొత్త ఫారం–6 డిక్లరేషన్‌కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఎన్నికల సంఘం చేసిన వ్యాఖ్యలను న్యాయస్థానం తప్పుబట్టింది. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుందంటూ పిటిషనర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. చట్టబద్ధమైన నిబంధనలు సవరించకుండా ఫారం–6లో ఈసీ మార్పులు చేసిందని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ఫారం–6 సవరణలను తాము ఆమోదించలేదని తెలిపింది.



# సెంట్రల్ ఢిల్లీలో ఉద్రిక్త వాతావరణం

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా, 'ఓట్ల చోరీ' అంశంపై సోమవారం సెంట్రల్ ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి ఆధ్వర్యంలో వేలాది మంది ప్రజలు, నేతలు కన్నాట్ ప్లేస్ నుంచి మండి హౌస్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. 'చలో ఢిల్లీ మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో చేపట్టిన ఈ మార్చ్ కారణంగా దేశ రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కన్నాట్ ప్లేస్, బరాఖంబా రోడ్ జంక్షన్ వద్ద ప్రతిపక్ష నేతలు పెద్ద ఎత్తున గుమిగూడి సుప్రీంకోర్టుకు బయలుదేరారు. ఈ నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. ఎన్నికల సంఘం చీఫ్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలంటూ ప్రతిపక్ష పార్టీల నేతలు గట్టిగా డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల సంఘం తీరును తీవ్రంగా తప్పుబడుతూ విపక్షాలు తమ ఆందోళనను మరింత ఉధృతం చేశాయి. ఇప్పటికే చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాతో సంప్రదింపులు జరిపారు. అనంతరం ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై తాము సిద్ధం చేసిన పిటిషన్‌ను సోమవారమే సుప్రీంకోర్టులో దాఖలు చేసినట్లు వారి తరఫు న్యాయ బృందం వెల్లడించింది. రాబోయే రోజుల్లో ఈ అంశంపై రాజకీయంగా ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని సుప్రీంకోర్టుకు ఇండియా కూటమి నేతల మహా పాదయాత్ర ప్రారంభమైంది. బారాఖంబా రోడ్డు నుంచి 'సుప్రీంకోర్టు వరకు ప్రజాస్వామ్యం కోసం పాదయాత్ర' పేరుతో వారు ఈ యాత్రను చేపట్టారు. ఎన్నికల్లో అక్రమాలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) తీరుకు వ్యతిరేకంగా ఈ పాదయాత్రను సోమవారం లోక్‌సభలో

### పోరాటానికి సిద్ధమైన ఇండియా కూటమి

ప్రతిపక్షనేత రాహుల్ గాంధీతోపాటు విపక్ష పార్టీల అగ్రనేతలు చేపట్టారు. అంతకుముందు కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వద్దకు ఇండియా కూటమి ఎంపీలతోపాటు సీనియర్ నాయకులు చేరుకున్నారు.

ఈ సందర్భంగా ఢిల్లీ పోలీసులతోపాటు కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ, సమాజ వాదీ పార్టీ, టీఎంసీ, శివసేన (యూబీటీ) నేతలు మండిపడ్డారు. ఎంపీ రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఈ రోజు ఢిల్లీలో 'ఇండియా' కూటమి భారీ పాదయాత్రను చేపట్టింది. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం దీర్ఘకాలిక పోరాటానికి సిద్ధమైనట్లు ఆయా పార్టీల నేతలు ప్రకటించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ వైఖరిని ప్రశ్నిస్తూ విపక్షాలు ఈ నిరసన వ్యూహాన్ని చేపట్టాయి. ప్రధాని మోదీ, అమిత్ షా ఆదేశాలతోనే ఢిల్లీ పోలీసులు తమ నిరసనలను అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ ఎంపీ అమరీందర్ సింగ్ రాజా ఆరోపించారు. ఈ పాదయాత్ర సందర్భంగా ఢిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మరో వైపు ఇండియా కూటమి నేతలకు అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నిరాకరించారు. ఈ నేపథ్యంలో సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ఇండియా కూటమి నేతలు వ్యూహాత్మకంగా వ్యవహరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# ప్రహసనంలా ట్రంప్ ప్రకటనలు

- రష్యా, ఉక్రెయిన్ మధ్య ఎనర్జీ సీజ్‌ఫైర్ కుదిరిందని వెల్లడి
- మీడియా వార్తలతోనే తనకు తెలిసిందన్న జెలెన్‌స్కీ
- కొద్ది సేపటికే ఉక్రెయిన్ విద్యుత్‌ప్లాంట్లపై రష్యా భీకరదాడులు



రష్యా, ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటనలు ప్రహసనంగా మారుతున్నాయి. రష్యా, ఉక్రెయిన్ మధ్య తక్షణమే ఇంధన వనరుల కాల్పుల విరమణ (ఎనర్జీ సీజ్‌ఫైర్) ఒప్పందం అమల్లోకి వచ్చిందని ట్రంప్ ఆదివారం ప్రకటించారు. విద్యుత్, చమురు, గ్యాస్ వంటి ఇంధన మౌలిక సదుపాయాలపై పరస్పర దాడుల నిలిపివేతకు ఇరుపక్షాలూ అంగీకరించాయన్నారు. అయితే దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ స్పందన మరింత విచిత్రంగా ఉంది. ఈ విషయం తనకు ముందుగా తెలియదన్నారు. మీడియాలో వచ్చిన వార్తలు చూసే తాను తెలుసుకున్నట్లు చెప్పారు. రష్యా దాడులు నిలిపివేస్తే ఉక్రెయిన్ కూడా కాల్పుల విరమణకు సిద్ధంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మరోపక్క ట్రంప్ ప్రకటనను తీసిపారేస్తూ ఉక్రెయిన్‌లోని విద్యుత్ కేంద్రాలపై రష్యా దాడులకు దిగింది.

ఉక్రెయిన్‌లోని ఖార్కివ్ విద్యుత్ కేంద్రంపై రష్యా దాడి చేసింది. ఇరు దేశాల మధ్య ఇంధన కేంద్రాలపై దాడులు నిలిపివేసే ఒప్పందం కుదిరిందని ట్రంప్ ప్రకటించి కొద్ది గంటలు కూడా గడవక ముందే తర్వాత ఈ దాడి జరగటం గమనార్హం. ఖార్కివ్ విద్యుత్ కేంద్రంపై రష్యా దాడి చేసినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా ధ్రువీకరించారు. కీవ్‌లోని విద్యుత్ కేంద్రంపైనా రష్యా దాడి చేసినట్లు వెల్లడించారు. ఖార్కివ్‌లో ఉన్న థర్మల్ పవర్ ప్లాంట్ నంబర్-5 (సీహెచ్‌పీ-5)పై రష్యా దాడి చేసినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఈ విద్యుత్ కేంద్రం నగరానికి విద్యుత్తుతో పాటు వేడి సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీంతో ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత కాల్పుల విరమణపై మరోసారి సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అయితే ఇది మంచి పరిణామమేనని పేర్కొన్నారు. ఈ ఒప్పందానికి రష్యా కట్టుబడి ఉంటే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తమ ఇంధన సదుపాయాలపై మాస్కో దాడులు ఆపిన వెంటనే.. తాము కూడా ఆ దేశ చమురు శుద్ధి కర్మాగారాలపై దాడులు నిలిపివేస్తామని జెలెన్స్కీ వెల్లడించారు. ఉద్రిక్తతలను తగ్గించే ఏ చర్యలైనా ఇరుపక్షాల నుంచి ఉన్నప్పుడే శాంతి స్థాపన సాధ్యమవుతుందన్నారు. కాగా.. ట్రంప్ ప్రకటనపై అటు రష్యా ఇప్పటి వరకూ స్పందించలేదు సరికదా.. ప్రకటన అనంతరం ఉక్రెయిన్ లోని పలు ప్రాంతాలపై దాడులు చేపట్టడం గమనార్హం.

**రష్యాతో ట్రంప్ ఒప్పందం నిలిపివేతకు రిపబ్లికన్ల యోచన**

రష్యానుంచి డీజిల్ కొనుగోలుకు అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తానని అమెరికాలో అధికార రిపబ్లికన్ పార్టీకి చెందిన కాంగ్రెస్ సభ్యుడు బ్రియాన్ ఫిట్జ్‌ప్యాట్రిక్ ప్రకటించారు. ఇందుకోసం ఓ ద్వైపాక్షిక బిల్లును తీసుకువస్తానని వెల్లడించారు. ప్యాట్రిక్ ప్రతిపాదనను మరో రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యుడు డాన్ బెకాన్ సమర్థించారు. అయితే ప్రతినిధుల సభ పదవీకాలం జనవరితో ముగిసిపోనున్న కారణంగా బిల్లు ఆమోదానికి తగిన సమయం ఉండదు. ఈ కారణంగా వీరి ప్రయత్నం నామమాత్రంగా మిగిలిపోనుంది.



## బంగారు గనిపై వైమానిక దాడి

**- 72 మంది మృతి**

సూడాన్, ఈజిప్ట్ మధ్య వివాదాస్పద సరిహద్దు ప్రాంతంలోని బంగారు గనిపై వైమానిక దాడి జరిగి 72 మంది కార్మికులు మరణించారు. సూడాన్‌కు చెందిన ఒక మానవ హక్కుల సంస్థ ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించింది. తాజా దాడిలో 72 మంది గని కార్మికులు మరణించినట్లు ప్రాథమిక సమాచారం అందిందని, మృతుల సంఖ్యను నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపింది. ఈ దాడి సూడాన్ భూభాగంలో జరిగిందని ఆ సంస్థ పేర్కొంది. దాడి సమయంలో పర్వత ప్రాంతంలోని ఆ గనిలో వేలాది మంది పనిచేస్తున్నట్లు ప్రాణాలతో బయటపడిన వారు తెలిపారు. ఈ దాడికి ఈజిప్ట్ వైమానిక దళం కారణమని ఆ సంస్థ ఆరోపించింది. ఈజిప్ట్ ప్రభుత్వం దీనిపై అధికారికంగా స్పందించలేదు. జబల్ అల్ ఉఖైదాత్ ప్రాంతంలోని బంగారు గనిపై ఈ ఏడాది జరిగిన రెండో వైమానిక దాడి ఇది. జూన్‌లో ఇదే ప్రాంతంలోని అనధికారిక బంగారు గనిపై జరిగిన దాడిలో 23 మంది కార్మికులు మరణించారు. అప్పట్లో తమ భూభాగంలో అక్రమ బంగారు తవ్వకాలను అడ్డుకునేందుకు పెద్ద ఎత్తున చర్యలు చేపట్టినట్లు ఈజిప్ట్ సైన్యం ప్రకటించింది. అయితే, ఆ దాడికి తామే బాధ్యులమని సైన్యం నేరుగా ప్రకటించలేదు.

## సౌదీలోని దమ్మామ్ ఎయిర్‌పోర్ట్‌పై హుతీల దాడి

***- కింగ్ ఖాలిద్ ఎయిర్‌పోర్ట్‌పై దాడిలో 13 మంది మృతి***



సౌదీ అరేబియా లో దమ్మామ్‌లోని కింగ్ ఫహాద్ అంతర్జాతీయ ఎయిర్ పోర్టుపై ఆదివారం అర్ధరాత్రి హూతీ రెబల్స్ క్షిపణులతో విరుచుకుపడ్డారు. దమ్మామ్‌లో జరిగిన దాడిలో నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మరోవైపు సౌదీ రాజధాని రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై కూడా రెండో విడత దాడి చేశారు. ఈ దాడిలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. దమ్మామ్ విమానాశ్ర యం రియాద్‌కు 410 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది అరేబియన్ గల్ఫ్ తీరంలో కీలక పారిశ్రామిక నగరం. దీనికి తోడు ఈ ఎయిర్పోర్టు కీలక ఏవియేషన్ హబ్‌గా కూడా ఉంది.

అంతకు ముందు రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై హూతీలు జరిపిన భీకర దాడుల్లో హైదరాబాద్‌వాసి సహా మొత్తం 13 మంది మృతి చెందారు. 300 మందికిపైగా గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడ్డవారిలో కనీసం 11 మంది భారతీయులు ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ దాడులు తాము చేసినట్లు హూతీ తిరుగుబాటుదారులేమీ ప్రకటించలేదు. అయితే సౌదీ విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుంటామని.. వాటి ద్వారా ప్రయాణాలు చేయవద్దని అంతర్జాతీయ ప్రయాణికులను వారు హెచ్చరించారు. తమ పై సౌదీ దాడులు నిలిపివేసే వరకు తాము వెనక్కి తగ్గమన్నారు. సౌదీకి మరింత భయానక పరిస్థితి రానుందని పేర్కొన్నారు. దీంతో పలు విమానాశ్రయాలను సౌదీ మూసివేసింది. ఆదివారం మరోసారి కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ప్రయాణికుల టెర్మినల్ పైకి ఓ క్షిపణి దూసుకొచ్చింది. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

**చర్చలతోనే పరిష్కారం: ఇరాన్**

సౌదీ-హూతీలు చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. తమకు పొరుగుదేశాలతో యుద్ధాలు చేయాలన్న కోరికలేదని పేర్కొన్నారు. హూతీలు పూర్తిగా స్వతంత్ర వైఖరితోనే పనిచేస్తున్నారన్నారు. సౌదీపై దాడులకు ఇరాన్ ప్రోత్సహించిందన్న వాదనలు వస్తున్న నేపథ్యంలో అరాగ్చీ స్పందించారు.

మరోపక్క రియాద్ ఎయిర్‌పోర్టుపై దాడిని తుర్కియే తీవ్రంగా ఖండించింది. ఇవి అంతర్జాతీయ చట్టాలకు పూర్తిగా వ్యతిరేకమని పేర్కొంది. వీటిని తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేసింది. సౌదీకి తాము పూర్తిగా అండగా నిలుస్తామని ప్రకటించింది.

సౌదీకి అత్యవసరమైతే తప్ప తమ దేశ ప్రజలు వెళ్లొద్దని యూకే ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. ముఖ్యంగా జెడ్డా, దమ్మామ్, మదీనా ఎయిర్పోర్టులకు వెళ్లే విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది.

**సనాపై సౌదీ దాడులు**

యెమెన్ రాజధాని సనాపై సౌదీ తాజాగా రెండు వైమానిక దాడులు చేసిందని హూతీలు ఆరోపించారు. ఈ దాడుల్లో ఓ చిన్నారి మృతిచెందినట్లు, మరో ఆరుగురు గాయపడినట్లు పేర్కొన్నారు. గత ఐదు వారాల్లో సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు జరిపిన దాడుల్లో 91 మంది యెమెన్ వాసులు ప్రాణాలు కోల్పోయారని, 168 మంది గాయపడ్డారని హూతీలు వెల్లడించారు.

## అమెరికా ప్రొఫెసర్లకు ఆర్థికశాస్త్రంలో నోబెల్ పురస్కారం




ఆర్థిక శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. 2026 సంవత్సరానికి గానూ అమెరికాకు చెందిన ఇద్దరు ప్రొఫెసర్లకు దీనిని అందించనుంది. 'స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులు' అంశంపై అమెరికాకు చెందిన రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్ ఫోర్డ్ లు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. దీంతో వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన ముగిసింది.

కాలిఫోర్నియాకు చెందిన రాబర్ట్ ఇ.హాల్.. 1967లో మసా చుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎమ్ఐటీ) నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.మసాచుసెట్స్‌కు చెందిన వుడ్ ఫోర్డ్ సైతం ఎమ్ఐటీ నుంచి 1983లో పీహెచ్‌ఎ పూర్తి చేశారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఈ ఇద్దరు అభివృద్ధి చేసిన కొత్త ఆర్థిక నమూనాల ఆధారంగా.. సరైన సమయంలో తీసుకునే ఆర్థిక, ద్రవ్య విధాన చర్యలు ఆర్థిక వ్యవస్థలోని హెచ్చుతగ్గులను తగ్గించగలవని నిరూపితమ య్యాయి.

## కన్నబిడ్డపైనా కనికరం చూపని మస్క్..!



కన్న బిడ్డ హెల్త్ ఇన్సూరెన్స్‌నే మస్క్ రద్దు చేశారని ఆయన మాజీ భార్య, కెనడా రచయిత్రి జెన్నిఫర్ జస్టిన్ విల్సన్ తెలిపారు. తమ బిడ్డ వీవియన్ జెన్నా విల్సన్ ట్రాన్స్‌జెండర్‌గా మారిన మరుసటి రోజే మస్క్ ఆమె ఇన్సూరెన్స్‌ను క్యాన్సిల్ చేశారని తెలిపారు. త్వరలో విడుదల కానున్న డాక్యుమెంటరీ 'మస్క్'లో ఈ వివరాలను పంచుకున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఆలెక్స్ గిబ్నీ ఈ డాక్యుమెంటరీని డైరెక్ట్ చేశారు. అయితే, మస్క్ మాత్రం ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. తనను కావాలనే టార్గెట్ చేసేందుకు ఈ డాక్యుమెంటరీ రూపొందించినట్టు ఉందని చెప్పారు.

వీవియన్ ట్రాన్స్‌జెండర్‌గా మారిన రోజున మస్క్ ఆమెకు మద్దతు తెలిపారని జస్టిన్ విల్సన్ చెప్పారు. కానీ మరుసటి రోజే ఆమె ఇన్సూరెన్స్‌ను రద్దు చేశారని విల్సన్ ఆరోపించారు. అసలు వీవియన్ ట్రాన్స్‌జెండర్ అని తెలిశాక మస్క్ ఓ బిడ్డను కోల్పోయినట్టు ఫీలయ్యారని చెప్పారు. అయితే, వీవియన్ ఇష్టాన్ని గౌరవించాలని తాను చెప్పానని అన్నారు.

వీవియన్‌కు చిన్నతనం నుంచి స్వతంత్ర భావాలు ఉండేవని విల్సన్ అన్నారు. మస్క్ మాత్రం ఆమెను క్రమశిక్షణలో పెట్టేందుకు ప్రయత్నించేవారని తెలిపారు. తన మాట వినకపోతే జీవితంలో విఫల వ్యక్తిగా మిగిలిపోతావని ఆరేళ్ల వీవియన్‌ను మస్క్ హెచ్చరించినట్టు కూడా చెప్పారు. ఈ ప్రపంచంలో విజేతలు, పరాజితులు అనే రెండు రకాల మనుషులే ఉంటారని కూడా మస్క్ అప్పట్లో వీవియన్‌తో అన్నారని విల్సన్ గుర్తు చేసుకున్నారు.

ప్రస్తుతం 22 ఏళ్ల వయసున్న వీవియన్ 2022లో తాను ట్రాన్స్‌జెండర్ అని బహిరంగంగా ప్రకటించారు. తన తండ్రి మస్క్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని కూడా కోర్టు డాక్యుమెంట్స్‌లో స్పష్టంగా తేల్చి చెప్పారు.

మస్క్ మాజీ భాగస్వామి ఆష్లీ సెయింట్ క్లేర్ కూడా ఈ డాక్యుమెంటరీలో పాల్గొన్నట్టు తెలిసింది. మస్క్ వివరాలు చెప్పకుండా ఉండేందుకు కోట్ల రూపాయల ఎన్‌డీఏ డీల్‌ను కాదనుకుని ఆమె డాక్యుమెంటరీలో పాల్గొన్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

# అభిషేక్‌పై మా ప్లాన్ పనిచేయలేదు..



వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో భారత్ విజయం సాధించి సిరీస్‌లో 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. ఇండోర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ (69; 30 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సులు) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. అతడి బ్యాటింగ్‌పై వెస్టిండీస్ ఆల్‌రౌండర్ షమార్ స్ప్రింగర్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అభిషేక్ కోసం తమ టీమ్ 'ప్లాన్-బి'ని అమలు చేసిందని, అయితే అది పనిచేయలేదన్నాడు. అభిషేక్ వరల్డ్ క్లాస్ ఆటగాడు. అతడి బ్యాటింగ్ అద్భుతంగా ఉంది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ కోసం మేం ప్లాన్-బిని ఉపయోగించాం. అతడి విషయంలో రక్షణాత్మకంగా ఉంటూ.. సాధ్యమైనంత మేర సింగిల్స్, డబుల్స్‌కే పరిమితం చేయాలనుకున్నాం. అయితే, అది అంతగా పనిచేయలేదు. అభిషేక్ మొదటి నుంచి దూకుడుగా ఆడటం భారత్ జట్టుకు కలిసొచ్చిందని అని స్ప్రింగర్ వ్యాఖ్యానించాడు. ఇక, లక్ష్య ఛేదనలో భారత బౌలర్లు రాణించారన్నాడు. తాము కొన్ని బంతులను పరుగులుగా మల్చలేకపోయామని, అప్పుడే గేమ్ తమకు దూరమైందని అభిప్రాయపడ్డాడు.

**వారి ప్లాన్ తెలుసు: అభిషేక్**

మరోవైపు, వెస్టిండీస్ ప్లాన్‌పై అభిషేక్ శర్మ కూడా స్పందించాడు. నా విషయంలో వారు ప్రణాళిక మార్చుకున్నారని అర్థమైంది. అందుకే ఆఫ్ స్పిన్నర్‌తో ఆ జట్టు బౌలింగ్ దాడిని ప్రారంభించింది. అందుకు తగినట్లుగానే తొలి ఓవర్లో బౌలర్ అద్భుతంగా బంతులేశాడు. అయితే, పవర్ ప్లే లో నేను తక్కువ పరుగులు చేస్తే జట్టుకు నష్టమని తెలుసు. అందుకే వారి వ్యూహం కంటే మెరుగ్గా ఆడక తప్పదని అర్థమైందని అభిషేక్ వివరించాడు. వెస్టిండీస్ విధ్వంసక జట్టు అని, వారితో ఆడుతున్నప్పుడు ఎప్పుడూ అలసత్వం ప్రదర్శించడం సరికాదన్నాడు.

## ఢిల్లీలోనే భారత్- శ్రీలంక తొలి వన్డే..

భారత్- శ్రీలంక మధ్య డిసెంబర్ 13న జరగనున్న తొలి వన్డే మ్యాచ్ వేదికను ఢిల్లీ నుంచి అహ్మదాబాద్‌కు మారుస్తున్నట్లు వస్తున్న కథనాలను బీసీసీఐ ఖండించింది. నిబంధనల ప్రకారమే ఆ మ్యాచ్‌ను ఢిల్లీకి కేటాయించారని, వేదిక విషయంలో ఎటువంటి మార్పు చేయలేదని బీసీసీఐ (కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. ఢిల్లీలో జరగాల్సిన భారత్- శ్రీలంక తొలి వన్డేను అహ్మదాబాద్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. బీసీసీఐ అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదు. నిర్దీత ప్రామాణిక విధానాన్ని అనుసరించే ద్వైపాక్షిక మ్యాచ్‌ల వేదికలను కేటాయిస్తారని సైకియా వివరణ ఇచ్చారు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్మాణ పనులు జరుగుతున్నందున.. ఆ మ్యాచ్‌ను అహ్మదాబాద్‌కు మారుస్తున్నారనే ప్రచారం మొదలైంది. ఇదిలా ఉండగా.. భారత్ పర్యటనలో భాగంగా శ్రీలంక జట్టు మూడు వన్డేలతో పాటు మూడు టీ20ల సిరీస్ కూడా ఆడనుంది.

# కోహ్లి వీడియోలు చూసి నేర్చుకున్నా..



భారత్-ఏతో ఇటీవల జరిగిన మూడు వన్డేల సిరీస్ ను ఆస్ట్రేలియా-ఏ జట్టు 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో ఆసీస్ బ్యాటర్ నాథన్ మెక్‌స్వీనీ ఒక సెంచరీ సహా 194 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. ఈ క్రమంలోనే అతడు తన విజయ రహస్యాన్ని వెల్లడిస్తూ.. టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి యూట్యూబ్ వీడియోలు చూసి, స్పిన్ బౌలింగ్‌లో ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నట్లు తెలిపాడు. ఏ విదేశీ జట్టుకైనా భారత్లో సిరీస్ గెలవడం అంత సులభమైన విషయం కాదు. భారత్ పర్యటనకు వచ్చినప్పుడు సహజంగానే స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంటుంది. అందుకే స్పిన్నర్లను కోహ్లి ఎలా ఆడుతున్నాడో యూట్యూబ్ వీడియోల్లో చూశాను. అలాగే స్టీవ్ స్మిత్‌తో పాటు గతంలో ఇక్కడ రాణించిన ఆస్ట్రేలియన్ ఆటగాళ్ల శైలిని కూడా గమనించాను. అంతేకాకుండా విశ్లేషకుల డేటానూ అధ్యయనం చేశాను. వాటిని మైదానంలో ఆచరణలో పెట్టి.. మంచి ఫలితాలు సాధించడం చాలా సంతోషాన్నిచ్చిందని మెక్‌స్వీనీ చెప్పాడు.

# ఏకైక టెస్ట్‌లో ఓటమి అంచున ఆఫ్ఘనిస్తాన్

- **479 పరుగుల లక్ష్యం: ప్రస్తుత స్కోరు 132/3**
- **372-7 స్కోర్ వద్ద రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన బంగ్లాదేశ్**
- **సెంచరీతో రాణించిన లిట్టన్ దాస్**

అబుదాబీ వేదికగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ పట్టు సాధించింది. 479 పరుగుల లక్ష్యసాధనలో ఆఫ్ఘనిస్తాన్ నాలుగో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. సిద్ధిఖుల్లా అటల్ (35, 126 బంతుల్లో), హస్మతుల్లా షాహిది (19, 27 బంతుల్లో) క్రీజులో ఉన్నారు. ఆఫ్ఘనిస్తాన్ గెలవాలంటే చివరి రోజు మరో 347 పరుగులు చేయాలి.

అంతకు ముందు 372-7 స్కోర్ వద్ద బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకుని మొత్తం 479 పరుగుల లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్ ముందుంచింది. బంగ్లా రెండో ఇన్నింగ్స్ లిట్టన్ దాస్ (102) సెంచరీతో కదంతొక్కాడు. నజ్ముల్ హసన్ షాంటో (82), ముష్ఫికర్ రహీం (81), మెహిది హసన్ మిరాజ్ (52 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించారు.

ఆఫ్ఘనిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 240 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రహ్మత్ షా (105 నాటౌట్) బాధ్యతాయుతమైన సెంచరీతో గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. ఓ పక్క వికెట్లు పడుతున్నా, షా పట్టుదలగా బ్యాటింగ్ చేసి తన సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

ఆఫ్ఘన్ ఇన్నింగ్స్ లో షాతో పాటు ఓపెనర్ అబ్దుల్ మాలిక్ (62) మాత్రమే రాణించాడు. బంగ్లా పేసర్ హసన్ మహ్మూద్ హ్యాట్రిక్ సహా 5 వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు. అతడికి ఎబాదత్ హొసేన్ (4-56), మెహిది హసన్ మిరాజ్ (1-41) కూడా సహకరించారు. వీరి ధాటికి ఆఫ్ఘన్ ఇన్నింగ్స్ లో ఏకంగా ఐదుగురు డకౌట్టయ్యారు.



ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ 346 పరుగులకు ఆలౌటైంది. షద్మాన్ (67), తంజిద్ హసన్ (83), లిటన్ దాస్ (53) అర్ధ సెంచరీలతో రాణించారు. ఆఫ్ఘన్ బౌలర్లలో మొహమ్మద్ సలీమ్ సఫీ 4 వికెట్లతో రాణించాడు.

## కొనసాగుతున్న స్టార్క్ అగ్రస్థానం!



దర్బన్ వేదికగా దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ తన అరుదైన రికార్డును కొనసాగిస్తున్నాడు. టెస్ట్ ఫార్మాట్ లో 21వ శతాబ్దంలో ఒక్క సిక్సర్ కూడా ఇవ్వకుండా ఎక్కువ బంతులు వేసిన బౌలర్‌గా చరిత్ర సృష్టించిన స్టార్క్ తాజాగా సౌతాఫ్రికాతో జరుగుతున్న టెస్ట్‌లోనూ దానిని కొనసాగిస్తున్నాడు.

దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ నాలుగో రోజు ఆట ముగిసే సరికి.. ఇప్పటివరకు మొత్తమ్మీద మిచెల్ స్టార్క్ 5,495 బంతుల వేసి... ఒక్క సిక్సర్ కూడా ఇవ్వకుండా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇక రెండో స్థానంలో ఇంగ్లండ్ దిగ్గజ బౌలర్ జేమ్స్ అండర్సన్ ఉన్నాడు. అతడు 4,688 బంతుల్లో ఒక్క సిక్సర్ కూడా ఇవ్వలేదు. టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా 4,478 బంతులతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్ మాజీ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ 4,302 బంతులతో 4వ, న్యూజిలాండ్ మాజీ పేసర్ కొలిన్ డి గ్రాండ్‌హోమ్ 4,054 బంతులతో ఐదు స్థానాల్లో నిలిచాడు.

# తొలిటెస్ట్‌లో గెలుపు ముంగిట ఆస్ట్రేలియా



- **రెండో ఇన్నింగ్స్‌లోనూ సత్తా చాటిన రెన్ షా**
- **సౌతాఫ్రికా విజయలక్ష్యం 421, ప్రస్తుతం 102/4**

దర్బన్ వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా విజయం ముంగిట నిలిచింది. 421 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా నాలుగోరోజు సోమవారం ఆట ముగిసే సరికి నాలుగు వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసి పీకల్లోతు కష్టాల్లో ఉంది. ఎడెన్ మార్‌క్రమ్ 45 (115 బంతుల్లో), వియాన్ ముల్డర్ 5 (23 బంతుల్లో) క్రీజులో ఉన్నారు. దక్షిణాఫ్రికా జట్టు విజయానికి ఇంకా 319 పరుగులు చేయాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియా బౌలర్ల విజృంభణ చూస్తుంటే ఇది కష్టసాధ్యంగానే కనిపిస్తోంది.

ఆస్ట్రేలియా బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ 2, ప్యాట్ కమ్మిన్స్, మ్యాట్ రెన్‌షా చెరో వికెట్ తీశారు.

అంతకు ముందు 314-6 స్కోర్ వద్ద రెండో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా ముందు 421 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ శతకం బాదిన మ్యాట్ రెన్‌షా రెండో ఇన్నింగ్స్ లోనూ (82) సత్తా చాటాడు. జట్టులో ప్రతి ఆటగాడు తలో చేయి వేయడంతో ఆసీస్ ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. మ్యాడిసన్ 48, ట్రావిస్ హెడ్ 11, లబుషేన్ 37, స్టీవ్ స్మిత్ 27, క్యారీ 24, కమిన్స్ (32 నాటౌట్), వెబర్ 39 (నాటౌట్) పరుగులు చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో నోర్జే, మహరాజ్ 2 వికెట్ల చొప్పున.. యాన్సెన్, హార్మర్ చెరో వికెట్ పడగొట్టారు.

అంతకుముందు సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బౌలర్లు సత్తా చాటడంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ లో ఒక్కరు కూడా కనీసం హాఫ్ సెంచరీ చేయలేకపోయారు. 49 పరుగులు చేసిన డేవిడ్ బెడింగ్హామ్ టాప్ స్కోరర్ కాగా.. మార్‌క్రమ్(37), స్టబ్స్ (32), ముల్డర్ (30), వెర్రెన్ (13), యాన్సెన్ (26), హార్మర్ (35 నాటౌట్), కేశవ్ మహరాజ్ (34), నోర్జే (16) రెండంకెల స్కోర్లు చేశారు. ఆసీస్ బౌలర్లలో కమిన్స్ 3 వికెట్లు తీయగా.. స్టార్క్, హేజిల్‌వుడ్, లియోన్ తలో 2, వెబర్ ఓ వికెట్ పడగొట్టారు.

అంతకుముందు మ్యాట్ రెన్షా (190) సెంచరీతో కదం తొక్కటంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 390 పరుగులు చేసింది. రెన్షాకు కమిన్స్ (43), లియోన్ (27), లబుషేన్ (37), స్టీవ్ స్మిత్ (25) సహకరించారు. సౌతాఫ్రికా బౌలర్లలో ముల్డర్ 4, యాన్సెన్ 3, నోర్జే 2, హార్మర్ ఓ వికెట్ పడగొట్టారు.

చైతన్య రథం
# సినిమా
మంగళవారం 13 అక్టోబరు 2026 

## కండక్టర్‌గా ఉన్నప్పుడే
# హ్యాపీగా ఉండేవాడిని




బస్సు కండక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించిన రజనీకాంత్ ఆ తరువాత నటుడిగా మారి దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తూ సూపర్‌స్టార్‌గా ఎదిగారు. రజనీకాంత్‌లో అభిమానులకు నచ్చేది తన నటన మాత్రమే కాదు, ఎంత ఎత్తుకు ఎదిగినా వినయంతో ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వం. ఎన్నో సందర్భాల్లో తన జీవిత ప్రయాణం గురించి మాట్లాడిన ఆయన, తాజాగా మరోసారి బెంగళూరులో బస్సు కండక్టర్‌గా చేసినప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం నటుడిగా అగ్రస్థాయిలో ఉన్నప్పటికీ, కండక్టర్‌గా పనిచేసినప్పుడే ఎక్కువ సంతోషంగా ఉండేవాడినని తెలిపారు.

ఇటీవల చెన్నైలో జరిగిన 'జైలర్ 2' ప్రచార కార్యక్రమంలో చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ, రజనీకాంత్‌లోని వినయం గురించి ప్రస్తావించారు. దీనికి రజనీ స్పందిస్తూ తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. నేను స్టార్‌ను అయినప్పటికీ, నాకు నటనంటే ఇష్టం. అయితే అంతకంటే బస్సు కండక్టర్‌గా పనిచేయడమే ఇంకా ఇష్టం. నేను అయిదేళ్ల పాటు కండక్టర్‌గా పనిచేశాను. ఇప్పటికీ ఆ ఉద్యోగాన్ని మిస్ అవుతుంటాను.

నేను తరచూ బెంగళూరు వెళ్లేది కూడా అందుకే. నన్ను నేను ఎప్పుడూ ఓ స్టార్‌గా భావించలేదు. ఇప్పటికీ బస్సు కండక్టర్‌గానే భావిస్తుంటాను. అలాంటప్పుడు, నాలాంటి ఓ బస్సు కండక్టర్ మీలాంటి పెద్ద వ్యక్తి ముందు ఎలా ప్రవర్తిస్తారు చెప్పండి.. అంటూ రజనీకాంత్ వినయంగా బదులిచ్చారు. ఈ వ్యాఖ్యలతో ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో మరోసారి అర్థమైందని అభిమానులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా జైలర్‌కు సీక్వెల్‌గా తెరకెక్కిన 'జైలర్ 2' అక్టోబరు 15న విడుదల కానుంది.





## అప్పుడే 30 ఏళ్లు పూర్తయ్యాయా?

ఏపీ డిప్యూటీ సీఎం, పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ సినీ ప్రయాణానికి 30 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. ప్రియమైన పవన్ కల్యాణ్.. మనం కలిసి చేసిన తొలి సినిమా (అక్కడ అమ్మాయి – ఇక్కడ అబ్బాయి)కి అప్పుడే 30 ఏళ్లు పూర్తయ్యాయంటే ఆశ్చర్యంగా అనిపిస్తోంది. సినీ పరిశ్రమలో మీది ఒక అద్భుతమైన ప్రయాణం. 30 వసంతాలు పూర్తి చేసుకున్నందుకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. మీరు ఎంచుకున్న ఏ మార్గంలోనైనా మరెన్నో విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పోస్ట్‌లో అరవింద్ పేర్కొన్నారు. సినిమాలకే పరిమితం కాకుండా సమాజం కోసం పవన్ చేస్తున్న సేవలను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. ఇక, పవన్ కల్యాణ్, నటి సుప్రియ ప్రధాన పాత్రల్లో ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'అక్కడ అమ్మాయి– ఇక్కడ అబ్బాయి' చిత్రాన్ని అల్లు అరవింద్ నిర్మించారు. 1996లో ఈ సినిమా విడుదలైంది.

## హీరోయిన్‌గా శ్రీకాంత్ కుమార్తె మేధ




టాలీవుడ్ హీరో శ్రీకాంత్ కుమార్తె మేధ హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. ఓ చక్కటి లవ్ స్టోరీతో ప్రేక్షకులను పలకరించనున్నారు. ఈ మేరకు తాజాగా సినిమా పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. 'మైత్రీ ఇన్ లవ్' పేరుతో ఈ సినిమా రానుంది. జై జాస్తి, మేధ హీరో హీరోయిన్లుగా పరిచయమవుతోన్న ఈ చిత్రానికి పృథ్వీ వనం దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీస్ మేకర్స్ నిర్మిస్తోంది. 'వారితో మొదలై, మీ హృదయాల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే ప్రేమకథ ఇది' అనే క్యాప్షన్‌తో ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సోమవారం చిత్రబృందం విడుదల చేసింది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ మూవీకి సంబంధించి మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలిపింది.

హీరోయిన్‌గా మేధ టాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వనున్నట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. అయితే, ఆమె వెండితెరకు కొత్తేం కాదు. అనుష్క ప్రధానపాత్రలో వచ్చిన 'రుద్రమదేవి' చిత్రంలో చిన్నప్పటి రుద్రమదేవి పాత్రలో మేధ కనిపించి మెప్పించారు. ఇక, ఇప్పటికే శ్రీకాంత్ తనయుడు రోషన్ నటుడిగా అలరిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం శైలేష్ కొలను దర్శకత్వంలో 'ఏమో ఏమో ఇది' అనే రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్‌లో రోషన్ నటిస్తున్నాడు.

## వైష్ణవి ఆశలన్నీ 'హలో కాదల్' పైనే




తెలుగమ్మాయి వైష్ణవీ చైతన్య నటించిన 'ఎపిక్' సినిమా భారీ అంచనాల నడుమ విడుదలై, ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. దాంతో తాను నటిస్తున్న తాజా తమిళ చిత్రం 'హలో కాదల్' పైనే ఆశలన్నీ పెట్టుకుని ఎదురుచూస్తోంది. అయితే వైష్ణవీ చైతన్యకు ఇది మొదటి తమిళ సినిమా కాదు. గతంలో అజిత్ నటించిన 'వాలిమై' చిత్రంలో వైష్ణవి చైతన్య నటించింది. కానీ ఆమె హీరోయిన్‌గా నటించిన మొదటి సినిమా మాత్రం ఇదే! ఆర్య హీరోగా నటిస్తున్న 'హలో కాదల్'లో మలయాళీ నటి నిఖిల విమల్ మరో కథానాయికగా నటిస్తోంది. తాజాగా మూవీ టైటిల్ టీజర్‌ను మేకర్స్ ప్రకటించారు. ఈ ఏడాది డిసెంబర్ 4న 'హలో కాదల్' విడుదల కాబోతోంది. ఇది ఆర్య నటిస్తున్న 40వ చిత్రం. ఈ రొమాంటిక్ కామెడీ మూవీని నిఖిల్ మూర్తి డైరెక్ట్ చేస్తున్నాడు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు ఆర్య సమర్పకుడు, అతని భార్య సాయేషా నిర్మాతగా వ్యవహరిస్తోంది.

## సుహాస్ తాజా సినిమా 'హైడ్ అండ్ సిల్క్'




విలక్షణ నటుడు సుహాస్ ప్రధాన పాత్రలో, రాజేంద్ర బాల దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. సంజనా కృష్ణమూర్తి కథానాయిక. కార్తికేయన్ సంతానం, వార్తికా జైన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టైటిల్ ఖరారైంది. ఈ సినిమాకి 'హైడ్ అండ్ సిల్క్' అనే పేరును ఖరారు చేశారు. ఈ మేరకు కొన్ని ప్రేమకథలు రాసినవి కావు, అల్లినవి.. అనే క్యాప్షన్‌తో సోషల్ మీడియాలో టైటిల్ ప్రోమోను విడుదల చేశారు.

### మూడు ప్రాజెక్ట్‌తో
## వైష్ణవ్ కమ్‌బ్యాక్!

తొలి చిత్రం 'ఉప్పెన'తో బాక్సాఫీస్ వద్ద వంద కోట్ల గ్రాస్ కొల్లగొట్టిన పంజా వైష్ణవ్ తేజ్.. ఆ తర్వాత సరైన సక్సెస్ లేక కొంత వెనుకబడ్డారు. 'ఆదికేశవ' తర్వాత దాదాపు మూడేళ్లుగా వెండితెరకు దూరంగా ఉంటున్న ఆయన కెరీర్‌పై రకరకాల చర్చలు నడిచాయి. అయితే, ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న వైష్ణవ్ తేజ్ ఇప్పుడు ఒకేసారి ఏకంగా మూడు ప్రాజెక్టులతో కమ్‌బ్యాక్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.



ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వైష్ణవ్ తేజ్ ఓ చిత్రం చేయనున్నారు. 'కథలో రాజకుమారి' ఫేమ్ మహేష్ సూరపనేని ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. అతి త్వరలోనే ఈ మూవీపై అధికారిక ప్రకటన వెలువడనుంది. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఊరు పేరు భైరవకోన' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేకమైన ఫాంటసీ,సస్పెన్స్ బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న వి.ఐ. ఆనంద్ దర్శకత్వంలో వైష్ణవ్ మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ఈ లైనప్‌లో అన్నింటికంటే హాట్ టాపిక్‌గా మారిన ప్రాజెక్ట్.. పరశురామ్ పెట్టాలో చేయనున్న చిత్రం. 'గీత గోవిందం', 'సర్కారు వారి పాట' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలతో ఫ్యామిలీ, యూత్ పల్స్ పట్టుకున్న పరశురామ్.. వైష్ణవ్ తేజ్ కోసం ఓ చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేశారని సమాచారం. ఈ భారీ చిత్రాన్ని టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మించనున్నట్లు తెలుస్తోంది.




## జొన్నగిరి వజ్రాల గనుల నేపథ్యంలో 'జోజో'

వినోదం, ప్రేమ,భావోద్వేగాలు, అనూహ్య మలుపుల కలయికతో తెర కెక్కుతున్న చిత్రం 'జోజో'.జొన్నగిరి వజ్రాల గనుల నేపథ్యంలో సాగే ఈ సినిమాలో కృష్ణకమల్, మహీ, మకరంద్ దేశ్‌పాండే, ఫణి, తదితరులు కీలకపాత్రల్లో నటిస్తున్నారు.దేవా కట్టా సమర్పణలో, కిరణ్ జయ్‌కుమార్ దర్శకత్వంలో విజయకృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మనో భావాల బ్యాచ్ ఇది మీకోసం మాత్రం కాదు' అంటూ ప్రమోట్ చేస్తూ 'కాషన్ 1'పేరుతో సినిమాటీజర్‌ను సోమవారం విడుదలచేశారు.ఇందులో మాటలు ఆకట్టుకుంటున్నాయి. మరి జొన్నగిరి వజ్రాల గనుల నేపథ్యంలో సాగే ఈకథ ప్రేక్షకులకు ఎలాంటిఅనుభూతిని అందించనుందో చూడాలి.